ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



25 నయాపైసలు

12-2-58

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEK



"వానాలు కురవాలి, వరిచేలు పండాలి"

[తెలంగాణా రైతు]

ఫొటో: గాదె శేషగిరిరావు, రాజమండ్రి]



నేషనల్-ఎక్కో వారి
క్రొత్త రేడియో...
సొగసైన మోడలు యు-717
అనుకోనంత తక్కువ ధర
రు. 250/- మాత్రమే
మీరు కొనగలిగే ధరలో ఒక చక్కని రేడియో...నేషనల్-ఎక్కో మోడలు యు-717! ఈ సొగసైన ఆల్-వేవ్ సెట్‌లో తక్కువ ధర రేడియోలలో యింతకు ముందు చేర్చని విశేషాంశములు ఎన్నో కలవు.
ఈ దివ్యమైన క్రొత్త మోడలును ఒక నేషనల్-ఎక్కో వ్యాపారి వద్ద నేడే చూడండి. అంత తక్కువ ధరకు యింత మంచి రేడియో దొరకుటకు మీ యింట్లోవారందరూ ఆశ్చర్యపోతారు.
మోడలు యు-717: 6 వాల్వులు, 3 బ్యాండులు, ఆల్-వేవ్ సూపర్ హెట్, 'మాన్‌సూనైజ్‌డ్' రేడియో. 7"x4" సైజు లౌడ్‌స్పీకరు: గ్రామఫోను మరియు ఇతర లౌడ్‌స్పీకరు పెట్టుకొనుటకు ఏర్పాటు: మరూన్ రంగులో అందమైన ప్లాస్టిక్ క్యాబినెట్: ఏసి/డిసి సెట్ రు. 250/- నెట్
స్థానిక పన్నులు అదనము.
జెనరల్ రేడియో & అప్లయెన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్
ఒపేరా హౌస్, బొంబాయి 4 • 8 మదన్ స్ట్రీట్, కలకత్తా 13
1/18 మౌంట్ రోడ్, మద్రాసు • 36/79 సిల్వర్ జూబ్లీ పార్క్ రోడ్, బెంగుళూరు • భోగ్గియాన్ కాలనీ, చాందినీ చౌక్, ఢిల్లీ
GRA

సంవత్సర చందా
రు. 13-0-0
విడిప్రతిక 25న.పై

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 25
12-2-58

Founder : K. NAGESWARA RAO

హేవిళంబి మాఘం బహుళ నవమి బుధవారం

★ విషయానుక్రమణిక ★

ముఖచిత్రం :
ఏ. వి. యం. వారి హిందీచిత్రం
'భాభి'లో నళినీ భోంకార్.

★

న్యూఢిల్లీ లేఖ	— 4
నేను చదివిన పుస్తకం / నాకు నచ్చిన పాత్ర	— 6
సాహిత్యగోష్ఠి	— 8
మహాభారతం	— 9
పెళ్ళిచేసుకోను	— 13
దగాపడిన తమ్ముడు	— 17
అబలచేసిన ఉపకారం	— 20
శిష్యురాలు	— 25
నక్షత్రఫలితాలు	— 31
వనితాలోకం	— 35
ఆడవాళ్లు; ఆత్మహత్యలు	— 37
గృహవైద్యం	— 39
వనితావాణి	— 40
బాలసాహితి	— 43
హాల్ దొర	— 44
సినిమా	— 50

మధ్య పేజీలలో ముఖ్య ప్రకటన:

ఉత్తమ నవలకు రు 501/- బహుమతి!




మహర్షి సాంబమూర్తి అస్తమయం

ఆంధ్ర కాంగ్రెస్ అగ్రనాయకులలో ఒకరైన మహర్షి బులుసు సాంబమూర్తిగారు 72-వ ఏట, ఫిబ్రవరి 2-వ తేదీ ఉదయం, కాకినాడలోని తమ స్వగృహంలో పరమపదించారు. వీరి మృతితో దేశసేవలో పండుపడిన మరొక మహనీయుణ్ణి ఆంధ్రదేశం కోల్పోయింది.

సాంబమూర్తిగారు స్థితప్రజ్ఞులు. అనేక జాతీయ యుద్ధాలలో ఆరితేరిన వృద్ధమూర్తి. మహాత్ముని స్వాతంత్ర్యోద్యమ శంఖారావం వినగానే, వేలకువేలు ఆర్జించి పెడుతున్న న్యాయవాద వృత్తిని తృణప్రాయంగా త్యజించి, సర్వస్వమూ దేశానికి సమర్పించిన మహాత్యాగి.

1937 లో నూతన రాజ్యాంగం ప్రప్రథమంగా అమలులోకి వచ్చినప్పుడు అవిభక్త మద్రాసు రాష్ట్ర శాసనసభకు అధ్యక్షుడుగా వ్యవహరించారు. ఆ పదవిలో వారు చేసిన నిర్ణయాలు ప్రశంసార్హమైనవి. అప్పటిలో భారతదేశంలో వున్న సభాపతులందరిలోనూ ఆదర్శ సభాపతి అనే ఖ్యాతి నార్జించారు.

వీరి మృతి ఆంధ్రులకు తీరని సంతాపహేతువు. రాష్ట్ర సాధనకై అహర్నిశలు కృషిచేసిన సాంబమూర్తిగారు ఆంధ్రావతరణను, విశాలాంధ్రావతరణను కూడా చూడగలిగారు. వారు ధన్యజీవి. వారికుటుంబానికి ఇదే మా సానుభూతి. ★



న్యూఢిల్లీ లేఖ

★ భారత వైద్యనిలయంలో అవకతవకలు ★

శ్రీకృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

ఒక వారం రోజులు తీవ్రంగా రిహార్సల్స్ జరిగాక రిపబ్లిక్ ఉత్సవదినాన బ్రహ్మాండమైన 'పెరేడ్' జరగింది. ఆఏటికాఏడు ఈ 'పెరేడ్' బాగా ఆకర్షణీయంగా తయారవుతోంది.

ఈ ఏడు జరిగిన ఉత్సవంలో విశేషాలు:

ప్రతి ఏడూ పెరేడ్ చూడటానికి రమ్మని పిలిచిన వారందరికీ వేర్వేరు స్థలాలలో సీట్లు ఏర్పాటు చేస్తారు. పత్రికా ప్రతినిధులకు కూడా ఒక ప్రత్యేక స్థలం ఇచ్చారు. కాని ఈ ప్రత్యేక స్థలంలో సీటను చాలమటుకు పత్రికలతో దూరపు చుటరికం కూడా లేని పెద్దలు ఆక్రమించారు. ఉదాహరణకి ఇద్దరు ఆంగ్లో ఇండియన్ వనితలు దర్జాగా పత్రికా విలేఖరుల సీట్లలోకివచ్చి కూర్చోటం నేను చూశాను. ఈ వనితామణులకి పత్రికలతో మగవారి తరఫునగాని, ఆడవారి తరఫునగాని ఏవిధమైన సంబంధమూ లేదు. వాకబు చేయగా తేలిందేమిటంటే 'మానవకారుణ్య భావం' అనే సాకుతో వీరిని రానిచ్చారట. భారతదేశం ఏ ఒక్కరిసొత్తూ కాదూ గనుక పెరేడ్ చూడటానికి ప్రతివాడికీ హక్కు ఉంది. అందుచేత సీట్ల మీద అజమాయిషీ లేకుండా చేశారన్నమాట. అజమాయిషీయే ఉంటే మనది 'పోలీసురాజ్య' మైపోతుంది! అయితే ఒక ప్రశ్న:-అధికారులకీ, విదేశీ రాయబారులకీ ఏర్పాటు చేసిన సీట్లనుమటుకు "మానవకారుణ్యభావం"తో ఎందుకు వదిలెయ్యలేదు? ముందువచ్చిన వాళ్ళు ముంగుసీట్లలో కూర్చోవచ్చు అనే సూత్రం విదేశీ రాయబారులసీట కెందుకు వర్తించదు? అమెరికన్ రాయబారి బంకర్ తన కేర్పాటు చేసిన సీటులో కర్తానిహాల్ సింగ్ తాలూకు లాలా చామూరాంవచ్చి కూర్చోటం చూసి తెల్లపోవటం చూసే ముచ్చటగానే ఉంటుంది. 'నా సీటు నాకిప్పించ'మని ఆయన అక్కడి బంట్రోతులని అడిగితే వాళ్ళు విననట్టుమరో వైపుకు చూడటం ఇంకా మజాగా ఉంటుంది. అయితే అలా జరగలేదు గనక సరిపోయిందనుకోండి. నేననేది ఒకవర్గం ప్రేక్షకులకి ఒక మర్యాదా, మరోవర్గం ప్రేక్షకులకి, మరోమర్యాదా ఎందుకు చూపించాలీ అని.


* * *

అఖిల భారత వైద్యనిలయం ప్రభుత్వపు ఆధ్వర్యాన నడిచే స్వతంత్ర సంస్థ. ఈ నిలయం పరిపాలక వర్గానికి అధ్యక్షురాలు మాజీ ఆరోగ్యమంత్రిణి రాజకుమారి అమృతకౌర్.

ఈ వైద్యనిలయం స్థాపించాలని సూచన చేసినది భోర్ కమిటీ. ఆసియాలోని దేశాల్లో ఏవైనా వైద్య పరిశోధనలో సహాయం కావలసి అడిగితే సహాయం చేసేందుకు కూడా ఈ నిలయాన్ని ఉద్దేశించారు.

మొదటినించీ దీనికన్నీ అడ్డంకులే. డా॥ లక్ష్మణస్వామి మొదలియార్ అధ్యక్షుడుగా డా॥ జీవరాజ్ మెహతా సభ్యుడుగా ఒక కమిటీని వేసి నిలయానికి స్థలం చూడమన్నారు. డా॥ జీవరాజ్ మెహతాకు ఇదంటే మొదటినుంచీ ఇష్టంలేదు. ఆయన ఈ నిలయం బదులు దేశంలోని వైద్య కళాశాలలనే అభివృద్ధిచేయవచ్చునని సూచనచేశారు. చివరికి ఆయన అభిప్రాయాన్నే ఆమోదించారు.

ఆ తరువాత న్యూజీలెండ్ ప్రభుత్వం ముందుకొచ్చి, కొలంబో పథకం క్రింద ఈ నిలయ నిర్మాణానికి పది లక్షల పౌనులు ఇస్తామని వాగ్దానం చేసింది. దీనికి భారత ప్రభుత్వం సమ్మతించింది. 1952 ఏప్రిల్ 4 తేదీన న్యూజీలెండు మంత్రి జె. టి. వాట్స్ పునాది రాయివేశారు. మధురా రోడ్డుమీద సెంట్రలు జైలుదగ్గర్లో శంకుస్థాపన జరిగింది. దీంతో రాజకుమారి అమృతకౌర్ కూ, అప్పటి ఢిల్లీ ఆరోగ్య మంత్రిణి డా॥ సుశీలా నయ్యర్ కూ రగడ పెరిగింది. ఇర్విన్ ఆస్పత్రిని భారత వైద్య నిలయానికి అనుబంధించాలని రాజకుమారీ, అదికూడదని నయ్యరూ. రాజకుమారే ఓడిపోయింది. ఆ తరువాత జరిగిందేమంటే గట్టిగా తాపడంచేసిన పునాది రాయిని తొలగించి మరుట్ రోడ్డులో ఇప్పుడున్న స్థలానికి మార్చారు. వేసినపునాది రాయిని మార్చటం ఇదే మొదటిసారి కాదు. ఇదివరకనేకసార్లు జరిగిందే. అసలు



రిపబ్లిక్ దినోత్సవంనాడు సికిందరాబాదు పెరేడ్ మైదానంలో జరిగిన సైనిక విన్యాసాలను గవర్నరు శ్రీ భీమసేన్ సచార్ తిలకించారు.

న్యూఢిల్లీ నగరంపునాదిరాయినే మార్చారు. అయిదవజార్జి రాజు ఇప్పుడు విశ్వవిద్యాలయావరణలో సెంట్ స్టీఫెన్స్ కాలేజీ ఉన్న చోట శంకుస్థాపన చేయగా తరవాత దాన్ని ఇంకోచోటికి మార్చారు.

వైద్యనిలయ నిర్మాణం ఇంకా ప్రారంభదశలో ఉండగానే ఉపాధ్యాయులను నియమించటం మొదలైంది.

ఈ నియామకాన్ని పార్లమెంటు లోపలా ఇవతలా ఘాటుగా విమర్శించారు. అసలు యూనియన్ పబ్లిక్ సర్వీసు కమీషనుతో ప్రమేయం లేకుండా ఈ నియామకం జరిగింది. డా॥ లక్ష్మణస్వామి ముదలియార్, కర్నల్ సి. కె. లక్ష్మణన్, డా॥ సి. జి. పండిట్, డా॥ వి. ఆర్. ఖమేల్కర్, డా॥ బి. బి. దీక్షిత్, డా॥ కె. సి. కె. ఇ. రాజాలతో ఒక నియామక సంఘం ఏర్పరచారు. డా॥ కె. సి. కె. ఇ. రాజాఎప్పుడూ ఉపాధ్యాయవృత్తిలో లేరు. డా॥ సి. జి. పండిట్ ఇరవైఐదేళ్ళనించీ ఉపాధ్యాయవృత్తిలో లేరు.

రాష్ట్రాలవారీగా చూస్తే, ఈ నియామక సంఘంలో ముగ్గురు మహారాష్ట్రులు, ఒకరు మద్రాసువారు, ఇద్దరు మలబారుకు చెందినవారు. స్త్రీల ప్రతినిధి ఎవరూ సంఘంలో లేరు. ఇప్పటిదాకా ఈ సంఘం ఈ క్రింది వారిని నియమించింది:—

ఫిజియాలజీ- డా॥ ఆనంద్; ఫార్మకాలజీ- డా॥ కరాన్ ధి కౌర్; రేడియాలజీ- డా॥ గదేకర్; బయోకెమిస్ట్రీ- డా॥ వరవ్ దేకర్; పాతాలజీ- డా॥ రామలింగస్వామి.

మళ్ళీ రాష్ట్రాలవారీగాచూస్తే ఈ అయిదుగురిలో ముగ్గురు మహారాష్ట్రులు, ఒకరు పంజాబుకూ, ఒకరు దక్షిణ భారతానికీ చెందినవారు. వైద్య నిలయం డైరెక్టరు ఉద్యోగానికి దరఖాస్తులు పంపుకోమని ప్రకటన చేయనేలేదు. తీరా ఆ ఉద్యోగంలో నియమింపబడిన వ్యక్తికి పరిపాలనానుభవం ఏ మాత్రంఉందో అనూహ్యం. పైన చెప్పిన వ్యక్తుల్లో ఒకాయనకి ఏ శాఖకు ప్రొఫెసరుగా నియమింపబడ్డాడో ఆ శాఖలో పోస్టు గ్రాడ్యుయేట్ అర్హత ఏమీ లేదు. మరొక ప్రొఫెసరు అనేక సంవత్సరాలు డింకీలుకొట్టి పరీక్షపాసయిన వ్యక్తి. ఇంకో ప్రొఫెసరుకు బోధనానుభవం శూన్యం.


ఆ యీ విషయాలన్నీ పార్లమెంటు గుర్తించకపోలేదు. డా॥ సీతా పరమానంద్ 1957 ఆగస్టు 27 న రాజ్యసభలో మాట్లాడుతూ ఇలా అన్నది:—

"భారత వైద్యనిలయం సిబ్బందిని ఏ విధంగా నియమించారో ఒక సంఘాన్ని వేసి దర్యాప్తు చేయిస్తే, మొత్తం సిబ్బందినంతా బర్తరఫ్ చేయవలసి వుంటుందని నా నమ్మకం."

పార్లమెంటు శాసనాలుచేసి ఏర్పాటు చేసిన స్వతంత్ర సంస్థలతో ఇక్కడే వస్తోంది చిక్కు. ఈ సంస్థలు భారత సమాహారనిధినుంచి డబ్బు తీసుకుని వాడుకుంటాయి. అందుచేత ఆ సంస్థలకు బాధ్యత వహించిన మంత్రి పార్లమెంటులో ప్రశ్నలు వేస్తే సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. ఆ సంస్థలు చేసే పనులను సమర్థించుకోవలసిన బాధ్యత మంత్రిపై పడుతుంది. ఇప్పుడేమవుతోంది? పార్లమెంటు నిర్ణయాల్ని గాని, ప్రభుత్వ నిర్ణయాల్ని గాని అమలు జరపాలని ఆరోగ్యశాఖ నిర్ణయిస్తే అలా జరగడానికి వీలేదని రాజకుమారీ అమృత్ కౌర్, ఆమె నిలయమూ వ్యతిరేకించటం జరుగుతోంది. పార్లమెంటులో మాత్రం ఆ వైద్య నిలయ పరిపాలక సంఘం ఏం చేసినా సమర్థించుకునే బాధ్యత ఆరోగ్య మంత్రిదే. ఇటీవల డా॥ సీతా పరమానంద్, డా॥ కె. అచ్చమాంబ చేసిన తీవ్ర విమర్శలవల స్వతంత్రసంస్థ అయిన వైద్య నిలయం కొంచెం జంకింది. నియామక సంఘంలో సభ్యుల్ని కొందర్ని మార్చారు. ఇప్పుడు దాంట్లో ఈ క్రింది వారున్నారు:—

డా॥ లక్ష్మణస్వామి ముదలియారు, డా॥ జీవరాజ్ మెహతా, డా॥ ఎమ్. డి. డి. గిల్డర్, డా॥ సుఖన్ రాం, కర్నల్ పి. కె.

(49-వ పేజీ చూడండి)



"విశ్వనాథ" వారి "ఏకవీర"

దక్షిణాపథము; మధురా రాజ్యము; ముద్దుకృష్ణప్ప నాయకుని దొరతనము. వృద్ధ సేనాని కొడుకు కుట్టాన్. దుర్గాధ్యక్షుడు వీరభూపతి సామాన్య సంసారి మొదట. కుట్టాన్ అనుగ్రహం ఆసరాగా స్థానాపతి అయాడు.

నాయక రాజ్యములో సముద్రతీరాన సేతువులపై పెత్తనం వహించి రాష్ట్రములో తిరుగుబాటు రాకుండా పంటపొలాలకు కాలువ నీటి పంపకములో కాలుదార్లకు ఏలాటి తంటాలు రాకుండానూ, దుర్బుద్ధితో దురాక్రమణకు దిగుతూన్న విదేశీయుల (పోర్చుగీసులు)వల రాష్ట్రీయులకు ఏ ఉపద్రవాలు రాకుండానూ చూచే బాధ్యత కల వారిని సేతుపతులని దక్షిణాపథ రాజ్యం వ్యవహరించింది... ఈ సేతుపతులే ప్రధాన సేనానులై కూడా రాష్ట్రాన్ని వేయికళ్లతో కనిపెట్టుతూ ఉంటారు. 'ఏకవీర' కథాకాలము నాటికి ఉదయన్ సేతుపతీ, దళవాయిన్నీ. ఈ ఉదయన్ సేతుపతికొడుకే కథానాయకుడు కుట్టాన్.

కుట్టాన్ కనికరమూ, స్నేహమూ, ప్రేమ ముప్పేటగా అల్లుకొని వీరభూపతికి స్థానాపతి ఉద్యోగమును ఇప్పించింది.

కుట్టాన్ పాతికేళ్ళ వాడు. వీరభూపతి ఇంకో నాలుగైదేళ్ళు పెద్దవాడు. మధురలో కుట్టాన్ వీరభూపతులు కలుసుకొన్నది మొదలు అనుకోకుండా మిత్రులైనారు. వారిరువురి మధ్యను రహస్యమన్నది పిసరంతైనా లేదు.

ఒకనాడు వీరభూపతి తన ప్రియురాలి వృత్తాంతమును కుట్టానుకు చెప్పాడు. ఆమె పేరు గాని, ఊరు గాని చెప్పలేదు. చెప్పనన్నాడు. ఆ పట్టుదలతో నే ఏకవీర చరిత్ర నూటతొంబది పుటలకు నడవగలిగినది.

వీరభూపతికంటె ముందుగానే కుట్టాన్ తన వలపుల రాణి చరిత్ర వీరభూపతికి వినిచి కంటనీరు పెట్టుకొన్నాడు.

కుట్టాన్ కులాచారమును అనుసరించి పెండ్లాడిన ఇల్లాలు ఏకవీర.

తలిదండ్రుల అభిలాషకు కట్టుబడి వీరభూపతి చేపట్టిన గృహిణి మీనాక్షి.

పెండ్లి కాకముందు, అయినతరువాత సిరిసంపదలకు ఏలాటి లోటూ లేని పిల్ల, ఇల్లాలు ఏకవీర.

యామిజాల పద్మనాభస్వామి

వివాహానికి ముందు సామాన్య సంసారి కూతురు, తరువాత స్థానాపతి భార్య మీనాక్షి. జీవితానికీ, కులానికీ కావలసిన చదువు లన్నీ సకాలములో నేర్చిన విద్యాధికుడు కుట్టాన్. రాజ్యానికి ఆయువుపట్టు ఆర్థిక శాఖనూ, స్థానిక పరిపాలన శాఖనూ ఒకడు వేలెత్తి చూపడానికి వీలీయకుండా సరిదిద్దుకునే చదువులు నేర్చుకొన్న కుశాగ్రబుద్ధి వీరభూపతి.

మధురా రాజ్యలక్ష్మికి కుట్టాన్ జీవాత్మ, వీరభూపతి పరమాత్మ.

ఇద్దరూ తమ తమ విధులు నెరవేర్పడములో రాజుకీ ప్రజలకూ పరమాప్తులయారు. ఇద్దరూ ప్రాణ స్నేహితులు.

"నీ భార్యను నీవు మనసారా ప్రేమించాలి:" అని వీరభూపతి చనువు బలిమివల్ల కుట్టానును వినయపూర్వకంగా శాసించి హెచ్చరించాడు. ప్రేమిస్తానని శపథం చేయించుకొన్నాడు... శపథము శపథముగానే నిలిచిపోయినది. అంతఃపురములో శయ్యామందిరమున ప్రవేశించి మామూలుగా తన పెద్ద మంచముమీద నిద్రించడానికి కుట్టాన్ చూచేడు. ఒత్తుగా పఱచిన మల్లెపూవులలో ఏకవీర గోధుమవన్నె త్రాచువలె ముడుచుకొని పండుకొన్నది........ ఆమె వైచిన పూదండను రాముడు శివుని విల్లును విడిచినట్టు కుట్టాన్ రెండు ముక్కలుగా త్రుంచి పారవేసినాడు.

వీరభూపతికి తానిచ్చిన ప్రమాణవాక్యం, ఏకవీర తన మెడలో వైచిన పూదండతో పాటు రెండు ఖండాలై పోయింది.

పెండ్లికాకముందు మేనమామగారింటికి వెళ్ళి కుట్టాన్ కొన్నాళ్ళున్నాడు. మేనమామ వేయించిన 'పువ్వుతోట' లో పువ్వులు కోసి దండ గుచ్చుకొంటూన్న అమ్మాయి కుట్టాన్‌కంట పడింది. ఆ పువ్వులు శివునిపూజకి ఉపయోగించవలసేవి అన్నాడు చిలిపిగా. ఆ అమ్మాయికి కోపం వచ్చింది. చివాలున దండ కుట్టాన్ మీదికి విసిరివేసి పారిపోయింది. ఆ దండ కుట్టాన్ పాదాల మీదవచ్చి పడ్డది. ఏదో పనిమీద ఆ పిల్లను చూడ్డానికి వారి యింటికి వెళ్ళుతూ ఉండే వాడు. చిలిపిచేష్టలు ఓర చూపులై, ఎదురెదురై మనో వీధులలో ఇద్దరికీ వలపుల మేడలు కట్టాయి. ఈ విషయం మేనమామకు తెలిసింది, తండ్రి అజ్ఞ వచ్చింది యింటికి రమ్మని. బాహ్య శరీరాలు దూరందూరము లయిపోయాయి. కామ్య సాధాలు

గట్టిపడిపోయాయి. ఆ అమ్మాయికీ, వీరభూపతికీ తల్లిదండ్రుల కతంవల్ల పెండ్లి అయిపోయింది. అది నిజానికి కరవివాహం. ఆ అమ్మాయిపేరు మీనాక్షి. మీనాక్షికి బాహ్యప్రపంచములో భర్త వీరభూపతి. ఆత్మీయంగా ప్రణయమూర్తి పుట్టాణ్.

వీరభూపతి నూనూగు ప్రాయములో అంబాసముద్రం వెళ్ళడం తటస్థించింది. ఒకనాటి సాయంకాలం బాగా ముస్తాబై వాహ్యాళికి వెళ్ళుతూ ఆకస్మికంగా ఒక భవనం ముందు ఆగిపోయాడు. కిటికీకి వ్రేలాడగట్టిన పట్టుతెర ఒత్తిగించి చూస్తూన్న ఒక చక్కెరబొమ్మ వీరభూపతి నడకను సాగనీయలేదు. తెర పడింది. చీకటి క్రమ్మింది. వీరభూపతి అడుగు వెనకముఖం పట్టింది. అదేవరస కొన్నాళ్ళు. ఒకనాడు కిటికీలోనుండి ఒక వస్తువు వీరభూపతి పాదాలముందు విసిరి ఆ చక్కెరబొమ్మ తెర మరుగైనది. తటాలున వీరభూపతి ఆ వస్తువును తీసి చూసుకొన్నాడు. బిరాన బసకు వచ్చి దీపపు వెలుగున పరికించి చూశాడు. పుష్పగుచ్ఛం అది. అనుకోకుండా దానిని చిదిమేడు. దానిలో ఒక ప్రణయ లేఖ వీరభూపతి దానిని తన భాగ్యలేఖగా భావించి అక్షరం అరవైసార్లు జపంచేసినట్లు చదువుకొన్నాడు. తన జన్మసార్థకం అయినట్లూ తనవలపు సిద్ధిపొందినట్లూ నిశ్చయించుకొని ప్రేమసుధా సముద్రములో ఈదులాడాడు. ఆ లేఖలో తనను కలుసుకొనే ఉపాయమును కూడా ఆ సుందరాంగి వ్రాసిపెట్టింది...

......తాను ఆవూరు వచ్చినపని చేసినట్టూ కనబడలేదని తండ్రే స్వయంగా వచ్చాడు. ఇద్దరూ స్వగ్రామానికి పోయారు. తన ప్రణయవృత్తాంతం తల్లిదండ్రులకు తెలిసిపోయింది. తన కోరిక నెరవేరలేదు. ఆ చక్కెరబొమ్మ ఏకవీర. తల్లిదండ్రుల పెద్దరికమువల్ల ఏకవీరకూ, పుట్టానుకూ పెండ్లి అయిపోయింది. యథార్థంగా ఆ పెండ్లికి పెద్దరికం వహించవలసినవాడు మన్మథుడు... ఏకవీరకు ఆనందరసాధి దేవుడు వీరభూపతి. ఇంటికీ, వంటికీ పెద్దమాత్రమే పుట్టాణ్.

రెండూ తొర్మారు పెండ్లిండ్లే. 'వైగైనది కృశించి ప్రోషిత భర్తృకవలె సన్నగిల్లినది.'—

అవును. ఏకవీర పుట్టువుతో పూర్ణమూర్తి అయినను మధురాపురిలో పుట్టాణ్ ఇంటిలో కాలుపెట్టే సమయానికి ప్రోషిత భర్తృక అయే కృశించి వచ్చింది. ప్రకృతిలో కాలంయొక్క స్వభావాన్ని అనుసరించి అది వేసంగి. ఏకవీర సుకుమార ప్రణయవల్లరికి అది అసహ్యమైన వేసంగి. పుట్టాన్ తనను ప్రేమించలేదని ఆమెకు ఏనాడో తెలిసిపోయింది. అదే వేసంగి.

పుట్టానుకు ఏకవీరను ఏమి చేయాలో తెలియలేదు, తెలియలేదని అనుకోవద్దు. మనసుకురాని మనువు ఎందుకని ఒక తీర్మానానికి వచ్చాడా విదగ్ధుడు. ఏమీ చేయలేదు. తన మనసులో ఏకవీరకు స్థానం లేదు అది ముమ్మాటికీ నిశ్చయం!

దైవవశాత్తూ మీనాక్షిని తోబుట్టువుగా మనసారా మార్చుకొన్నాడు పుట్టాన్. పసుపు, చీరా ఇచ్చి సత్కరించాడు మీనాక్షిని. ఏదో భరించరాని బరువు దించుకొన్నానని తృప్తిపొందాడు. నిజమే. అంతతో తన మనస్సు మీనాక్షినుంచి పాముకు నేలనుంచి కాలులాగు జారిపోయింది.

మీనాక్షి పుట్టాన్ ఇచ్చిన చీరను తోబుట్టువులాగే తీసుకొని మనసారా మన్నించి కట్టుకొని అన్నగా మారిపోయిన ప్రియునకూ, ప్రియుని చోటున నిల్చున్నట్టున్న భర్తకూ వంగి నమస్కరించింది. ఆ నమస్కారంలోనే భర్త పాదాలు ప్రమాణం చేస్తూన్నట్టు గట్టిగా తన చేతులతో నిమిరింది. ఒక కంట హాలాహలాన్నీ, వేరొక కంట అమృతాన్నీ ఒలికిస్తూ వీరభూపతి మనస్సుని చిక్కపట్టుకొన్నాడు నిత్యజీవితములో లాంఛనంగా మీనాక్షి జీవితం హోరుగాలిలో గాలిపటంవలె కదిలిపోతూంది. తాను ప్రేమిస్తూన్నట్టే వీరభూపతి కనపడుతున్నాడు. సంతానంకోసం తనకు వాంఛలేదు. మన జీవిత నౌకల ఇలాగే ఆనందసముద్రములో ప్రయాణించనీ! అని మీనాక్షి తెగించి చెప్పేసింది. మనసు మళ్లించుకొన్నట్టు కనపడుతున్న వీరభూపతికి మీనాక్షి, అంతఃపురం, మధుర, తుపాను కొట్టుతూన్న సముద్రములాగే కనబడుతున్నాయి.

ఏకవీర వర్షాకాలములోనూ, శరదృతువులోనూ కూడా వేసవికాలం ధర్మాలే అనుభవించింది. మనస్సులోని ప్రియుడుసాక్షాత్కరించగానే తలంటిపోసుకొని పొడిపొడిగా విప్పారి చిరుగాలికితూగాడే వినీలకేశపాశముతో, శరచ్చంద్రికను మేలమాడే పాముకుబుసమువంటి తెల్లనిపట్టుచీరతో పాలసముద్రపునురగ బొమ్మలాగో ఉండేది. వినీతమైన ముస్తాబు, నవనీతసదృశమైన మనసు. హిమాంబు స్వచ్ఛమై పునీతమైన ప్రేమ. ఆ నిష్కలంక ప్రేమమూర్తి అదే సమయములో పుట్టానుకు గోధుమవన్నె త్రాచువలె దర్శనమిచ్చేది. మీనాక్షికి వీరభూపతిమీద ఎంత మమకారమో పుట్టాన్కు ఏకవీరపై అంతే చింత.

ఏకవీర నీవారశూకవత్తన్వి, కుంభగత ప్రదీపకళిక. ఏకాగ్రతతో మనస్సు నిర్వృతిని పొందడం ఆ నాడే ఇంద్రియాలు సుఖ

(55-వ పేజీ చూడండి)

సాహిత్య గోష్ఠి

[స్థలము: శ్మశానము; సమయము: అర్ధరాత్రి; సభికులు: జంబుకశర్మ, కరటశాస్త్రి, రాసభ దీక్షితులు, శునకరాజు (ఆస్థానకవి)]

(అంతట మహిష సార్వభౌముని ప్రవేశము)

వేత్రహస్తులు (కాక గృధ్రములు: దండధర మహోద్దండ దక్షిణభుజాదండ సమాన తుకొండ నితాంతవహనకారణ వ్రణకిణాంకిత గ్రీవా! నిజవాల ప్రోద్ధత శుష్క ప్రహద కర్దమ దూషిత కాలాంజన ప్రభావిరాజిత స్థూలంభావుక గాత్రా! నిజాంగ శోభానురూప పుంజీకృత మంజుల యశః ప్రభాంధకారీకృత సకలాశాంతరాళా! శ్రీశ్రీశ్రీ మహిష సార్వభౌమా! జయ! విజయీభవ!

(మహిష సార్వభౌముడు ప్రవేశించి శాద్వల సింహాసన నిషణ్ణుడగును.)

జంబుకశర్మ: (లేచి)

"ద్యావా పృథ్వ్యవకాశమెల్ల
నిబిడంబై నిండి యీ రోదసిన్
దా వెందుం గనరాని నర్థమున
కంటంబ్రాఁకి సంపూర్ణరా
జీ వారిం దలదన్ని మేనిపయి
నిల్చెంగాదె నీ సద్యశః

భట్టారం మల్లిఖార్జునం

ప్రావిర్భూత మహోజ్జ్వలప్రభలు
సేబాస్ శ్రీ లులాయాధిపా!"

కరటశాస్త్రి: సార్వభౌమా! "రససిద్ధాః కవయః" అన్నారు ఆలంకారికులు. శర్మగారి కవితలో ధారాడంబరమేగాని రసము నాకెందును గోచరించలేదు–ఇక, వినుడు:

"నీరు తమకొంతికిన్ సాటి రాదఁటంచు
తన శరీరంబు నిందించుకొనుచు నెపుడు
బొగ్గు, కుంపటిలోఁబడి క్రమఁగు గాని
బూది యయ్యును నీమేనుఁ బోలలేదు."


రాసభ దీక్షితులు: మేలు! మేలు! శాస్త్రిగారి భావనా వైశద్యమును శర్మగారి ధారాశుద్ధిని అభినందించవలసినదేగాని, ఇయ్యవి రెండును ఒక్కచోట నిమిడినగాని కవిత పరిపక్వ మొందినట్లుగా పరిగణింపబడదు. "వాక్యం రసాత్మకం కావ్యం" అన్న చోట వాక్యమనునది నిరర్గళమైన ధారకే అన్వయము—ఇక వినుడు:

"పారావారమునందుఁ గ్రుంకులిడి
యంభఃపార మాత్రాశన
ప్రారంభంబున ధారుణీధర శిఖాగ్ర
ప్రాంతముం జేరియున్
నీ రంధ్రంబగు నీ తనూరుచిఁ
గన న్నేరంగ లేకయ్యవే
ధారాభృత్తులు మింట బర్వులిడు
వంతన్ సైరిభక్ష్మాపతీ!"

సార్వభౌముడు: హా! ధన్యుడను—నితాంత మక్షికా పీడితంబులైన నా కరంబులకు మీ కంఠస్వారస్యము అమృతాయమానమైనది. మధుర వాగ్విన్యాసమున మా ఆస్థానకవి కెందును దీసిపోని మిమ్ముల గాంచుటయేగాక మీ గానశ్రవణ భాగ్యము కూడ లభించుటచే ధన్యతరుడను. కవితా విషయమున శునకరాజుగారి యభిప్రాయ మెఱుంగక నే నేమియు చెప్పజాలను:

శునకరాజు (లేచి): దేవరవారు సర్వజ్ఞులు—నామీది యభిమానముచే అట్లందురేగాని వారెఱుంగని దేమికలదు! ఎండుగడ్డిలో సైతము రసప్రసారము గావింపగల వారికి మీ కవితలో రసము నెరుంగు టెంత పాటి! అయినను నాకు తోచినది విన్నవించెదగాక. రసము—ధార—వీనికంటె కవితకు ప్రధానమైనది వేరొండు కలదు. సులభ గ్రాహ్యముగా లేనివాడు కవిత నిష్ప్రయోజనము. అల్పాక్షరముల ననల్పార్థరచన చేయగలిగినవాడే కవి.

(55.వ పేజీ చూడండి)



[ఉద్యోగపర్వంనుండి]

వ. మఱియు నక్కడ.

ఉ. ద్రోణుఁడు భీష్ముఁడుం గృపుఁడు ద్రోణసుతుండును గర్ణశల్యులుం
ప్రాణము లా సుయోధనునిపాలివ యంద్రు నిజానుజన్ముల
క్షీణపరాక్రముల్ సుతు లజేయులు బాహ్లికసోమదత్తు లా
స్థాణున కైన నోడరు వశంబె జయింపగ వారి నేరికిన్.

ఆ. అధిప యిట్టిమీకు నన్యోన్యకలహంబు, నాకుఁ జూడ మేలనంగ రాదు
రెండుపక్షములకుఁ బ్రియము హితంబును, నాత్మఁ గోరువారి నడిగి చూడు.

వ అని పలికి సూత నందనుండు గొలువు గలయం గనుంగొని.

ఉ. మ్రొక్కెద వాసుదేవునకు మోడ్చెదఁ జేతులు సవ్యసాచికిం
దక్కటిమిత్త్రబాంధవహితప్రియమంత్రివయస్యకోటికిన్
స్రుక్కుచు విన్నవించెద నసూయలు దక్కి యనుజ్ఞ సేయుఁడీ
యిక్కరుణాకరున్ శరణ మే నిదె వేఁడెదఁ గ్రోధశాంతికిన్.

వ. అనుచుం బ్రణామపూర్వకంబుగాఁ బాండవాగ్రజు వదనంబునం జూడ్కి నిలిపి దేవా యుపశమించుట లెస్స యిమ్మెయికిం గురుపితామహుండును సంతసిల్లు నాతని కనుమతం బయిన తెఱంగు సర్వలోకసమ్మతం బగు నన విని ధర్మనందనుం డిట్లనియె.

ఉ. నెయ్యము దప్ప నొం డొకటి నీచెవి సోకెన నాదుపల్కులం
దియ్యెడ సంజయా యనికి నిమ్మెయి నల్కెదు నీవు మాకుఁ దాఁ
గయ్యము దక్కి మన్కి తగుకార్యము గాదొకో పోరితంబు లే
కయ్యెడు నర్థసిద్ధి వెడఁగైనను నొల్లక యొండు సేయునే.

క. జనులకు నెల్లను బథ్యము, లనఁగా ధర్మానుగతము లగు నవఁ బాగడం
జనుపనులు సేయు భీమార్జునులే దుష్కర్మమునకు రోయనివారల్.

క. మది సుఖము గోరి దుఃఖం, బాదవం గల కార్యములకు నుత్సాహము సే
యుదు రొప్పని తృష్ణంబడి, చదు రేమియు లేని యట్టి జను లాతురులై.

ఆ. యోగ్య తృష్ణ దారు లుచితంపుఁగొలదిమై, నడచినట్టివారు బెడిదములకు
నంత పొత్తు రెట్లు సంతాపకారుల, కాక పెనఁకువలు సుఖంబు లగునె.

వ భోగంబులు వలదా యని తలంతు మేని.

తే. వస్త్రమాల్యానులేప నావసరములును, జతురతూర్యత్రయంబుల సమయములును
నేము వెలిగాఁగ మా తండ్రి కించు నెట్లు, పుత్త్రు లన పట్టి మమ్మేల పోవఁద్రోచు.

వ. అయినను నొకమాట చెప్పెద సమచిత్తుడ వై విను మని యి ట్లనియె.

క. తా నైన నపుడు వక్రుం, డై నీతిపథంబు విడిచె నక్కట వలి మ
మ్మైనను జక్కని తెరువునఁ, బూని నడవుఁ డనుచు నిపుడు బుద్ధులు చెప్పెన్.

క. ఎదిరిం దమయట్టులకా, మదిఁ దలచినఁ బొసగుఁ గాక మాకుం గుడు మిం
డిదె మీరు వ్రక్కఁ గొనుఁ డని, చదు రడచిన మనసుపొందు చక్కఁబడునే.

వ. అని చూపి చెప్పి వెండియు.

ఉ. సంపద దక్కి యుండఁగ నశక్తు లనం జను మమ్ముఁ బిల్చి పూ
జింపఁగ నంత చేరె పతి చెప్పెడువారలబుద్ధి నాఁడ మ
న్నింపఁడ యింక నేల యగు నీ వడియాసల వచ్చి రిత్తగా
రింపక మాను మాతనిచరిత్రము నీకును మాకు వింతయే.

క. తగుమాట లాంబికేయుం, డగు నని కైకొనునె యెన్నఁ డైనను గొడుకున్
మగఁటిమి గలఁ డనియెడు న,మ్మిగఁ జూచుచు నుండు విషము మ్రింగెనయేనిన్.

క. జూదపుసిరి యొనపడం, గా దని విదురుండు చెప్పఁ గా నప్పుడు క
ర్ణాదుల పలుకులు విని పతి, యాదరణము సేయకున్న నంతన తీరున్.

క. ధృతరాష్ట్రుం డిటమీఁదను, సుతులును శకునియును సూతసుతుఁడును దను నే
గతి నడిపించిరి వారల, మతమ యనుష్ఠించు గాక మరలంబడునే.

క. కార్యము తెఱఁ గిట్టిది నీ, వార్యచరితమునకు జొచ్చి యాడెదు నీ కా
దుర్యోధను నవినయ మని,వార్యం బని యెఱుఁగరామి వలనో పెడఁగో.

క. చక్రధరు లెక్కగొనఁడు ప,రాక్రనిధి యర్జునునకు రాధేయభుజా
విక్రమ మెదురుగఁ గొని ని,ర్వక్రమఁ జేసికొనువాఁడు రాజ్యం బెల్లన్.

వ. అని పలికి వెడవెడ యలుక పొడమిన మఱియు ని ట్లనియె.

శా. చాపాచార్యుఁడు భీష్ముఁడుం గృపుఁడు నశ్వత్థామయుం గర్ణుఁడున్
భూపశ్రేష్ఠుఁడు దారు మున్నెఱుఁగరే పోరెట్లుఁ గయ్యంబు లా
శాపాశంబులు చుట్ట లా వెఱఁగియుం జా వేఁడి మార్కొందు రిం
తే పో తమ్ముఁ గపిధ్వజప్రభల యంధీభూతులం జేయవే.

క. మును మమ్ముఁ బొగడి పదపడి, యని వారల గెలువ నరిది యని పొత్తుగఁ జె
ప్పిన మాటకు నే నొడఁబడ, విను సంజయ పక్షపాతవృత్తి విడువుమీ.

స్రగ్ధర. గాండీవజ్యారవం బుత్కట మయి పెలుచం గ్రమ్మినన్ భీమబాహా
దండం బేపారి శుంభద్గద జడియుచు రౌద్రంబుగాఁ దోఁచినన్ వే
దండద్వంద్వంబు మాడ్కిం దఱిమి కవలు మాద్యద్గతిం దాఁకినం జా
కుండం బోకుండఁ గౌరవ్యులకు వశమె బిట్టుల్కి మూర్ఛిల్లకుండన్.

వ. కావున.

చ. రణముల వారలన్ గెలువ రా దను పల్కు లటుండనిమ్ము న
ద్గుణుఁడవు నీవు వచ్చితి ప్రకోపశమంబుగఁ బల్కి తింక సై
రణఁ దగఁ జేయువారము పరాభవ మొందియు మున్ను వారి దు
ర్గుణములు సైఁచు టీవు నొకకొంత యెఱుంగుదు వింత యేటికిన్.

ఉ. ఇంకను నట్లకాఁ దలఁపు మే మొక కీడునకుం దొడంగ మా
శంకలు దక్కి మయ్యు కువిచారము గల్గెనయేని బాంధవం
బంకుర మొత్త మావలన నక్కటికం బొలయంగ మమ్ము నే
వంకకుఁ బోవ నీక గరువంబు జగంబు ప్రశంస సేయఁగన్.

క. రం డని పిలువఁ బనిచి పా,లిం డని కొడుకులకుఁ జెప్పి యింద్రప్రస్థం
బొండెను వే ఱొక పట్టణ, మొండెను మాకిచ్చి యనుచు టుచితము కాదే.

ఉ. నా విని సంజయుండు నరనాథున కిట్లను నెట్టి తప్పులుం
బోవఁగఁ ద్రోచి తాలిమియ పూనుదు గావున నిన్నిమాట లి
ట్లేవు వినంగ నాడియును నేఁ దనివోవక విన్నవించెదన్
నీ విభవం బహింసయు ననింద్యచరిత్రము గాక యన్యమే

క. పాలిక కౌరవులు దు, శ్శీలతఁ జెడఁ దలచిరేనిఁ జెప్పెద రుధిరా
శీలాన్నంబునకం టెను, మే లగు భిక్షాన్న మైన మానడవడికిన్

వ. అది యె ట్లంటేని.

సీ. రాజసూయమహాధ్వరం బట్లు నడపి సద్ద్విజులకు సురలకుఁ దృప్తిఁ జేసి
శాంతియు దాంతియు సకలలోకంబులఁ బొగడొంద బ్రదికిన పుణ్యమూర్తి
విట్టి నీచరితంబు హింసాకళంకిత మగు టెంత యొప్పదు నదియుఁ గాక
దుర్ణయవృత్తి దుర్ద్యూతంబు పుట్టించి యంతలు సేసినయట్టివారు

తే. నేల గర్వంబు సెల్లంగ నిచ్చి జగము, చేత దిట్టలు వడునట్లు సేసి పోయి
తేల యడవుల నిమ్మెయి నిడుమ గుడిచి, తేల తాల్మియ ధనముగా నింతవడితి.

క. తుదిఁ బోయి క్రూరకర్మా, స్పద మగు తెఱఁగునకుఁ జొచ్చి బంధుల గురులన్
వెదకి వధియించుసౌఖ్యం, బది యేటికి నార్యనింద్య మస్థిర మరయన్.

తే. అల్పులకు మ్రింగఁ జేదైన హాలహలము, భంగిఁ బొంగెడు కోపంబు మ్రింగికొనఁగ
నీలగళు నెన్ని నిన్నెన్నఁ బోలు నట్టి, నీవు సాలినఁ గా కేల నెగడుఁ బేరు.

చ. అనవుడుఁ బాండురాజతనయాగ్రణి సంజయుమోముఁ జూచి యి
ట్లను నది యెల్ల నీపలికినట్టిద ధర్మవు లట్ల యుండి బో
ధను లరయంగ వచ్చిన న ధర్మము లై చెడుఁ గొన్ని ధర్మవ
ర్తనములు గాక తోఁచి తుది ధర్మములై చనుఁ గొన్ని కర్మముల్.

వ. కావున నన్నుఁ దూఱ దలంచితేని నా చేయునది ధర్మం బధర్మం బని నిరూపించి మఱి దూఱుము. కోపంబు నివారింపం దగు నహింసయ యుత్తమ ధర్మం బగు న ట్లయినను వంశదూషకులును లోకకంటకులును నగు పాపాత్ముల నిర్మూలంబుగాఁ జెఱుచుట ధర్మం బని పెద్దలచేత విందు మది యట్లుండె సంగ్రామంబు రాజులకు ధర్మం బవుం గా దని నీవ చెప్పు మట్లుంగాక యిది కర్తవ్యం బిది యకర్తవ్యం బని మనల శాసింప వాసుదేవుండు గలండు మన కీ వితర్కం బేటికి నితండు ధర్మాధర్మ విదులకు గురుండు గార్యాకార్యనిరూపకులకు శిక్షకుం డుచితానుచితజ్ఞులకుఁ బ్రదర్శకుం డితని పంపునం గాదె యదుభోజాంధక వృష్ణిసృంజయ కేకయ ప్రభృతిభూపతిప్రకరంబు ప్రశస్తపథంబునం బ్రవర్తిల్లుచున్న యది విశేషించి మాకు నితనిబుద్ధియ సమస్తపురుషార్థమ్ములకు మూలం బగుట నితని వచనం బవశ్యంబు నలంఘనీయం బనిన విని జనార్దనుండు సంజయున కిట్లనియె.

ఉ. పాండుతనూజకోటికి శుభం బెడఁ గోరుదు నెప్డు నాంబికే
యుండును బుత్రపౌత్రమహిమోజ్జ్వలుఁ డక్కట చేటు మేలె యం
చుండుదు నట్లు గాన తెలివొంది యతం డిట వీరిఁ దేర్పఁ గా
నిండుమనంబుతోఁ బనిచె నిన్నని దీనికిఁ బ్రీతిఁ బొందితిన్.

ఆ. నీవు నుచితవృత్తి నెయ్యంబు ధర్మంబు, వినయ మొప్పఁ దెలిపి వీరు శాంతిఁ
బొందునట్టిభంగి పొసఁగఁ బల్కుటయును, నాకు సమ్మదం బొనర్చె నిపుడు.

ఆ. అనఘ యిట్టు లంతయును దలఁపం గదు, నెనసినట్టు లుండె నేని వింటె
పాండవాగ్రజన్ము పలుకులచందంబు, సూడ సంధిలేని చెప్పదోఁచె.

క. అది యట్టిద సంధానము, దుది నెమ్మెయిఁ గల్గు నెట్లు దుర్యోధనుఁడు
న్మదుఁడు ధృతరాష్ట్రభూవిభు, హృదయంబు తెఱంగు గొంత యెఱుగుదుము గదా.

క. ఆరాజు సేయునెయ్యము, గారామును జెప్పె దీవు గడుఁదీపులు గా

వీరు దమపాలు వడయక, నేరిమి మాటలన దీర నేర్తురె చెపుమా.

ఉ. వీరలు పెద్ద ద్రవ్వ కోకవెంట నోడంబడి తేఱి శాంతులై
కౌరవకోటిఁ గూడి మనఁగా మదిఁ గోరుట పెంపుఁ దాల్మియుం
గారుణికత్వముం దగవు గాదె జగంబున పాడిఁ దండ్రిపా
లీ రని తెంపు సెసి పయి నెత్తిన నెత్తిరి గాక ద్రోహమే.

క. విను మవమానము పడి యిట్లునికిఁ బడయు పొగడుకంటె నుజ్జ్వలులై మా
ర్కొనిన నది లెస్స యెట్లయి, నను వీరికిఁ బోటు మేలు నాకుం జూడన్.

వ. సంగ్రామంబు రాజులకు ధర్మం బవుం గాదని నీవ చెప్పు మని యుధిష్ఠిరుండు ని న్నడిగె గదా ద్విజాతులకు యజన యాజనాదికర్మకరణ విభాగంబు ధర్మశాస్త్రాచార్యులు విధించునప్పుడు రాజు లిచ్చువారు గాని వేఁడుకొనువారు గారని చెప్పుట సకలలోక ప్రసిద్ధంబు సర్వవర్ణాశ్రమధర్మపరిపాలనంబు సేయునట్టి రాజులు దార నిజధర్మంబు వదలు దురా: యదియునుం గాక పాడితోడి యార్జనంబునం దమకుఁ గల కలిమి యనుభవించుచు సత్పథంబున నడ[illegible]చుండఁ దమ్మోరు లన్యాయంబు సేసినయప్పటికింగదా యీ శస్త్రాస్త్ర ధర్మంబు లింద్రాదులగు పెద్దలు గావించిరి, నీ చెప్పెడి ధర్మంబులు గౌరవులకుం జెప్పవలవదా వారలు గదా మీఁదెఱుంగక కొఱఁతనుఋకులై చెడు తెరువునం బోయెడువారని పలికి మఱియు ని ట్లనియె.

క. నెట్టన సభలో వేవుర, కట్టెదుర నరాతితనముగా కెంతయు వా
రెట్టి తులువలో ద్రౌపది, నట్టుల పఱిచెడిదె జూద మాడరె యెందున్.

వ. అనవుడు సంజయుండు దేవా నీ చిత్తంబున నిడి దీని నింత గొనియాడినఁ గర్ణుం బొడఁగూడునే యనిన వాసుదేవుం డి ట్లనియె.

ఉ. అత్తఱి భీష్మముఖ్యు లగు నచ్చటి వృద్ధజనంబు లెల్ల నో
రెత్తక యూరకుండిరి మహీశ్వరు చిత్త మెఱుంగ కున్కిఁ దా .
నొత్తి కుమారులం గినియ నోపఁడ యక్కట మాన్పఁ గన్న నా
చిత్తమ కాదు లోకములచిత్తము లెల్లను సంతసింపవే.

ఉ. తిట్టుల బోయి యక్కొలువు తేఁకువవారలలోని కింతిఁ దా
నట్టులు దుస్ససేనుఁ డదయాకృతి ముందల వట్టి యీడ్వఁగా
నెట్టు సహించె మామ సతి యేడ్పు చెలుంగున కెట్టు లోర్చె నీ
పట్టున సేమ మారయఁగఁ బంచుట కెట్టులు నేర్చెఁ గ్రమ్మఱన్.

చ. ఇది దగ దంచు నడ్డపడు నింతకు నేరక సభ్యు లందఱున్
మది మఱిగొన్న యట్టియెడ మానినికిం దనుఁ దాన కాచికో
లొదవిన దానఁ జేసి సభ నొచ్చెము దక్కెనఁ బాండునందనుల్
బ్రదికిరిగాక యయ్యెడరు రాచకుమారుల కోర్చునట్టిదే.

వ. సంజయా విన వే యప్పుడు సభాసదులకుఁ గర్ణశూలంబు లగునట్లుగాఁ గర్ణుండు.

క. లే రిచట మగలు నీకును, వీరలు జూదమున నోడి విడిచిరి నిన్నున్
వారిజలోచన నీపైఁ, గూరిమిగల మగని వెదకికొను మొరు ననఁడే.

క. నరునకు నది వాఙ్మయ మగు, శర మై హృదయంబు నాటి చలియింపక దు
ర్భరవేదనఁ జేయంగా, జిరకాలము దచ్చికిత్స సేసెనె చెపుమా.

వ. మఱియు దుశ్శాసనుండు వీర లందఱును గొడ్డువోయినవారలు పౌరుషంబు గల మానిసి యిం దెవ్వం డనియె నతని చెప్పినట్ల పెద్దగాలంబేని వీరల గొడ్డువోయిరి గాక వీరిదెస వారికి నేమి ఫలించె వెండియుఁ దత్సమయంబునఁ బుట్టిన మాట లుగ్గడించునట్టివి గా వీ సంధికార్యం బత్యంత దుర్ఘటంబు దీని ఘటియింపం జేయుట యశక్యం బని తలంచెద నయినను. ★

పెళ్ళి చేసుకోను

టెలిఫోను బెల్ మ్రోగింది. ఎవరయి వుంటారా, అని ఆశ్చర్యపోతూ రిసీవర్ తీసి విన్నాను. 'హల్లో! నేనూ రాజశేఖరం మాట్లాడుతున్నది—ఏమి లేదు! ఒకసారి వీలుచేసుకుని నువ్వు మా యింటికి రావాలి నాయనా!"

"ఏమిటి విశేషం?"

"నీతో కొద్దిగా మాట్లాడాలి—తప్పకుండా వస్తావు కదూ!"

"అలాగే! మీరు సాయంత్రం ఇంట్లోనే వుంటారుగా!"

"వుంటాను." అని ఫోను పెట్టేశాడు.

ఎందుకు పిలిచి వుంటాడా అని ఆశ్చర్యపోతూ, కుర్చీలో కూలబడ్డాను. కాసేపు ఎంత ఆలోచించినా ఆయనకు నాతో పనేమిటో అర్థం కాలేదు. సస్పెన్సు భరించలేకుండా వున్నాను. ఇంతలోనే మెరపులాగా వొకటి తట్టింది. వాళ్ళ ప్రబుద్ధుడు ఏదయినా అఘాయిత్యం చేసి వుంటాడు. అందుకే నాతో సంప్రతించటానికి పిలిచి వుంటాడు. అంతే! అంతకంటే రాచకార్యం యేమీ వుండదు.

ఆ వేళ సాయంత్రం అనుకున్న ప్రకారము, రాజశేఖరంగారింటికి వెళ్ళాను. నే వెళ్ళేటప్పటికి మా రాయుడు (సుబ్బారాయుడు) ఆముదం త్రాగిన ముఖం పెట్టి, కుర్చీలో కూర్చున్నాడు. తండ్రి ఇంట్లో లేడు.

"ఏరా, షేక్సిపియర్, ఏమొచ్చిందిరా - మీ నాన్న కబురుచేశాడు" అన్నాను.

"ఏమో! ఆయననే అడుగు" బుంగమూతి పెట్టి చిన్నపిల్లాడిలాగా అన్నాడు.

"ఆయనను ఎలాగో అడుగుతాను—ఈ లోపల నువ్వు చెప్పకూడదూ!" అని కాస్త స్వరంతగ్గించి "మనలో మాట-మళ్ళీ ఎక్కడన్నా పప్పులో కాలేశావా" అన్నాను.

వాడు కాస్త సీరియస్‌గా పోజుపెట్టి "ఏమి లేదురా! సంబంధాలేవో వస్తున్నాయ్! పెళ్ళిచేసుకోమని నన్ను వేధిస్తున్నారు. నా కిష్టం లేదంటే ఊరుకోరు."

"ఏమి! ఎందు కిష్టం లేదు?"

"నా కసలు పెళ్ళి చేసుకోవాలనే లేదు."

"హారి పిడుగా! ఎందు కంత విరక్తి?",

"నాకు ఆడవాళ్ళంటేనే నమ్మకం పోయింది—వాళ్లను నమ్మినంత తెలివితక్కువ ఏదీ వుండదు—గంగలో దించేసి చప్పట్లు కొడతారు—నా జీవితంలో యింకే స్త్రీని నమ్మను—నమ్మబోను! మానవుడు ఎవరినైనా వొక్కసారే ప్రేమిస్తాడు. ఆ ప్రేమ విఫలమయితే...

"ఆత్మహత్య చేసుకుంటాడు. అంతేనా! నీకుకూడా అలాంటి ఆలోచన వుంటే చెప్పు! మార్గం ఆలోచిద్దాము" అన్నాను నవ్వుతూ.

"చాలులేరా! నీదంతా వేళాకోళం."

"వేళాకోళం కాదు! ఆత్మహత్య చేసుకోవాలంటే, వొక్కసారే చేసుకో! ఎక్కువ సార్లు ప్రయత్నిస్తే నీ ఆరోగ్యం చెడుతుంది!"

"ఈ కబుర్లకేమి కానీ, నా కేమీ తోచకుండా వుందిరా!"

"అలా పార్కుకువెళ్దాము రా! మళ్ళీవచ్చి మీ నాన్నను కలుసుకుంటాను."

బి. విద్యాసాగర్

సుబ్బరాయుడు, ముస్తాబుకు అట్టహాసం జేస్తుంటే, నాకు నవ్వొచ్చింది. "ఓరే, బాబూ! ఇప్పుడు నీ మేకప్ మొదలుపెడితే వొక గంట పడుతుంది కానీ, యిలాగే వచ్చెయ్యి" అన్నాను.

"ఎందుకురా, రెండు నిమిషాలు" అంటూ వొక అరగంటసేపు కానిచ్చాడు. బాత్‌రూమ్‌లో రెండు సబ్బులు అరగకొట్టి బయటకు వచ్చి, అద్దంముందు తీరికగా కూర్చుని పౌడరు పూసుకుంటున్నాడు.

"ఎలాగుంది" అని ఠీవిగా నా వంక చూశాడు.

"పగటివేషగాడిలాగా వున్నావు—త్వరగా కానియ్యి" అని తొందరచేశాను. అప్పటికీ, మరో అయిదు నిముషాలు ఆలస్యం చేసి, బాగా రూపాయిమందాన పౌడరు పూసుకుని, నల్లద్దాల కళ్ళజోడు పెట్టుకుని, 'రాజు వెడలె' అన్నట్లు బయలుదేరాడు.

పార్కుకు చేరుకున్నాము. ఒక మూల నున్న బెంచీమీద యిద్దరమూ కూర్చున్నాము.

"ఏరా! మీనాన్న ఎక్కడికి వెళ్ళారురా—నేను వచ్చేటప్పటికి లేరు" అన్నాను.

"ఏదో పనివుండి బజారుకు వెళ్ళాడు. ఈ పాటికి తిరిగి వచ్చి వుంటారు"

"సరె కానీ, నువ్వు యింకా లీలను జ్ఞాపకం పెట్టుకున్నావన్నమాట" అన్నాను వొక నిముషం ఆగి.

అవునన్నట్లు తలవూపాడు. నాకు వెంటనే ఎన్నో సంగతులు జ్ఞాపకం వచ్చినాయి.

* * *

అవి మేము కాలేజీలో చదువుకునే రోజులు. మే మిద్దరమూ బి. యస్. సి. లో క్లాసుమేట్సు, మాతో చిదంబరం ఎప్పుడూ తిరుగుతూ వుంటేవాడు. వాడు సుబ్బరాయుడిని ఎప్పుడూ వేళాకోళంచేసి ఏడిపించేవాడు. వాళ్ళిద్దరూ చిన్నప్పటినుంచీ క్లాసుమేట్సు. అందుకని నాదగ్గరకంటే చిదంబరానికి సుబ్బారాయుడు అంటే ఎక్కువ స్వతంత్రం. ఇద్దరూ వొకేసారి, ఇంటర్మీడియట్, 'డాం' అని తప్పి, రెండు పల్టీలు కొట్టి, మళ్ళీ కాలేజీలో వచ్చిచేరారు. అజ్ఞాతవాసానంతరం, ముఖ్యంగా సుబ్బారాయుడు కాలేజీ జీవితం అంటే మొహం వాచివున్నాడు. దానితో మళ్ళీ వొక 'రోమియో' అవతారంఎత్తి, కనపడ్డ అందమైన అమ్మాయివల్లా, నల్లద్దాల కళ్ళజోడుతో చూడటం మొదలుపెట్టాడు. మొదట్లో, ఈ విషయం ఎవరూ పట్టించుకోకపోయినా, రానురాను యిదొక వ్యాధిగా పరిణమించి, పురజనులకోరికపై వాడిచేత ఈ అలవాటు మాన్పించవలసివచ్చింది. అయినా వాడు మానుకోలేదు.

ఇది యిలావుండగా, వొక సుముహూర్తాన, సుబ్బారాయుడు వొక చిన్న మజ్నూ అయి కూర్చున్నాడు. మాకు ఎవరికీ తెలియనే తెలియదు. మా చదువుల గొడవలో మేము వున్నాము. ఒకరోజు మధ్యాహ్నం క్లాసు జరుగుతూవుండగా, నా పక్కనున్న చిదంబరంతో రహస్యంగా అంటున్నాడు. "ఆ వాయల్‌చీర కట్టుకున్న అమ్మాయిని చూడు. గుర్తుంచుకో! తర్వాత చెపుతాలే" అన్నాడు కాస్తమెల్లగానే. నాకు వినపడుతునేవున్నాయి ఈ మాటలు. నాకేమిటి! వెనుక బెంచీలలో వున్న మరిముగ్గురు వినే వుంటారు. ఎంత మెల్లిగా మాట్లాడినా

ఆ పెళ్ళి చేసుకోను ★

రాయుడిగొంతు మైక్‌లో చెప్పినట్లే వుంటుంది. ఒకళ్ళిద్దరు, వెనుక బెంచీల వాళ్ళు ఇది విని తమలో నవ్వుకుంటున్నారు. 'సైలెన్స్' అంటూ లెక్చరర్, పాఠం కొనసాగించాడు.

క్లాసు వదిలిపెట్టారు. అంతా బయటికి వచ్చాము. నేనూ, చిదంబరం పోతూవుంటే, మాతోపాటు సుబ్బారాయుడు కూడా బయటికి వచ్చాడు. తర్వాత క్లాసు లేకపోవటం వలన, ఈలోపల, చిదంబరం రూముకి వెళ్ళి రావచ్చు ననుకుని, అక్కడకు వెళ్ళాము.

తాళం తీసి, లోపలకు వెళ్ళాము. రాయుడు, తన ప్రయోజకత్వం బయటపెట్టటానికి, తొందరపడుతున్నాడు.

"ఇందాక చూపించానే! మన క్లాసుమేట్ - ఆమెను లవ్ చేశానురా" అన్నాడు ఎంతో ముద్దుగా.

మాకు పిడుగుపడ్డట్లయింది. సుబ్బారాయుడికి యిదేమి క్రొత్తకాదు. హైస్కూలులో వుండగా, మనస్సులో ఎన్నో బొమ్మల్ని మార్చాడు. కొంతమందితో బహిరంగంగా ప్రణయకలాపం సాగింది. వొకసారి దేహశుద్ధికూడా చేయించుకున్నాడు. అయినా వాడికి ఆ పిచ్చి వదలలేదు. అప్పటినుంచీ, ఎవరినో వొకరిని ప్రేమిస్తూనేవున్నాడు. ప్రేమ అనేది వాడి భావంలో చాలా సామాన్యమయిన విషయం. దానికి హృదయమనేది అవసరం లేదు. రోజు కొకర్ని ప్రేమించి, మర్నాడే మర్చిపోతూవుంటాడు. అందువల్ల, రాయుడు మళ్ళీ ఎవర్నో ప్రేమించాడంటే పెద్ద విశేష మేమీ కాదు. అయినా అజ్ఞాతవాసంలో, వాడు నడిపిన గ్రంథం యేమీ లేకపోవడం మూలాన, యిది మళ్ళీ వొక హైడ్రోజను బాంబులాగుంది. చిదంబరం యిది విని.

"చంపేశావు! మళ్ళీ మొదలుపెట్టావేమిటి భాగోతం! ఈ అమ్మాయి నీ జాబితాలో ఎన్నో దేమిటి!'

"ఎన్నోదయితే, నీకెందుకు - ఈసారి నేను మనస్ఫూర్తిగానే ఆమెను ప్రేమిస్తున్నాను" అన్నాడు కొంత సీరియస్‌గా.

అయితే పెద్ద ప్రమాదమే ముంచుకొచ్చిందని, నేనూ, చిదంబరం భయపడ్డాము. సుబ్బారాయుడి ప్రేమకలాపమంటే, వూళ్లో చాలామందికి తెలిసేవుంటుంది. ఎందుచేతనంటే, రెండేళ్ళక్రితం, వాడు యిదే కాలేజీలో చదువుతూవుండగా, వొక మోహనాంగిని ప్రేమించి - లేదు, పిచ్చిప్రేమలో పడి - చివరికి పురజనుల విన్నపంపై ప్రిన్సిపాలుచేత నాలుగు అక్షింతలూ వేయించుకున్నాడు. ప్రిన్సిపాలు మాత్రం వూరుకున్నాడా! సస్పెండు చేస్తానని బెదిరించాడు. దానితో రాజశేఖరంగారికి గుండెల్లో రైళ్ళు పరుగెత్తి, చివరికి, కుమారరత్నం తరఫున, ప్రిన్సిపాలుగారికి క్షమాపణ చెప్పుకొని వాడిని ఆపదలోనుంచి గట్టెక్కించాడు. అది రాయుడు అప్పుడే మర్చిపోయాడు. మర్నాడే, మనస్సులో బొమ్మ మార్చి, యింకో లతాంగిని ప్రేమించాడు. అప్పట్లో రాజశేఖరంగారికి రాత్రిళ్ళు నిద్ర పట్టేదికాదు. ఏరాత్రయినా, చెప్పాపెట్టకుండా, వొక సుందరాంగితో రైలు ఎక్కేస్తాడని భయపడేవాడు. కానీ అలా జరగలేదు. కారణం, సుబ్బారాయుడి లిస్టులో చాలామంది వున్నారు. అందరినీ వొకేసారి, లేకపోతే వేరు వేరుగా ప్రేమిస్తూ మావూళ్ళోనే వున్నాడు. పరీక్షలు దగ్గరకు వస్తుంటే, తాత్కాలికంగా చదువుమీదకు దృష్టి పోనిచ్చాడు. ఇది రాజశేఖరంగారికి కళ్ళనీళ్ళు తుడవటానికి చేసే తతంగం! రాత్రిళ్ళు పన్నెండింటిదాకా, గదిలో దీపం వెలిగించి, ధూమపానం చేసి, పరీక్షకు సిద్ధమయాడు. కానీ చదివితేగా! క్రికెటులో మూడు 'స్టంప్స్' పడిపోయినట్లు, సుబ్బారాయుడికి ఆ యేడు మూడు పార్టులూ గోవింద కొట్టినాయి. ఇది లాభంలేదని, మూడు భాగాలనూ, వేరు వేరుగా చేసి, వొక్కొక్కటే నెమ్మదిగా ప్యాసయినాడు. ఇదీ టూకీగా వాడి వృత్తాంతం!

ఈరోజు సుబ్బారాయుడు క్రొత్తగా మళ్ళీ వొకరిని, ప్రేమిస్తున్నాడంటే, అంత పెద్ద విషయమేమీ కాదు.

"ఏరా, బాబూ! ఆ అమ్మాయికి, నువ్వు ప్రేమిస్తున్నావని తెలుసా?" అని అడిగాడు చిదంబరం. నిజమే! ఇది అడుగవలసిన ప్రశ్నే! ఎందువల్లనంటే, రాయుడి ప్రేమ చాలావరకు నిగూఢప్రేమ.

"ఆ, అమ్మాయితో యింకా మాట్లాడలేదురా!"

"అయితే, ఆమెకు ఈ సంగతి తెలియదన్నమాట!"

"వుహుఁ!" అని అడ్డంగా తలకాయి త్రిప్పి "ఆమెతో మాట్లాడాలంటే, వీలు కాకుండా వుందిరా. ఏమీ తోచకుండా వుంది—పోని వొకపని చెయ్యమంటావు?" అన్నాడు.

"ఏమిటది?" అన్నాడు చిదంబరం.

"ఏమిలేదు—వీలు చూసుకొని, వొకసారి వాళ్ళయింటికి వెళ్ళవద్దామనుకుంటున్నాను."

"అంత పనిమాత్రం చేయబోకు. వాళ్ళ నాన్న చూస్తే 'ఎవడీ అంట వెధవ!' అని కర్ర పుచ్చుకుంటాడు."

"మరి, యేమి చేయమంటావురా?"

"ఏమివద్దు—ముందు నువ్వీ పిచ్చివేషాలు మానెయ్యి" అన్నాను.

"అది నా జన్మలో చేతకాదు—నా హృదయం ఆమెకు అర్పించాను" అన్నాడు కవిత్వం వొలకపోస్తూ.

"ఎడిచావు! ఈ కబుర్లకేమి?"

"కబుర్లుకాదు నిజంగానేరా!— ఆమె లేనిది నేను జీవించలేనురా!" అన్నాడు సినిమాలలో మాదిరి (ఇది సినిమాలు చూసి నేర్చుకున్న మాట).

"అయితే పిచ్చి బాగానే ముదిరింది" అన్నాడు చిదంబరం.

"అబ్బ! వూరుకోండిరా—మీరూ, మీ వేళాకోళమూను—ఈ సమస్యను ఎలా 'సాల్వ్' చేయాలో తెలియకుండావుంది."

"అయితే, నేనొక వుపాయం చెపుతా వుండు" అన్నాడు. చిదంబరం మళ్ళీ.

"ఏమి టది?"

"రేపు కాలేజీ ఎన్నికలలో పోటీచెయ్యి. నీ అదృష్టం బాగుంటే స్టూడెంట్సుయూనియన్ ప్రెసిడెంట్ అవుతావు—అప్పుడీ లీల యేమిటి; ఎవరయినా నిన్ను ప్రేమిస్తారు."

ఈ సలహా బాగానేవుంది— మా మిత్రబృందంలో వున్న మిగతా సభ్యులు కూడా యిది చర్చకుపెట్టి, సూచన అంగీకరించినట్లు ఏకగ్రీవంగా తీర్మానించారు.

నాలుగురోజులు గడిచాయి. సుబ్బారాయుడు ప్రెసిడెంట్ పదవికి నామినేషన్ పడేశాడు. మర్నాడు కరపత్రాలు అచ్చువేయించాము. దానితో అతనిపేరు కాలేజీలో మారుమ్రోగింది. డి. సుబ్బారాయుడు అంటే అందరికీ తెలిసిపోయింది. ఎవరి చేతిలో చూచినా రాయుడు పేరుగల కరపత్రాలే! అవి చూచుకుని సుబ్బారాయుడు వుక్కిరిబిక్కిరి అయ్యాడు. ఎన్నికలలో గెలిచినంత సంతోషపడ్డాడు. రేపు గెలిచినా, వోడినా, ముందు తనపేరు అందరికీ తెలిసిపోయింది—నిజానికి, నాలుగురూపాయిలుఖర్చుచేసి కరపత్రాలు వేయిస్తే, మరో డబ్బారేకుల సన్యాసిపేరయినా అందరికీ తెలుస్తుంది. ఇందులో విశేష మేమీ లేదు. కాని, మా రాయుడు అలా అనుకోవటంలేదు. తనలో ఎదో ప్రత్యేకత వుంది. అందుకే మేమంతా బ్రహ్మరథం పడుతున్నామను కుంటాడు.

పెద్ద ఎన్నికలకు చేసినంత తతంగం జరిపించాము. వాల్ పోష్టర్లు అంటించాము. మైక్ లో రాయుడిపేరు చెప్పాము. చివరికి సుబ్బారాయుడిని రోడ్డుకు అడ్డంగా వ్రేళ్లాడంటాడు—కాదు, కాదు—అతనిపేరు వ్రాసిన తడికలను కట్టాము. అంతే!

"ఎలాగుందోయ్! మన ప్రచారం" అన్నాడు వొకరోజు తాపీగా సిగిరెట్ వెలిగిస్తూ.

"ప్రచారానికేమి! బాగానే వుంది—మనం గెలుస్తామో, లేదో అనుమానంగాని." అన్నాడొక సన్నాసి.

సుబ్బారాయుడి ముఖం చిన్నపోయింది. పదివేలు తగలేసిన ఎమ్. ఎల్. ఏ. లాగా ముఖంపెట్టాడు. ఇది కనిపెటి.

"నీకేమి భయంలేదు. ధైర్యంగా వుండు-ఎందుకు గెలవ్వోమాస్తాము" అన్నాడు చిదంబరం ధైర్యం చెప్తూ.

"ఏమోరా! నా కెందుకో గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నాయ్" అన్నాడు రాయుడు దిక్కుమొహం వేసి.

"భయమెందుకురా! గెలిచినా, వోడినా, నీవు కీర్తిశేషుడి వవుతావు" అన్నాను సీరియస్ గానే.

రాయుడు ఇది వినిపించుకోకుండా, ఎటో చూస్తూ, "అవును. నిజమే" అన్నాడు. నిజానికి, చాలారోజులవరకూ, 'కీర్తిశేషులు' అనే మాటకు సుబ్బారాయుడికి అర్థం తెలియదు. తెలుగులో వాడిదంతా సహారా ఎడారి. అయితే యిప్పుడు కొంతనయం. భాషనంత ఖూనీచేయటం లేదు.

ఎన్నికలరోజు వచ్చింది. మా కందరికీ చేతినిండాపని. చిదంబరం. లౌడ్ స్పీకర్లలో, కాలేజీ బయటనుంచి రాయుడిపేరు గట్టిగా చెప్పాడు. ఇక లౌడ్ స్పీకర్లు, కాలేజీలోపల పెడితే. ఈ పాటికి ఎన్నికలు 'రఫీ' మని ఆగిపోయేవి. ఇంతా మైక్ లో చెపుతుంటే, సుబ్బారాయుడికి మధ్యలో 'ఆమె' విన్నదో, లేదోనని అనుమానంవచ్చింది.

ఆ వేళ ఎన్నికలు అయిపోయాయి. చాలా కొద్ది మెజారిటీతో మా సుబ్బారాయుడు గెలిచాడు. ఆ వుషారులో, మా సేనలోని లంబోదర, కృశోదర, మహోదరు లందరికీ, ఆ వ్వేళ హోటలులో కడుపునింపాడు.

ఇంత జరిగినా మాకు వుత్సాహంగాలేదు. కారణం, రాయుడి నిజస్వరూపం మాకు తెలుసు. అవసరంకొద్దీ, బెలూన్ లో గాలి కొట్టినట్లు వాడినొక మనిషిగా తయారుచేసి తెరమీది కెక్కించాము. ఎప్పుడైనా అసలు రంగు బయటపడితే, మాపని అభాసు అవుతుంది. అందుకే రాయుడిని జాగ్రత్తగా కాపాడుకొస్తున్నాము. ఏమయినా స్వప్రయోజకత్వం లేని మనిషితో ఎన్నాళ్ళని వేగుతాము? అదే మాకు పట్టుకున్న దిగులు.

ఇక కాలేజీ యూనియన్, ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చెయటం మొదలుపెట్టాము. రంగురంగుల కాగితాలతో, మా కాలేజీని అలంకరించాము. ఒక ప్రముఖవ్యక్తిని ఆరోజు మాట్లాడటానికి ఆహ్వానించాము. ఆహ్వానం మా చిదంబరం వ్రాసిపెడితే, వేలిముద్ర వేసినట్లు, వొకసంతకరం తగలేశాడు.

ఆ రోజు మా కాలేజీ కళకళలాడు తున్నది. పచ్చని తోరణాలు, భవనానికి వొక వింత శోభ చేకూర్చినాయి. మలయ మారుతం వీయటం లేదుగాని, ఈదురుగాలి, అప్పుడే కొద్దిగా మొదలుపెట్టింది. మా సుబ్బారాయుడు. వొక ఎరుపు బుష్ కోట్ తొడుక్కుని, చక్కగా దసరా బుల్లివాడి లాగా తయారయ్యాడు.

సభ ప్రారంభ మయింది. ప్రిన్సిపాలుగారు స్వాగతోపన్యాసం యిస్తున్నారు. ఇక్కడ మా రాయుడి కాళ్ళు '[illegible]' కొడుతున్నాయి. భయమేసి, తెరవెనక్కు వచ్చాడు. మేము ధైర్యంచెప్పి ఎలాగో మళ్ళీ పంపించాము. ప్రిన్సిపాలుగారు మాట్లాడటం అయిపోయింది. మా రాయుడు వొక చిన్న పోజిచ్చి, అప్పటికి వందసార్లు రిహార్సలు చేసిన చిన్న ఉపన్యాసాన్ని జాగ్రత్తగా అప్పచెప్పేశాడు. తరువాత సభ సక్రమంగా జరిగిపోయింది. మధ్యలో కొద్దిగా వర్షం కురిసినా, పెద ఇబ్బందేమీ జరుగలేదు.

మర్నాడు సుబ్బారాయుడు విజయభేరి మ్రోగించాడు. మరింత వుత్సాహంతో కాలేజీలో తిరుగుతున్నాడు. అయితే చదువు మాత్రం సాగటంలేదు. అందు కతను దిగులు పడటంలేదు.

కాలేజీ పరీక్షలు అయినాయి. దసరాకి శెలవు లిచ్చారు. సుబ్బారాయుడు వుషారుగా వాళ్ళూరు వెళ్ళాడు. మాకు మాత్రం అంత వుత్సాహంగాలేదు.

మళ్ళీ కాలేజీ తెరిచిన, వారం రోజుల లోగానే, దిద్దిన పరీక్ష పేపర్లలో మొదటిది మా చేతికి వచ్చింది. అది చూసి, రాయుడు గైర్ హాజర్ వేద్దామనుకున్నాడు కాని, బాగుండదని వూరుకున్నాడు. మామూలుగా వెళ్ళి తనపేపరు తెచ్చుకున్నాడు, లెక్చరర్ చిన్నగా నవ్వుతూ పేపరు చేతికిచ్చాడు. సుబ్బారాయుడు వలయాకారం చూసి ఆశ్చర్యపడలేదు. ముందుగా అనుకున్నదేగా! అయితే 'గ్యాస్' అనే రిమార్కు మాత్రం కొద్దిగా బాధకలిగించింది

మర్నాటినుంచీ, సుబ్బారాయుడికి మంచి మార్కులు వస్తున్నాయి. కారణం ఎవరికీ అర్థంకాలేదు. కొందరు తెలివిగలవాడను కున్నారు. కాని, అసలు సంగతి ఎవరికీ తెలియదు. మొదటి పేపరు మినహా అన్నింటిలోనూ, కాపీకొట్టాడట! ఈ విషయం మాకు తర్వాత తెలిసింది. ఇది ఇలా వుండగా, కాలేజీ మేగజైనులో సుబ్బారాయుడు "వ్రాసిన" కథ వొకటి పడింది. దీనికోసం శ్రమపడినవారు మా బృందంలో నేవున్నారు. ఏమయినా రాయుడిపేరు కాలేజీలో మ్రోగి పోతున్నది.

ఈ మధ్యకాలంలో. సుబ్బారాయుడి

★ పెళ్ళి చేసుకోను ★

తో, లీల వొకటి రెండుసార్లు మాట్లాడింది. అవి యిప్పటికీ అతనికి జ్ఞాపకం వున్నాయి. ఆమెచనువు ఆధారంగా చేసుకుని, రాయుడు నాలుగైదుసార్లు ఆమెయింటికి వెళ్ళాడు. తీరా ప్రేమించానని తెలియచేయటానికి ధైర్యం చాలలేదు. ఒకవేళ రాయుడు చెపుదామనుకున్నా, మొహానికి చెమటలుపోసి, కాళ్ళు వణికిపోతున్నాయి.

ఇక లాభం లేదని, బాగా రిహార్సల్సు వేసుకుని, వొకరోజు ధైర్యంచేసి, ఆమెని విషయం అడిగేశాడు. ఈ మాటలు సున్నితంగా లేకుండా, చాలా మొరటుగా వున్నాయి. మాతో సంప్రతించకుండా ఈ వుపన్యాసం స్వయంగా తయారు చేశాడు. అంతే! ఆమెకు కోపంవచ్చి, కస్సుమని, నాలుగు మాటలూ అనేసింది.

"మీతో చనువుగా వుండటం చూసి, మీ రిలా అపార్థం చేసుకుంటారనుకోలేదు. మీ రింకా చదువుకున్నవారనీ, ఉన్నత భావాలు కలవారనీ అనుకున్నాను కానీ, యింత సంస్కారవిహీను లనుకోలేదు" అంది కోపంతోనే.

ఇంకేముంది! మా వాడు ముఖం అణా బిళ్ళంత చేసుకుని, రూముకి తిరిగి వచ్చాడు. ఆరోజు రాత్రి భోజనం చేయలేదు. నాలుగు రోజులు ఉపవాసం చేస్తానన్నాడు. కాని లైమ్‌జ్యూస్ త్రాగి వుందామనుకున్నాడు. కాని ఈ లోపల 'ఢుటుక్కు' మంటానని భయంవేసి వూరుకున్నాడు.

ఆనాటినుంచి, సుబ్బారాయుడికి స్త్రీలంటేనే వొక విధమైన అసహ్యం వేసింది. అందుకే పెళ్ళిచేసుకోనని భీష్మించుకు కూర్చున్నాడు.

తర్వాత మేమంతా యమ్. ఎస్. సి. లో చేరాము. సుబ్బారాయుడు కూడా మాతో పాటు చేరాడు. యం. ఎస్. సి. అయినాక నేను ఉద్యోగంలో చేరాను. సుబ్బారాయుడు మాత్రం, ఖాళీగావున్నాడు. అయినా లీలమాత్రం అతని స్మృతి పథంలో యింకా అలాగేవుంది. ఆమెను మరచిపోలేదు.

*　　*　　*

పార్కులో సంగీతం వినపడుతోంది. నేనూ, రాయుడూ, పరధ్యానంగా సంగీతం వింటూ కూర్చున్నాము. ఇంతలోనే సంగీతం ఆగిపోయి "ఆలిండియారేడియో! వార్తలు..." అని వినిపించింది. నేను రిష్టువాచీవంక చూసుకున్నాను. సరిగ్గా ఏడయింది.

"ఏరా! మనం వెళ్దామేమిటి ?" అన్నాను.

"అలాగే" అంటూ లేచి నుంచున్నాడు. ఇద్దరమూ గేటుదాటి బయటికి వచ్చాము. బయట జన సంచారం అంతగా లేదు.

"ఏరా ! పెళ్లిచేసుకోవటానికి, నీ అభ్యంతరం యేమిటి ?" అన్నాను.

"ఆ విషయమే అడుగకద్దు ! నాకు ఇష్టం లేదు. అంతే !"

"అదే, యెందు కిష్టం లేదని అడుగుతున్నాను"

"నీకు తెలియనట్లు అడుగుతా వేమిటి ! నేను లీలను ప్రేమించాను. ఆమెను తప్పితే, యింకొకర్ని పెళ్ళి చేసుకోదల్చుకోలేదు"

"బాగుందిరా !...... యింకా అదే పట్టుకు కూర్చుంటా వేమిటి ?".

"నాకు తెలియదు, వూరుకో"

"ఏమిటిరా! నాకు తెలియనిది—నీ కేమయినా పిచ్చిపట్టిందా—ఆమె కీపాటికి పెళ్ళయిపోయి వుంటుంది."

"అయితే, అయింది. నేను మాత్రం పెళ్లి చేసుకోను"

"బాగుంది! ఆమెకోసం బ్రహ్మచారిగానే వుంటావా"

"ఆ, వుంటాను—నీ కెందుకు"

"నాయనా, నీకు బాగా పిచ్చెక్కిందిరా! —ఎవరు చెప్పినా వినవు—యిలా అయితే నిన్ను పిచ్చాసుపత్రిలో చేర్పించాల్సి వస్తుంది" అన్నాను నవ్వుతూ.

"ఆ, చేర్పించండి—వచ్చిన యిబ్బందేమీ లేదు"

ఇంతలోనే యిల్లు చేరుకున్నాము. రాజశేఖరంగారు అప్పటికి బజారునుంచి తిరిగి వచ్చి, తీరిగ్గా రేడియో పెట్టుకు కూర్చున్నారు. తలుపు చప్పుడు విని, రేడియో కట్టేసి, వచ్చి తలుపు తీశారు. నన్ను చూసి ఆప్యాయంగా.

"రావోయ్—నీ కోసమే ఎదురు చూస్తున్నాను" అన్నారు.

"ఇప్పుడే ఇంతకుముందు వచ్చాను—మీరు లేరు—అందుకని, మే మిద్దరమూ అలా పార్కుకు వెళ్ళాము."

"నేనూ, అదే అనుకున్నానులే!—సరే కాని, నీకు విషయం మావాడు చెప్పాడనుకుంటాను."

"ఆ, చెప్పాడు" అని తల వూగించి, "ఏమిటో! నాకూ ఏమీ తోచటం లేదండీ" అన్నాను.

అదేనోయ్-వీడితో పెద్దచిక్కు వచ్చింది. —అవతల చూడ పోతే చాలా సంబంధాలు వస్తున్నాయి "

"ఎందుకు రావూ—యం. ఎస్. సి. ప్యాసయినాడయ్యె!"

"పెళ్ళెందుకు చేసుకోవంటే కారణం చెప్పడు. మౌనంగా వూరుకుంటాడు. వీడితో ఎలా వేగటమో నాకు తెలియకుండావుంది"

"పోనీ, మీ నాన్న యిష్ట ప్రకారం, చేసుకో గూడదుటురా," అన్నాను రాయుడి వంకకు తిరిగి.

"మళ్ళీ అదేమాట! నాకు పెళ్లే వద్దంటుంటే, యింకా నన్ను వేధించుకు తింటా రేమిటి?"

"ఎవరా. నిన్ను వేధించుకు తింటున్నది' అన్నాడు ముసలాయన కస్సుమంటూ.

"మీరు వూరుకోండి, బాబూగారూ!... యింతకీ సంబంధాలు ఏక్కడనుంచి వచ్చాయి" అన్నాను.

"చెప్పేమి ప్రయోజనం - వాడికిష్టం లేనప్పుడు"

"అయినా చెప్పండి వింటాము."

"పెద్దపులివర్రునుంచి వొక సంబంధం వచ్చింది. ఆ అమ్మాయి బి. యస్. సి, ప్యాసయిందట.' అన్నారు తాపీగా.

"పేరేమిటి?" అన్నాను.

"లీలాకుమారిట."

"అయితే, చేసుకుంటాను నాన్నా!" అన్నాడు సుబ్బారాయుడు ఎగిరి గంతేస్తూ. రాజశేఖరంగారికి అర్థంకాక విస్తుపోయాడు. అరంచేసుకున్న నేనునాలోనవ్వుకున్నాను ★



(గతసంచిక తరువాయి)

9

నీలి—గంజీగడుగూ, అంబలిసంబలీ, త్రాగే కడుపుకు దంపుడుబియ్యం అన్నం తగలటంచేత, నరాలలో జవసత్వాలు, చేరుకున్నాయి. యౌవనం బలిసి ఒళ్ళంతా సర్దుకుంది. అందం అన్ని అవయవాల్లో మూర్తీభవించి వక్షంలో, కేంద్రీకరించింది. ఆమె ఇప్పుడు విడిన గులాబీ, విరితేనియ!

పుల్లయ్య అనుకున్న సమయం. తనలా కండలు తిరిగిన వస్తాదుపెళ్ళం బక్కచిక్కినట్లుంటే, పట్నంలో బుగతేమనిపోతాడు? ఇప్పుడు పెళ్ళం—తన ఒళ్ళుకు సరిపడ్డ వొళ్ళు—మనసు కలిసిన మనిషి—మాటలో మాట—తనపెళ్ళం!

గుడ్డలోని బీరకాయలు, ఆనపకాయలు, చెరుకుముక్కలతో తట్ట నిండిపోయింది. మొగుడూ పెళ్ళాలు ముస్తాబులయ్యారు. నీలి యెర్రటి అంచుగల తెల్లటిచీరకట్టింది. తలదువ్వుకుని మెట్టివేసి కళ్ళనిండుగా కాటుక పెట్టింది.

పుల్లయ్య బస్తీకి వెళ్తున్నాడుగదా! చేతికి కాశీతాడు కట్టాడు. తెల్లని పలాచని కళ్ళీలాల్చీ లోపల నలుపు రంగు బనియను, బనియనుమీద తెల దారంతో కుట్టిన రావియాకు. వాణీతో వారతలపాగా చుట్టాడు. మెడలో కాశీతాడు చంకన బాణాకర్ర. గేరాగిరజాల చివరల వెంబడి కారేటట్లు నూనె, ఘుంగాలువరకూపంచెకట్టు. అద్దంలో బాగా చూసుకున్నాడు బయలుదేరేముందు.

రోడు యెక్కారు ఇద్దరూ. ప్రొద్దు యెండ వీపుకు తగిలి వెచ్చగావుంది. ఈమాట ఆమాట ఆడుకొని కదిలిపోతున్నారు దంపతులు.

నాలుగు క్రోసులు దూరం ఎంత సేపు.

ఇక బుగత సంగతి! ఆయనపేరు సీతారామస్వామి బి.ఎ. బి.ఎల్. ప్లీడరు. ఈయన తండ్రి నవిరి గ్రామకరణంగా వుండేవాడు. ఆగ్రామంలో సగంభూములు, ఆ రోజుల్లో ఒకమాలు కోదారివి. ఆయన పట్నంలో వుంటూ అంబారం వగైరాలు వసూలుచేసే బాధ్యత ఈ కరణంగారిమీద వదలివేసేవాడు. కొన్నిసంవత్సరాలు సవ్యంగానే వెళ్ళిపోయింది. మాలుకోదారు వలన కొంత రాబడి సంపాదించుకొన్నాడు. కరణం బ్రతకడానికి లోపంలేకుండా సరిపోయేది. ఒకసంవత్సరం మాత్రం దగా చేశాడు!

ఆయేడు దక్షిణాదిన కరువు పెట్టింది. ధాన్యంధరలు వుండివుండి పెరిగిపోయాయ్. పెరిగిన ధరకి అమ్మి ధరలు పెరగకముసుపే అమ్మానని, మిగతాడబ్బు కాజేశాడు. భూములు కొన్నాడు. కొడుకుని పట్నం పంపించాడు. పెద్దచదువు చదివించి కలెక్టర్ని చేస్తానని వూరంతా చాటాడు. కొడుకు వాగ్దాటి విని కొడుకు తప్పక కలెక్టరవుతాడని నమ్మాడు. నోటికి బుర్రకీ ఎక్కడా సామ్యం కుదరలేదు. దండయాత్రలు సాగించి యెలాగో మద్రాసులో చదివి ప్లీడరుపట్టా సంపాదించుకున్నాడు కొడుకు.

కొడుకు స్వగ్రామానికి దగ్గరగా వున్న పట్నంలోనే ప్రాక్టీసు పెట్టాడు. సంపాదన శూన్యం. ముసలివాడు మదుపు పెట్టవలసి వచ్చేది. రెండుకుటుంబాలు దివ్యంగా గడవటానికి సంపాదనకోసం—అందులో మిగిల్చి ఆస్తి చెయ్యటానికి—ప్రజలను తుడిచేసేవాడు. భయం భక్తీ ప్రజల్లో వుండేది. ముసలాడి మాటకు అడ్డూ ఆపూ వుండేదికాదు. ఆ బాబుకి అనుభవించాలని వుంది అనుభవిస్తున్నాడు; మనకి రాతలేదు—లేదు. ఒకడికి వున్నాదని యేడిస్తే రెండుకళ్ళూ పోతాయని సమాధానపరుచుకొనేవారు. అన్యాయ అనేది ఆనాటి ప్రజల్లో సాధారణంగా వుండేది కాదు. ఆతరం సరి.

సీతారామస్వామి తరం వచ్చింది. ఈయన

★ దగాపడిన తమ్ముడు ★

పట్నం మకాం ఈ పల్లెలోని ఇంటిని మట్టిలో కలిపింది పట్నంలో తండ్రి వున్నప్పుడే పెద్ద ఇల్లు కట్టించుకున్నాడు ఆ రోజుల్లో కూలీలు బళ్లతో ఇటికలు రాళ్లూ, సున్నంకూడా సవరిసుంటే, ఖర్చులేకుండా వచ్చాయి ఇంతయిల్లూ అయిదోవంతయినా ఖర్చు కాకుండా తయారయిపోయింది ముసలాయనకు యింట్లో పెళ్ళాం, వీధిలో వుంపుడుకత్తె వుండేది సీతారామస్వామికి అది లేదు కానీ, ఆడవాళ్ళంటే కొంచం పిచ్చి ఉండేది తల్లీ తండ్రికి ఒక సంతానం ఆయన పెళ్ళాం ఆస్తి కలసివస్తుందని ముసలాయన సంబంధం చేశాడు భార్య పల్లెటూరినుంచి వచ్చినా ఆ రోజుల్లో పెద్దయింటి ఫేషను తెలుసు మణికట్టువరకు చేతులున్న జాకెట్లు వేసేది పట్నంగాలి తగలటంతో పలుకు కూడా వచ్చింది ఒకవిధంగా మొగుణ్ణి మించేసింది ఆమెకు సెక్షనతోసహా కేసుల విషయమై పల్లెటూరి వాళ్ళతోనూ, ఆడ వాళ్ళతోనూ వచ్చు చెప్పటం తెలుసు ఇదెంతలో పని! ఆయన నోరెత్తారంటె మునసబుకూడా ఆశ్చర్యపోతాడని- క్రిమినలు కేసులన్నీ మొగుడే వేసని చెప్పటంలో, భర్తకు సహాయం చేస్తున్నాననుకొని చెయ్యలేక పోతుంది పడకగదిలో మొగుడు చెప్పిన సెక్షను తప్పు చెప్ప గలనని గర్వంఉంది ఆమెకి సీతారామస్వామి మొదట సన్నంగా వుండేవాడట పెళ్ళాం జాజాకుగావున్నా దిత్తయిన పుష్టయిన విగ్రహమే అత్తగారికి అల్లుడిలా వుండటం నచ్చక నేటివుమందులు తినిపించింది, కానీ, మనిషి అలానేవున్నాడు

సీతారామస్వామి జాతీయ పోరాటంలో పాల్గొన్నానని చెప్పుకుంటాడు తనభార్య కూడా పాల్గొన్నదని తను చెప్పడు కానీ, తనభార్య చెప్పుకుంటుంది అలా ఆమె చెప్పుకోవటం తనకు యిష్టం లేదు ఆ రోజుల్లో స్త్రీకి సంపూర్ణ స్వాతంత్ర్యం వుండాలని వాదించినవాడు, ఈ రోజుల్లో వాదనకు వస్తే భార్య వినకుండా- వుండకూడదనే అంటాడు తన జీవితంలో యీ సంబంధమైన దేదో బాధవుంది బహుశః అది ఆ సుమానం వల్ల వచ్చివుండవచ్చు ఒకటి రెండుసార్లు ఆత్మహత్య చేసుకొంటా మనుకొన్నట్లు జ్ఞాపకం కాని పురుషుడనని, ధరలో రెండు తెరగుల నుత్తముడనని, భార్యను అదుపాజ్ఞలలో వుంచడానికి, ప్రయత్నించాడు—నఫలుడయ్యాడు - కానీ యీ యాభైయ్యోపడిలో ఆమెదే పైచేయి అయిపోయింది ఆమె నోరె తన వాగ్ధాటిని మింగగలదు ఆమె గీసిన గీటు దాటకూడదు భార్య పెట్టిన హద్దులను మనసులోనే దాటడం అలవాటయ్యిందిప్పుడు. ఒక్కొక్కప్పుడు తన దృక్పథాన్ని ఆమె ఆమోదించటం జరుగుతూ ఆశ్చర్యాన్ని కలిగిస్తూంటుంది

సీతారామ స్వామికి క్లయింటులు చాలా తక్కువనే చెప్పాలి తండ్రి గడించింది లేకపోతే, బోర్డు తీసేసి యే ఆఫీసులోనో గుమాస్తాగా చేరవలసిందే కానీ తనకున్న ప్రాక్టీసువల్ల యెక్కడకు వెళ్ళటానికీ వీలులేకపోతూందని వచ్చిన కొద్ది మందితోను చెప్పకుండా వూరుకోలేక పోతున్నాడు తనలో గొప్పతనమట, రాబోయే విషయాలని గ్రహించే దూరదృష్టేనట దానికి తను ఎన్నైనా వుదాహరణలు యివ్వగలడు! తన ఒకే ఒక కొడుకు విషయమే ఉదాహరణ. కొడుకుపేరు వెంకట అప్పల రామనరసింహారావు—దేముడు, తల్లీ, తండ్రి అందరిపేర్లు ఈ పేరో కలిశాయి ఈ రావూ ఒక ప్లీడరే తండ్రీ కొడుకు బోర్డులు గేటుకు రెండు వైపులా వుంటాయి రెండూ ఒకే సైజువి కానీ, ఇద్దరు మనుషులూ వేరే సైజు చెట్టు మొదలు—చీపురుపుల్ల! తండ్రికి నోరున్నాది బుర్ర లేదు—కొడుక్కి బుర్రున్నాది, నోరు లేదు అంచేత అర్జనలేదు ఆ స్థిపాస్తులమీద ఆధారపడి వుండవలసి వస్తోంది

వెంకట అప్పల రామనరసింహారావుకు—అన్నీ మనసులో పెట్టుకోవటం అలవాటు తండ్రి ఒక సంబంధం చూసాడు ఆపిల్ల స్కూలు ఫైనలు వరకు చదువుకుంది శరీర పొందికలో తనకు తీసిపోదు ఈ రావు కండలు తగిలిన వెచ్చని కౌగిలికోసం తహతహలాడేవాడు కానీ తండ్రికి ఇష్టంలేదని చెప్పలేదు ఆ అమ్మాయికి ఒకే ఒకతమ్ముడు వుండేవాడు ఆమెలానే చీపురుపుల్లలా వుండేవాడు రావుకు పెళ్ళయిన పదినెలలకే ఆ అర్భకుడు చచ్చాడు ఆ ఆస్తంతా కోడలుకి కలవబోతోంది—తన దూరదృష్టికి నిదర్శనం యిదైనా, సాధారణంగా పైవాళ్లతో చెప్పడు ఈ రావుకి పెళ్ళాం కాపురానికి వచ్చాక నాలుగు సంవత్సరాల్లో ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు-అంతా యించుమించు తల్లిరూపే-పోతే ఒకపిల్లకు మెల్ల కన్ను, ఇంకోపిల్ల నల్లగా వుంటుంది వీళ్లు పెద్దయి, చెల్లడానికి అకలసిన ఆస్తి చాలదని అంచనా వెయ్యొచ్చు!

పుల్లయ్య తాతలకాలంనించీ వీళ్ళతో సంబంధంవుంది పుల్లయ్యతాత రెండెకరాల పొలం రావు తాతదగర అంబారానికి పుచ్చుకున్నాడు పుల్లయ్యతండ్రి మల్లు నాయుడు మా పౌరుషం కల మనిషి-సీతారామస్వామి కొద్దిగా అలస్యానికి ఒప్పుకోక మాటంటే, స్వంతభూమి అమ్మి పంటపోయినా అంబా

రం కొలిచాడు ఆ నాటినుంచీ అంతా సవ్యంగానే సాగిపోతూంది

పుల్లయ్య పెళ్లాంతో పట్నం చేరేసరికి పొద్దు చుర్రుమంటోంది ప్లీడర్లిద్దరూ యింటిలోనే కోర్టు సృష్టించారు భార్య వాదిస్తోంది యేదో విషయం మీద కొడుకు మాటాడకుండా వింటున్నాడు పుల్లయ్యను చూడగానే పెద్దప్లీడరు "ఏంవోయి పుల్లయ్యా" నవ్వుతూ అన్నాడు

"వాడెక్కడ? తియ్యటి మనిషి కాబట్టే బంతిలాంటి పెళ్లాన్ని కట్టుకున్నాడు" అందుకుంది భార్య దండం ప్రెుక్కి—యిద్దరూ కొద్దిగా సిగ్గుపడ్డారు చిన్న ప్లీడరు చూపు ఒకసారి నీలిమీద పడింది మనసు ఇక పనిచెయ్యటానికి పూనుకుంది విరామ మెరుగని పని! "ఆరాత్రి వాళ్లు వుండిపోతే పుల్లయ్యకు మత్తునిద్రపట్టే తను యేదో పుస్తకం పట్టుకొని వరండా గదిలో, రాత్రి పండ్రెండు గంటలవరకూ తెలివేసుకొనివుంటే నీలికి నిద్దరపట్టదు ఆ వెలుతురువేపు కళ్ళుంటాయ్ తను లేవలేదు ఆమె! అందం పల్లెవనితల సొత్తు రోజంతా అద్దం ముందున్నా ఈపట్నంలో అందం అరనిముషంలోనే అరగిపోతుంద! అయితే నీలికి నిద్రపట్టదు—"

కోడలు వంటయింటికి వెళ్ళింది పుల్లయ్య చిన్న సిగుతో "బాబూ! ఆడమ్మలేనియిల్లు—ఏ ఉండావండూ నోరు చచ్చిపోయింది ఇదిగో యీ సిన్నదాన్ని "

"మంచిది—మంచిది" తలపంకించాడు పెద్దప్లీడరు "నీపేరే?" అన్న యజమానురాలి ప్రశ్నకు పుల్లయ్యే "నీలమ్మ— ఊరంతా నీలీ అని పిలుస్తారని అందుకున్నాడు

"శుభ్రంగా పనిపాటలు చేసుకుంటుందా?"

"ఓ! మనిషి కనబడ్డంలేదూ? పనిసెయ్యకపోతే మనిషెలా సేవ తేరతాది? పెద్దలు అంటారు-కూకున్న కూతురు కూలిపోయింది చేసినకోడలు సేవదేరిందని "

పుల్లయ్య మాటలకు పెద్దప్లీడరు ఘకాలుమంటూ "మాయింట్లోనా వంటపుట్టి—యిద్దరు నౌఖర్లూనూ "

పెళ్లాం కాస్త తీక్షణంగా చూసిందని కామోసు ఆగిపోయాడు కానీ పెళ్లం నోరత్తింది "మాకేంటోయ్ పుల్లయ్యా! ఆయనకు జడ్జీవుద్యోగం యిస్తానంటే యెందుకొద్దన్నారో తెల్సా?"

"చిత్తం! చిత్తం!"

"మనకు స్వతంత్రం వుండదోయ్! శ్రేప్రాద్దున్న కోట్లగొడబొస్తే మరి ఆయన మంత్రి అయిపోరా?"

"చిత్తం! చిత్తం!"

"కూర్చో అమ్మా" పెద్దప్లీడరు నీలివేపు తిరిగి అంటూ అంగటికి వెళిపోయాడు నీలి చీర సర్దుకొని ఆ పెరటివరండా గచ్చునేల మీద కూర్చుంది వరండాకు ఆనుకొని వున్న గదిలో చిన్నప్లీడరు కుర్చీమీదనుంచి,ఒళ్లంతా కళ్లుచేసుకొని, నోరావలించి నీలిని మింగేస్తున్నాడు ఆలోచన అన్నీ దాటి చీరలోనుంచి చొచ్చుకొని వెళ్ళిపోతోంది

పుల్లయ్య అంగటికి యజమాని సైగచెయ్యటంతో వెళ్లాడు రెండునెలలజీతం యింకా యివ్వలేదని కామోసు కోడలితో చెప్పి నొచ్చుకుంటున్నాడు వంటపుట్టి తిండికి వుంటె లేదన్నర బియ్యం దంచుగని, పెద్ద యజమానురాలు వీళ్లని వేగం పంపించేద్దామని చూస్తోంది

యిటూ అటూ వరండాలో పచారు చేస్తూ సీతారామస్వామి అన్నాడు "బాగుంది! ఛేష్షైన పిల్లని పెళ్లిచేసుకొన్నవ్ కానీ " ఆగిపోయాడు

"ఏం బాబో?"

"నివ్వు చెప్పినమాట వింటాదా?"

"వినకేం బాబూ?" చిన్న సిగ్గుతో "నా సెంతంటె అంత!"

"అలాగా! అయినా ఆ జాతిని అదుపులో వుంచుకోవాలి—నమ్మలేం!"

పుల్లయ్యకు యీ మాటల్లో ఆంతర్యం అర్థం కావటంవల్ల కామోసు నవ్వి, "తమరన్నది తెలిసింది ఏ దొచ్చినా ఆడాళ్ళనించె వస్తాది" అన్నాడు

"బాగా పోల్చావు! వాళ్లని పొయ్యిదగర—పిల్లలతోటి, వుంచాలికాని, ఇల్లు కదిపితే "

ప్లీడరు వుండి వుండి పెరటి వరండా వైపు చూస్తున్నాడు పుల్లయ్య అన్నాడు, "ఆడదానికి మొగోడు, మొగోడికి ఆడదీ, నమ్మకపోతే, యీ పెపంచకం యెలా నడుస్తాది బాబో! అలూ మనలాగ పేణం వున్నోళ్లేనా? యాత్రకీ జాత్రకీ యెల్లి నూడకపోతే "

"ఓయి పిచ్చోడా! రాను రాను నీకు తెలిసొస్తాదిలే నామాట విని పిల్లాజెల్లా అయ్యేవరకూ పెళ్లానికి అధికారం ఈయక!"

పుల్లయ్య చిన్న నవ్వు నవ్వాడు పెద్దప్లీడరు "నా మాటలు నీకు నచ్చలేదులే! ఎన్ని వందలమందో ముందు జరుగబోయేది చెప్పేజ్ఞానం నాకు వుందని ఒప్పుకున్నారు నేను కోర్టుకి వెళ్ళక్కర్లేదు నా కాళ్ల దగ్గరకే వస్తారు "

"చిత్తం! చిత్తం!"

"ఇంతకీ నేను చెప్పే దేమంటే, ఆడవాళ్లు దగా చేస్తారు జాగ్రత్త అని!"

పుల్లయ్య మాటాడలేదు అత్తా కోడలూ పెరటిలో యేదోవిసవిసలాడుకుంటున్నారు కోడలు అత్తకు తెలియకండా, వాళ్ళ కోసమని వంటవాడిచేత బియ్యం కడిగించిందని!

పొద్దు తిరిగింది యిద్దరూ శలవు తీసికొని బయలుదేరారు ఇంతవరకూ కొండంత సృష్టించుకొన్నాడు రావు నడుం విరిగింది. త్రోవంట పెళ్ళం ఏవో ఏవో అడుగుతోంది పుల్లయ్య మనస్సు అదోలా వుండటంచేత యేదో జబాబు చెప్తున్నాడు మొగుడలా వుండటం ఆమెకేం నచ్చలేదు బుగత యింటి వాళ్ళంతా మంచివారని చెప్తోంది —ఇంకా పొగుడుతోంది— పుల్లయ్య వోరచూపు చూసి—"బడాయికి బచ్చలికూర తినకపోతే తూటకూర" అన్నాడు

"ఏం అలాగ అంటున్నావ్" అంది

"సంసారం గట్టి, మెడ ఒట్టి!"అన్నాడు

చలికాలపు పొద్దువేగంగా సముద్రానికి దిగిపోతోంది రోడ్డు మీద నాటుబళ్ళు గడగడ చేసుకొంటూ సంతనుంచి తిరిగి వచ్చేస్తున్నయ్ ఒక బొగ్గుబస్సు బొక్కు—బొక్కు లాడుకుంటూ వెళ్ళిపోయింది పట్నం వైపు మర్రిచెట్టు నీడలు దాటి వస్తూంటే, రోడ్డుప్రక్కనే అంతదూరంలో చెరువు కనబడింది చెరువు నానుకొని పల్లపు భూములు వాటి నానుకొని మెట్టభూమి, ఆ మెట్టునానుకొని చిన్న గుట్ట!

మాటాడకండా మొగుడన్న మాటల్లోని అర్థాన్ని గ్రహించిన నీలి మెల్లగా అన్నది! "మనం పెడితే పెళ్ళికోరటం— పెటకపోతే చావు కోరటమా? ఒకరి మంచితో మనకి సంబంధం కానీ, ఒకరి సెడ్డతో లేదని మామామ్మ సెప్పింది ఆ బాబు బతకటానికి ఆదరువు నూపించాడు కదా—యెందుకలా అంటావు?'

పుల్లయ్య యింక కోపంతో దాచలేకపోయాడు "అత్తా కోడలూ అలాగయిపోయారే? మనంకూడు కళ్ళామే? ఆ బాబు నిన్ను నమ్మొద్దంటాడు—దగాసేస్తావట!"

మరి కోపంతో మాటరాలేదు ఎదరగా చెరువు కనిపిస్తోంది చెరువుదగ్గర ఆగి కొళ్లూ

(41-వ పేజీ చూడండి)

అబల చేసిన ఉపకారం

సూరిబాబుకు వీడో వచ్చిన కొడదులో పొరిసింది గోళ్లు గిల్లుకుంటూ ఎన్నాళ్ళు యీవిధంగా గడుపుతావు, అని యెంతమంది చెప్పినా, వినని సూరిబాబుకు యీనాడు ఓ ఫ్యాన్సీ షాపు పెట్టాలని హఠాత్తుగా బుద్ధిపుట్టటం ఆశ్చర్యంగానే వుంది తన జీవితంమీద తనకే ఓవిధమైన రోత పుట్టేటప్పటికి యిలాంటి బుద్ధి కలిగిందేమో అని అనుకున్నాడు కాకపోతే మగవాడయిన తర్వాత యీ ఏపని లేకండా, యితరుల శ్రమ ఫలితాన్ని అనుభవించే ఓ ఉసులు పాటు వుందిగదా అని యింటిపట్టున యెన్నాళ్లని వుండగలుగుతాడు కనక! కొంతమంది అనుకోవటమేమో, రైతులు బకాయిపెట్టినప్పటి నుంచి, సూరిబాబు, భవిష్యత్తును గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడని, ఆ ఆలోచన ఫలితమే చివరకు యీవిధంగా పరిణమించిందని ఎట్లాగైతే నేం ఓదారికి వచ్చి, తాను సంపాదించాలనే జ్ఞానం కలిగితే అంతకంటే లేనిదేముంది అని భార్య సంతోషపడింది

చిల్లర మల్లరకు వెచ్చించే అవసరం లేని సూరిబాబుకు ఫ్యాన్సీషాపు పెట్టాలంటే, పదివేలరూపాయలు కనీసం కావాలసి వస్తుందనేమాట తట్టకకాదు వెంటనే బ్యాంకులో డబ్బూ, యింకా పొలం అమ్మినబాపతుడబ్బూ చేర్చి, గవర్నరు పేటలో ఓ ఫ్యాన్సీషాపును పెద్ద ఆడంబరం యేమీ లేకండానే తెరిచేశాడు ఈషాపు పెట్టటంతో తన దినచర్యలో పూర్తిగా మార్పు వచ్చేసింది ఇప్పుడు ఎనిమిదిగంటలకు బద్ధకంగా, మడత మంచంమీద నుంచే కాఫీ అయిందిటే అంటూ కేకలు పెట్టటానికి వీలేదు అసలు తొమ్మిది గంటలకే షాపు తెరవాలి! చీటికి మాటికి పెళ్లాంతో పోట్లాడటానికి అంతకంటె సావకాశంలేదు ఎప్పటికప్పుడు ఒక్కొక్క వస్తువు ధరెంతో, మార్కెట్టు రేటెంతోయిదే ఆలోచనను! పిల్లలతో గిల్లికయ్యం పెట్టుకోవటానికి అంతకంటె తీరుబడిలేదు తల్లిని తిట్టటానికి సమయమే దొరకటంలేదు అందువలన క్రమక్రమేణా ఆ అవసరం కూడా తీరిపోయింది ఆమెగారి పొలం వ్రాసిఇవ్వమని అడగటానికి, తన వ్యక్తిత్వం అడ్డువచ్చే

స్తోంది దాంతో, తల్లితో తగాదేలేదు కొడుకు ప్రయోజకుడు అవుతున్నాడని తల్లి సంతోషించింది మొగుడు సంపాదనాపరుడవుతున్నాడని భార్య గౌరవిస్తోంది పిల్లలేమో యిప్పుడిప్పుడే నాన్నంటే లక్ష్యంగా వుంటున్నారు ఇది చెయ్యద్దు అంటే, నాయిష్టం నేను చేస్తాను అనే మధుకూడా, అట్లాగే నాన్నా అంటూ చతికిలపడిపోతున్నాడు దాసుడుగా పనిచేసే భార్యకూడా అతిచురుకుగా పనులు చేసుకుపోతోంది సూరిబాబు ఆరింటికి లేచేటప్పటికి, బాయిలర్‌లో నీళ్ళు సలసల కాగి ఉంటాయి మంచం దగ్గరకే, టూత్‌పేస్టు, బ్రష్, చెంబుతో నీళ్లు తయారవుతాయి ఏ ఇడ్డెన్లో, పెసరట్లో, చేసిపెట్టి పంపుతుంది భర్తను

షాపుకు మళ్ళీ మధ్యాహ్నం వేళకు, మధు అన్నం తీసుకొస్తాడు ఎండలు తక్కువగా వుంటే, సూరిబాబే యింటికివచ్చి అన్నం తినిపోతూవుంటాడు తాను వచ్చేటంతవరకు వసంత, కళ్ళుపెట్టుకుని కూర్చుని వుంటే, సూరిబాబుకు, తాను అన్నం పెట్టుకుని తిన్నరోజులు జ్ఞాపకానికి వస్తూవుంటాయి సూరిబాబు, అమ్మా అని తల్లిని పిలుస్తూవుంటే, కాంతమ్మకు, కొడుకుగాద కొచ్చి' కొట్టినరోజులు జ్ఞాపకానికి వస్తూవుంటాయి

సంపాదన ప్రారంభించినప్పటి నుంచి, సూరిబాబుకు డబ్బు విలువ తెలియటం మొదలుపెట్టింది అందువలనే యిప్పుడిప్పుడే పొదుపుగా వాడుకోవటం యేమిటో తెలుస్తోంది ఇంట్లో, తాను ఏ విషయంలోనూ కూడా జోక్యం కలుగచేసుకోవలసిన అవసరం యేమీ కనిపించటంలేదు చుట్టుప్రక్కల చిన్నషాపుల్లో లేని వస్తువులను కనిపెట్టి, సూరిబాబు ఉపాయంగా వాటన్నింటిని తెప్పించి పెటాడు ముందుగా, వ్యాపారం వృద్ధిపొందటానికి, ధరలు కూడా మార్కెట్టు ధరలకంటే, కొద్దిగా తగ్గించే వుంచాడు దాంతో సూరిబాబు వ్యాపారం బాగా వృద్ధి పొందుతూనేవుంది. సూరిబాబుకు అదివరకున్న అభిప్రాయాలు యెన్నో మారిపోయినాయి అసలు జీవిత గమనమే మార్పుపొందింది సంఘంలో అంటే తన చుట్టూవుండి, తనను అదివరకల్లా ఎద్దేవాచేసి తనను ఒక అసమర్థునిగా యెంచి జనసమూహంలో, తనకు యీనాడు ఒక మంచిస్థానం యేర్పడింది నలుగురూ కూడా సూరిబాబుగారు అంటూ ఎంతో యిదిగా మాట్లాడుతూవుంటారు తనను యీవిధంగా నలుగురూ యెందుకు చూస్తున్నారా అని తీవ్రంగా ఆలోచించే అవసరంకాని, అవకాశంకాని లేకపోయినా, అయిదో ఫారం తప్పిన తనకు, యీనాడు యింత గౌరవం లభించటానికి కారణం, తాను ఒక పెద్ద ఉద్యోగం చేస్తున్నాడనికాదు, ఒక పెద్ద ఫ్యాన్సీషాపుకు అధిపతి గనక అని సూరిబాబు మనస్సులో అనుకున్నాడు

తనకు వెంటనే ఏదో ఆలోచనగా వచ్చింది వీళ్లందరి దగ్గర కూడా వ్యాపార లక్షణాలే ప్రదర్శించాలని నిర్మొహమాటంగా వుండాలని లేకపోతే వ్యాపారం దెబ్బతింటుందని నయాపైసా దగ్గర్నుంచి లెక్కలు వ్రాయటం, షాపు పెట్టినప్పటినుంచి అలవాటు చేసుకున్నాడు దుబారా ఖర్చంటూ ఏమీ పెట్టటంలేదు మరీ అవసరమైతేతప్ప, లేకపోతే, రోజూ సత్యనారాయణపురంనుంచి, షాపుకు నడిచి వెళ్ళాలిసిందే, నడిచి రావాలిసిందే! కాఫీ, ఫలహారం యింటిదగ్గర తీసుకున్న తర్వాత, మళ్ళీ భోజనం వేళవరకు హోటలులో కాఫీకూడా త్రాగటానికి మనస్సు వప్పటం లేదు ఓనాడుగామాలు, అన్నం తీసుకు రావటం, ఆలస్యం అయేటప్పటికి, కాఫీ త్రాగాడు ఆ రోజంతా అనవసరంగా ఖర్చయిందే అని యెంతో బాధపడ్డాడుకూడ రోజు రోజుకు ప్రజలకు అవసరాలు యెక్కువవుతున్నకొద్దీ, సూరిబాబు వ్యాపారం అభివృద్ధి పొందుతూనే వుంది జీవితంలో షోకులకు, పైపైపూతలకు స్థానం ఎక్కువవుతున్నకొద్దీ, సూరిబాబు మనస్సులో సంతోషపడుతున్నాడు మెల్లిమెల్లిగా షాపులో మంచి మంచి సిల్కుచీరెలు, కూడా పెట్టటం మొదలుపెటాడు సూరిబాబు షాపు పెరుగుతున్నకొద్దీ, ప్రక్కవాటాకూడా తీసుకొన్నాడు

ఎప్పుడో షాపు తెరిచిన క్రొత్తలో, మధు, సుజాతల్ని తీసుకువెళ్లి చూపించాడు. తర్వాత ఎన్నిసార్లు ఉబలాటపడినా, అదిగో యిదిగో అంటూ నూరిబాబు దాటేస్తూనే వచ్చాడు ఇక సుజాత మారాము చేసేటప్పటికి తప్పనిసరి అయింది షాపుకు తీసుకురావటం పౌడరుడబ్బాలు, స్నో సీసాలు, రకరకాల సువాసనగల నూనె సీసాలు చూసేటప్పటికి వసంతకే భర్తను అడుగుదామనిపించింది అయితే యేమంటారో అనే జంకుతో వసంత వాటన్నింటిని చూస్తూనే లోపల కోర్కెల్ని లోపలే అణిచేసుకుంది. అయితే సుజాతమాత్రం వచ్చీరానీ మాటలతో, తల్లి అడగదలచుకున్నవేమిటో అడిగేసింది పసిపిల్ల అడిగిందికదా అని పట్టు బలవంతాన ఒక చవకరకపు రిబ్బను యిచ్చేశాడు నూరిబాబు, మిగతావాటికి తలోకవంకా చెపుతూను వసంత వూరుకోలేక, పసిపిల్ల అది అడిగినందుకైనా ఇవ్వొచ్చుగాదండీ అని అంటే, యీ సరుకంతా లోకులసొమ్ము, మనదనుకున్నావా యేమిటి అని సమాధానం యిచ్చాడు షాపులో తిరుగుతున్నంతసేపు, మధుకు యెన్నో అడగాలనిపించినా, చెల్లెలికి యిచ్చిన సమాధానము తనకుకూడా యిచ్చినట్లే అని భావించి మెదలకండా వూరుకున్నాడు

లెఖ్ఖగా యింట్లోకి కావలసిన వస్తువులు తేసుకుని నూరిబాబు సంచిలో ఇంటికి తీసుకు వెళ్లాడు వసంతకు ఆషాడల్లా నెమలికంఠం రంగుచీరమీదే వుంది మనసంతా ముష్టి పౌడరుడబ్బాయే యివ్వలేదు పసిపిల్ల అడిగినా, అలాంటిది ఖరీదుగల చీర యిస్తారా యేమిటి అని లోపల లోపల బాధపడుతూ వూరుకుంది తాను ఆ చీర కొనుక్కోవాలని యెన్నాళ్లిట్టో అనుకుంటున్నట్టుకూడా, ఏకాంతంగా నూరిబాబు లొంగిపోయే సమయంలో చెప్పినాకూడా ప్రయోజనం లేకపోయింది దానికి యెన్నో వంకలు వచ్చినాయి తన జీవితంలో ఒక్కే ఒక కోర్కెకుకూడా, నూరిబాబు విలువకట్టలేకపోయాడే అని వసంత యెంతో ఖేదపడింది సుజాత రాత్రిల్లా అద్దాలు, స్నో సీసాలు, పౌడరు డబ్బాలు యింకా యేవేమిటో అంటూనే వుంది మధు గట్టిగా యేమీ అనలేకపోయినా, తన మనస్సులో కోర్కెల్ని, తండ్రికి సమయం చూచి అప్పటికీ చెప్పేశాడు అయితే, మధు స్కూలుఫైనల్ పరీక్షు ప్యాసవటానికీ, టేబుల్ ఫాన్ తెచ్చుకోటానికి లంకెపెట్టేటప్పటికి, జరగాలిసిన యేళ్ళు గురించి మధు ఎంతో దిగులుగా ఆలోచించుకున్నాడు భార్య కోరికకుగాని, పిల్లల మురిపాలకుగాని లొంగని నూరిబాబు, బావమరిది విషయంలో తల్లి చెప్పినట్లు చేస్తాడని నమ్మలేకపోయినా, కాంతమ్మ వూరుకోలేక, ఎవ్వర్‌సిల్వర్ ప్లేటు, టీసెట్టు యివ్వమని బ్రతిమాలి అడిగింది బావమరిది స్వతహాగా మోజాపడి, నోరుచేసుకుని అడిగినా లాభం లేకపోయింది అప్పటికీ 'యింటికి వెళ్లగానే డబ్బు పంపిస్తాను లేవోయ్' అన్న బావమరిదికి కూడా, అప్పు పెట్టటం లేదనే సమాధానం వచ్చేటప్పటికి, బావమరిదికి చెడ్డ అసహ్యం కోపం వచ్చింది తనను గురించి హేయంగా అనుకుని పోతాడేమోనని, "అప్పు యివ్వటం మొదలుపెడితే, నా వ్యాపారానికి తిరుగుమొహం పెట్టినట్టేనని అనుకున్నాను లేకపోతే ఇవ్వటానికేమిటి" అంటూ ఇంట్లో చెల్లెలు ముందర అన్నాడు నూరిబాబు "ఈ కొత్త భాగ్యానికి మాట వెలితిపడ్డావేగాని, ఇంతకంటే యేం లేదు" అని చెల్లెలు అన్నా, అలా నిష్ఠురవాక్యాలు వ్యాపారం చేసేవాళ్ళు తెల్లారితే వినటం సహజమే అన్నట్టు నూరిబాబు వూరుకున్నాడు నట్టింట ఆడపిల్ల రాకపోకలకి నువ్వు ఆనాడు నీ బావ అడిగినది యివ్వకపోవటమే కారణము అని తల్లి బాధిస్తున్నా ఏకోశానా లెక్కచెయ్యలేదు నూరిబాబు.



రానురాను నూరిబాబు యింట్లో వాళ్ళను



దీర్ఘాలోచన

చిత్రకారుడు : రావాడ కృష్ణ, పుల్లేటికుర్రు.

★ అబల చేసిన ఉపకారం ★

"ఏమీ లేకమ్మ, మీకేమీ కొనుక్కోనక్కర లేదు అంతపెద్ద షాపుంది ఏది కావాలంటే అది తెచ్చుకోవచ్చు" అని అంటుంటే, వసంతకు పట్టరాని దుఃఖమే వచ్చింది పిల్లలకు చెడ్డ పుత్రోత్సవం వచ్చింది దెబ్బతిన్న అభిమానాన్ని చేతపుచ్చుకుని, భర్త దగ్గరకు వెళ్ళితే, "మిఠాయిదుకాణంవాళ్లు మిఠాయి తింటూ రనుకున్నావా? ఏ వృత్తివాళ్ళు ఆ వృత్తిలో జాగ్రత్తగానే ఉంటారు అలా వుండాలి కూడా ఎవరో ఏదో అంటున్నారని మనం ఇవాళనుంచీ ఒక వస్తువు తెచ్చుకోవటం మొదలుపెట్టామంటే, అదే అలవాటై, అవసరానికి అనవసరానికి, పరిహద్దంటూ ఏమీ లేకుండా పోతుంది చివరకు మనషాపుకే ముప్పువస్తుంది" అని, వ్యాపార సరళిలో నచ్చజెప్పటానికి సూరిబాబు ప్రయత్నించేశాడు తనకు నచ్చని సమాధానమైనా దిగమింగుకుని, నిజమే అన్నట్టు, భర్తను తృప్తిపరుద్దామనే తాపత్రయంలో తలవూపి వసంత వెళ్ళిపోయింది

ఎంతవుంటేం అనుభవించే గీత వుండద్దా అని అల్లుడు నోట్లో కని అనే సామెత మాదిరిగా వుందని, రాను రాను పీనాసి అనేమాటకూడా తన చెవిన వేసుకుని కూడా యింట్లోనూ, బైటకూడా నోరెత్తి యేమీ అనటంలేదు సూరిబాబు. ఇంకా యెన్నోరకాల సామాన్లు తెచ్చి షాపు యెంతో అలంకారంచేసి వుంచేశాడు. ఈషాపు పేరుబడిపోవటంతో ఆచుట్టు ప్రక్కలవున్న రెండు చిన్నషాపులు యెత్తేసుకోవలసి వచ్చింది కూడాను ఇంత యిదయినా సూరిబాబు ప్రవర్తనలో, యింట్లోవాళ్లు గాని, బైట స్నేహితులుగాని సంతోషించే మార్పేమీ లేదు, నూటికి నూరుపాళ్ళు వ్యాపారమనే వలయంలో చుట్టుకుపోయాడు. ఎంతసేపటికీ యింకా డబ్బు సంపాదించాలనేదే సూరిబాబు దృష్టి. ఆ యింకాకు మితం యెక్కడో అర్థంకాదు

మధ్యాహ్నం మధు తెచ్చిన అన్నం కాస్త తినేసి సూరిబాబు వాలు కుర్చీలో వత్తిగిలాడు ఇట్టే కునుకువచ్చేసింది తేమాయించుకుని లేచి చూస్తున్నాడు ఎండ కొంచెం తీవ్రంగా వుందోఏమో, షాపుకు యెవ్వరూ రాలేదు టేబుల్ మీద యేదో పుస్తకం వుంటే పేజీలు తిరగేస్తున్నాడు అపుటలో కిమాస్తుంటే తన గతచరిత్ర తిచప్పున జ్ఞాపకం వచ్చింది తాను హైస్కూలులో చదివేరోజులు మునిసిపల్ హైస్కూల్. తాను చదువు యెప్పటికప్పుడు యెట్లాదాటేస్తూ వచ్చిందీ, మాస్టర్లను మోసగించి క్లాసులు ఎట్లా ఎగేసిందీ, రంగనాథంగారు క్లాసులో పాఠాలు యెట్లా చెప్పేది, కొండలరావుగారి లెఖ్ఖల పీరియడ్, రామారావుగారి ఇంగ్లీషు పీరియడ్, యింకా యేవేవిటో దొర్లుకుంటూ, వస్తున్నాయి తన స్మృతి పథంలోకి రామారావు బాబాయి చప్పున జ్ఞాపకానికి వచ్చారు ఆయనే కనక యింకా కొన్నాళ్ళు బ్రతికే వుంటే నాకు చదువు వచ్చివుండేదే అనుకున్నాడు. నా చదువుగాకా యెందుకు, ఆయనే కనక యింకా బ్రతికేవుంటే, మన బంధువుల్లోనే చాలామంది జీవితాలు యీ విధంగా కాక, యింకోరకంగా పరిణమించేవో అని అనుకున్నాడు ఆయన బంధుప్రేమకు పాత్రులు కాని, తన బంధువర్గంలోవాళ్లను దూషించుకుంటున్నాడు ఆయన విశాల హృదయంగాని, నిష్కల్మషమైన మనస్సుగాని, తాను ఎరుగున్నంతలో ఇంకెవ్వరికీ కూడా లేదనుకున్నాడు ఆయన్ను గురించే యింకా మనస్సు పనిచేస్తూ వుంది చటుక్కున క్లబ్బులో ఆయన అన్న మాటలు జ్ఞాపకానికి వచ్చినాయి అప్పట్లో ఆయన అన్నదానికి అర్థం తెలియలేదు తెలిసినట్లు తల వూపి, తాను మైనరును కాదనినిరూపించుకున్నాడు. 'జీవితం ఒక ప్రవాహం వంటిది ఏమీ అడ్డం లేకుండా సాఫీగా ప్రవహిస్తూ, నదిలో కలిసి చివరకు సముద్రంలో కలిసిపోతుంది కాక

ఎక్కడైనా యేదో రాయో, మెరకో అడ్డం వచ్చిందంటే, దాని గమనం తీరే మారిపోతుంది. అట్లాగే జీవితానికి కూడా, దాని నడకలో ఎక్కడో యెప్పుడో యేదో అడ్డం వసుంది. దాంతో జీవితమే పెద్ద మార్పుపొందుతుంది. ఆయన అన్న మాటలు లీలగా అర్థమవుతూవచ్చాయి. తనజీవితంలో షాపు పెట్టటమే ఓ గొప్ప మార్పును తీసుకువచ్చింది. ఈ షాపు పెట్టడమే కనక లేకపోతే నా జీవితం ఎటూ వెళ్ళిపోయేదో యేమిటో! ఇదొక నూత్న అనుభవం. అందువల్లనే యీ జీవితగమనంలో యేనాడు యెలాంటి మార్పు వస్తుందో తెలీదుగదా అని ఆలోచించుకుంటూ సూరిబాబు, రామారావు గారు అన్నమాటల్ని స్మరించుకుంటున్నాడు. అంతా అతనికి ఆశ్చర్యంగా తోస్తోంది. తన ఆలోచనా ప్రవాహం చప్పున కట్టుబడింది, ఎవరో అమ్మాయివచ్చి పాండ్స్ స్నో యివ్వమనేటప్పటికి.

అయిదింటికి కూడా యింకా బాగా ప్రొద్దువుంటూనే వుంది. చలికాసకొండల వెనకబడిపోయింది. రాత్రి తొమ్మిదీ, తొమ్మిదిన్నరదాకా షాపునిండా జనం కిటకిటలాడుతూనే వుంటున్నారు. అమ్మకానికని పెట్టిన యిద్దరు కుర్రాళ్లు బేరాలు చెప్పటంలోను, మనుష్యులను రాబట్టటంలోను ఆరితేరారని సూరిబాబు కూడా సంతోషిస్తూనే వున్నాడు. షాపుకు రకరకాల వాళ్లు వస్తున్నారు. కొంటరుముందర కూర్చుని బిలును పట్టి డబ్బు వసూలు చేసుకునే పని తీసుకున్నాడు. బజార్ల వెంబడి వెళుతూ వస్తూవుంటే మనుష్యులందర్నీ కూడా తన షాపుకు వస్తున్నారేమోననీ ఆదుర్దాగా వాళ్లి మొహాలు వైపు చూడటం సూరిబాబు బాగా అలవాటు చేసుకున్నాడు. మొదట్లో తొమ్మిదిన్నరకు తన షాపుకు ఎదురుగా బజార్లోంచి ఓ అమ్మాయి సంచీపట్టుకుని వెళుతుంటే తన షాపుకు వస్తోందేమోనని ఆ అమ్మాయి మొహంలోకి చూశాడు. ఆ అమ్మాయికూడా కళ్ళుషాపు వైపుకు ఎత్తి, సూరిబాబును వూరించింది. రెండో తడవ ఆ అమ్మాయి మొహంలోకిచూసేటప్పటికి యీ అమ్మాయి యీ టైముకు యెప్పుడూ వెళుతూనే వుంటుందిలే అని అనుకున్నాడు. సాయంత్రం అయిదున్నరకు మళ్ళీ ఆ పరిచితమైన మొహమే కనిపించేటప్పటికి, యీఅమ్మాయి కొనేరకం కాదనుకున్నాడు. నిర్ణీతమైన టైములో ప్రొద్దున, సాయంత్రం అదే పనిగా సూరిబాబు కళ్ళల్లోకి ఆ అమ్మాయి, నిత్యం వస్తూనేవుంది, మనిషి లేతగులాబిరంగు అప్పుడే విచ్చిన మల్లెమొగ్గ వయస్సు అరింటికి ఏటవాలుగా పడుతున్న సూర్యకిరణం, ఆ అమ్మాయి కంఠంలో వేసుకున్న ముత్యాలహారం మీదపడి, సూరిబాబు కళ్ళు చెదిరిపోయేటట్టు చేసింది. కళ్ళు చప్పున మూసుకుని, వెంటనే తెరిచాడు. ఆఅమ్మాయి చంగుచంగున వెళ్ళిపోతుంది. సూరిబాబు కళ్ళు ఆ అమ్మాయివెంట పరుగెత్తుతున్నాయి. వెంటనే ఓ బిల్లువచ్చి, టేబుల్ మీదపడి సూరిబాబు దృష్టికి అడ్డంగా నిలిచింది. సూరిబాబు వ్యాపార దృక్పథంతో చిరునవ్వు మొహంపెట్టి, డబ్బు తీసుకున్నాడు. ఆ వ్యక్తి నవ్వు, సూరిబాబుకు కటువుగానే వుంది. అప్పుడప్పుడా అమ్మాయి, సూరిబాబు మొహంలోకి చూస్తున్నా, సూరిబాబు నిత్యమూ రెండుసార్లు, ఆ అమ్మాయి కళ్ళల్లోకి చూస్తూనేవున్నాడు. ఆ అమ్మాయి, మనషాపుకువస్తే బాగుండుననే వుద్దేశం, వ్యాపార దృక్పథంతో కలగలేదు. సూరిబాబుకు ఎంతో పరిచితమైన వ్యక్తిగా భావిస్తున్న సూరిబాబుకు, ఆ అమ్మాయితో కనీసం మాట్లాడనైనా మాట్లాడకపోతే, మనస్సు శాంతించేటట్టు కనిపించటంలేదు.

ఆ అమ్మాయి అనుకోకండా షాపులోకి నీటుగా వచ్చేసింది. సూరిబాబువంక చూడకండానే సిగ్గేమోనని సద్దుకున్నాడు. ఇలాంటి పరిస్థితులో యింకోళ్ళయితే దెబ్బతిన్న అభిమానంతో త్రాచులాగ పైకిలేచే పరిస్థితే! ఏవో రెండు సరుకులుకొని బిల్లు డబ్బు టేబుల్ మీద పెట్టింది. సూరిబాబు గుండె దడదడ కొట్టుకోవటం మొదలు పెట్టింది. చప్పున లేచినుంచున్నాడు. మొహాన రుమాలుతో గట్టిగా తుడుచుకుని, 'చిల్లరలేదు పోనీ తర్వాత యివ్వండి' అని అయిదురూపాయలనోటు మళ్ళీ ఆ అమ్మాయి చేతికి అందించబోయాడు. ఆ అమ్మాయి చిరునవ్వు నవ్వింది. సూరిబాబు తేలిపోయాడు. నవ్వుకుంటూ ఆ అమ్మాయి అయిదురూపాయలనోటు తీసుకుని వెళ్లిపోయింది. సూరిబాబు ఆనందం పట్టలేకపోయాడు. ఇంకోసారి వచ్చినప్పుడు ఆ అమ్మాయి అతిచొరవగా వస్తువులు తీసుకుని, సూరిబాబు మొహాన బిలుతోపాటు ఓనవ్వును కూడా పారేసి, చకచక వెళ్లిపోయింది.

ఫస్టుతారీఖు వచ్చేటప్పటికి జమాఖర్చులు తయారుకాలేదు. లెఖ్ఖలు అన్నీ గజిబిజిగా వుండిపోయినాయి. లాభం ఎంతవచ్చిందో, ఎవరెవరికి ఎంతయివ్వాలో తేలటంలేదు. సూరిబాబు మనస్సు కూడా చెడ్డచిరాకుగావుంది. "ఇవ్వాళ సాయంత్రం పెందరాళే వచ్చేశారు. దురగుడకి వెళ్లిరాలేదేమిటి" అనీ వసంత అడుగుతే, ప్రతిదానికి ఆరాతీసి అడుగుతోవుంటావని కస్సుమన్నాడు సూరిబాబు. జోరున వర్షం కురుస్తుంటేకూడా గొడుగేసుకుని రాత్రి పదింటికి వెళుతుంటే వసంత గట్టిగా పట్టుపట్టి ఆపుదామనుకుంటే వీలులేకపోయింది. వసంత అనుమానాలు రోజురోజుకు సూరిబాబు ప్రవర్తనకి దృఢపడిపోతున్నాయి.

ఆ అమ్మాయికి పూర్తిగా సూరిబాబుదగ్గర చనువు ఏర్పడటానికి ఎక్కువ కాలం పట్టలేదు. "శశిరేఖ పేరు బాగాలేదు. రేఖా అని పిలుస్తాను ఎంతో బాగుంటుం"దంటే, ఆ అమ్మాయి సూరిబాబు మురిపానికి అభ్యంతరం చెప్పలేదు. సుజాత మంకుపట్టుపట్టి, నాన్నా నాకు ఇవ్వవు అని మారాము చేసిన ఒక స్నోడబ్బాయే కాదు, అలాంటివి ఎన్నో శశిరేఖకు వెళ్ళిపోయినాయి. ఆ అమ్మాయికి ఇచ్చిన వస్తువులన్నీ లెఖ చూసుకుని, చివరకు లాభంలో కొంత తగ్గిందనుకుంటాలే అని సూరిబాబు తృప్తిపడుతున్నాడు. సూరిబాబుకు డబ్బు విలువతోపాటు, మనిషి విలువకూడా తెలియటంలేదు. ఉన్న సరుకు అమ్ముకుంటే చాలు యెంతైనా లాభంవస్తుందనే సిద్ధాంతంలో క్రొత్త వస్తువులేమీ తెప్పించకపోవటంతో, వచ్చినవాళ్లకు చాలావరకు లేవు అనే చెప్పాలసివస్తోంది. నాలుగువస్తువులు లేవు అనేటప్పటికి, ఉన్న అయినోవస్తువు కోసం యెవరూకూడా రావటంలేదు. బేరం సన్నగిలేటప్పటికి గుమాస్తాల బరువు యెక్కువయింది.

రేఖ సూరిబాబుకే కాదు అందరికీ కూడా ఎంతో అందంగా కనిపిస్తుంది. తన సర్వస్వము యివ్వటానికి సిద్ధపడ్డ సూరిబాబుకు, ఆ అమ్మాయి పూర్తిగా లొంగిపోయిందంటే ఆశ్చర్యంలేదు. ఆ రోజుల్లో సూరిబాబుకు అంతా రేఖమయంగా వుండేది. ఎన్ని అడిగినా ఏమీ అడ్డుచెప్పకండా రేఖకు యిస్తూపోతూ వుండేవాడేకాని, ఆ నెమలికంఠం రంగు రేఖ యివ్వమన్నప్పుడు సూరిబాబు కొంచెంగా తటపటాయించిన మాట వాస్తవమే, వసంత ముద్దుగా అడిగినప్పుడు, ఖచ్చితంగా వీల్లేదన్న సూరిబాబు మనస్సు తర్వాత తర్వాత తీవ్రంగా పనిచేసి, ఆ చీర తన భార్య పుట్టినరోజు పండగనాడు తనం

★ అబల చేసిన ఉపకారం ★

ట తాను తీసుకువెళ్లి ఇచ్చి, వసంతకు, తన మీద వున్న అభిప్రాయాలన్నింటిని పటాపంచలు చెయ్యాలి అనే వుద్దేశంతో ఆ చీర మాత్రం విడిగా పెట్టివుంచాడు సూరిబాబు భార్యకే సర్వ హక్కులు సంపాదించుకున్న రేఖకు ఆ షాపులో వెదకని చోటంటూ వుండదు కదా! ఆ అమ్మాయి కళ్ళు కూడా ఆ చీరమీద పడటంతో సూరిబాబు మనస్సు చివుక్కుమంది క్షణకాలం అయితే ఆ చీరెరంగు రేఖ వంటికి ఎంతో అందం ఇస్తుందని సూరిబాబు ఒప్పుకున్నాడు తర్వాత రెండుమూడుసార్లు అడిగినా కూడా రేఖ ఏదో సమాధానం ఇచ్చేసి మాట తప్పించిందన్న మాటేగాని, తాను నెమలికంఠరంగు చీరెకట్టుకు రాకపోవటానికి తగిన కారణాలేవి చెప్పలేదు ఆ చీరెరంగులో రేఖ యెట్లా మెరుస్తుందా చూద్దామన్న సూరిబాబు ఆకాంక్షకు మోక్షం వచ్చే ఉపాయం కనిపించటం లేదు పిచ్చివాడులాగ రేఖ చుట్టూ తిరుగుతూ చీరెవిషయం యెన్నో సార్లు అడుగుతూ వచ్చాడు

తాను పకపకా నవ్వుతూ, సూరిబాబు భుజంమీద చెయ్యి వేస్తే, సూరిబాబు ఏమవుతాడో రేఖకు బాగా తెలుసు ఈ అస్త్రాన్ని వుపయోగించాలసిన అవసరం యెప్పుడు కలిగినా ఆ అమ్మాయి వెనుదియలేదు సూరిబాబు ఆరోగ్యం చెడిపోవటానికి ప్రత్యేకంగా కారణాలేవంటూ వసంత వూహించలేకపోతోంది తాను పడుతున్న అనుమానాల్ని ధైర్యం చేసి భర్తదగ్గర అనే తాహతే లేకపోతే పరాయివాళ్లతో యే మొహం పెట్టుకొని చెపుతుంది కనక!

సూరిబాబు షాపు ఫలానా గంటకుగాని, ఫలానా రోజుకుగాని తెరుస్తారు అనే అంచనా ఎవరూ కూడా వేసుకునే ఆసరా లేకండా పోయింది సూరిబాబు చిత్తప్రవృత్తినిబట్టే షాపు తెరుస్తూవుంటాడు రెండుమూడురోజులు వరసగా రేఖ కనిపించకపోయేటప్పటికి సూరిబాబుకు మతి చెడినట్లనిపించింది షాపులో చాలావరకు సరుకంతా అయిపోయింది నాలుగు అలమారలు, రెండు బీరువాలు, అయిదుకుర్చీలు, యింకా కొద్దిగా సరుకు తప్ప యింకా యేమీ లేవు షాపులో షాపుకు కట్టవలసిన అద్దె భారం యెక్కువయిపోయింది రోజు, రోజూ యజమానితో తగాదాపడే బదులు షాపు ఖాళీ చేసిపోతే బాగుంటుందని సూరిబాబు తీవ్రంగా ఆలోచించుకుంటున్నాడు అప్పటికి రేఖ కనిపించి వారం దాటిపోతోంది రేఖను గురించి ఇంకోవిధంగా ఆలోచించటానికి సూరిబాబు మనస్సు ఒప్పటం లేదు ఏదో అనుకోకుండా హఠాత్తుగా పనితగిలివుండాలి అందువలనే రేఖ యీ జాడలకు కూడా రావటం లేదు అని అనుకుంటూ తృప్తిపడుతున్నాడు

రేఖ ఫోటోవంకే చూస్తూ యెంతసేపు కూర్చున్నా, తనివి తీరటం లేదు ఇంట్లో భార్య, పిల్లల పోరు పడలేక, "వ్యాపారంలో పెద్ద నష్టం వచ్చింది అందువలన షాపు యెత్తెయ్య వలసివచ్చింది" అన్నాడు సూరిబాబు తల్లి అడిగిన యేదో ప్రశ్నకు వికటంగా సమాధానం చెప్పి మీదకు వచ్చాడు కొట్టరావటానికి మెల్లిగా భావిదగ్గరకు వెళ్ళి మొహం కడుక్కుని, వంటింట్లోకి వచ్చాడు కాఫీ అయిందా అంటూ "ఓ మూలచేతులో పనిచూస్తుండి కూడ కాఫీ, కాఫీ అంటూ అరుస్తారే" అన్నది వసంత మొహం మటమటలాడించుకుంటూ విసుగ్గా తిట్టుకుంటూ వాకిట్లోకి వెళ్ళిపోయాడు సూరిబాబు ఇవ్వాళ్టితో షాపు యెత్తెయ్యాలని అనుకుంటూ గబగబ రిక్షామీద గవర్నరుపేట వచ్చేశాడు

చల్లటిగాలి మెల్లగా వీస్తోంది ప్రక్కన పూలదుకాణాల్లోంచి వస్తున్న ఘుమఘుమలు, నాసికారంధ్రాల్లోకి పోయి హృదయాన్ని గిలిగింతలు పెట్టేస్తోంది రోడ్డునిండా జనం, కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ పోతున్నారు పార్కులోంచి రేడియో సంగీతం కమ్మగా వినిపిస్తోంది సూరిబాబు బరువుగా షాపులో కూర్చున్నాడు అయిదున్నర అవబోతుండగా ఎందుకనో తన కళ్లు రోడ్డుమీదపోతున్న జనంమీద పడ్డాయి అప్పటికే రేఖ కనిపించి, చాలా రోజులయింది అందువలన అనిర్ణీతమైన టైముకు అక్కడకు వస్తుందంటే సూరిబాబుకు నమ్మకం కుదర్లేదు అయినా అలవాటుచొప్పున సూరిబాబు అటు చూస్తూనే వున్నాడు అప్పటికే బీరువాలు బండీమీద ఎక్కించటం అయిపోయింది తనవసువు అనేది యేదీ లేకుండా షాపు ఖాళీ చేసేశాడు ఒకసారి నాలుగు మూలల కలయచూసి తలుపులు రెండూలాగి తాళం వేసేశాడు ఒక్కసారి పెద్దనిట్టూర్పు విడిచి ఆ షాపువంక చూసి బయటకు వచ్చేశాడు బళ్ళువుతే ముందర పోతున్నాయి తాను వెనకాలే నడుస్తున్నాడు నాలుగడుగులు వేశాడో లేదో, సూరిబాబు కళ్లు చెదిరిపోయినాయి నెమలికంఠం రంగు చీరె కొసలు గాలికి రెపరెప కొట్టుకుంటూ కనిపించాయి

చప్పున తలెత్తి చూచాడు రేఖ! రేఖే! శశిరేఖ! నిండుయవ్వనాన్ని నెమలికంఠం రంగు చీరలో కప్పుకుంది ఆమె శరీరపు లేతగులాబి రంగు, పైకి కనిపిస్తున్నంత వరకు తళతళ మెరసిపోతోంది వాలు జడంతా, మల్లెమొగ్గలు చుట్టేసుకున్నాయి సూరిబాబు అలాగే నిలబడిపోయి ఆశ్చర్యంగా శశిరేఖ వంక చూస్తూ రేఖా అనబోయాడు రేఖ వయ్యారంగా, చంద్రం చేతిలో చెయ్యివేసుకుని, సూరిబాబును చూసీచూడకండా వెళ్ళిపోయింది సూరిబాబు రేఖవైపుకు తిరిగాడు

రేఖ ఒక్కసారిగా తన శరీరాన్ని చూసుకుని, పమిటకొంగు గిరాగిరా త్రిప్పుకుంటూ, సూరిబాబు కళ్ళల్లోకి చూసి పకక్కున నవ్వి, చంగుచంగున వెళ్ళిపోయింది, చంద్రంతో

సూరిబాబుకు, హృదయచలనం ఆగిపోయినట్లనిపించింది

వెర్రిగా షాపు తాళంవంకా, వెళ్ళిపోతున్న రేఖవంకా కళ్ళు త్రిప్పుకుంటూ, అలాగే నిలబడిపోయాడు, సూరిబాబు ★

కష్టాలు

బి. రామకృష్ణ

మా పెద్దమ్మగారికి మంచి చీరతీసికొని రావాలని బజారుకు బయలుదేరాను మా పెద్దమ్మగారికి నేనంటే అమిత ప్రేమ తనకు మొదట అందరూ ఆడపిల్లలే కలగటంతో నన్ను తీసికెళ్ళి పెంచింది తరువాత ఆమెకు కూడ మగపిలలు పుట్టారు నాకు జబ్బుచేసిందని తెలిస్తే మా వూరికి వచ్చేసింది వెంటనే ఉద్యోగంలో చేరాక నేనామెను చూడటానికి వీలుపడలేదు ఈమధ్య నన్ను చూడాలని ఉందని, వెంటనే రమ్మనీ, పదే పదే ఉత్తరాలు వ్రాసింది ఓ పదిరోజులు సెలవు పెటివచ్చా వచ్చినప్పటినుండి పిండి వంటల్తో నాపని క్రొత్తగా అత్తగారింటి నుంచి తిరిగొచ్చిన అమ్మాయిలా తయారయింది

అటువంటి ఆమెకు ఓ మంచి చీరకొనాలని బజారుకెళ్ళాను చీరకొని తీసుకుని తిరిగి వస్తూ ఒకహోటల్లో ప్రవేశించి కూర్చొని 'కూల్ డ్రింక్'కు ఆర్డరిచ్చి గోడలపై నున్న సినిమాపోస్టర్లు చూస్తున్నాను

"మేష్టరుగారూ" అంది ఓ స్త్రీకంఠం

నాకెదురుగా ఓ అమ్మాయి కూర్చొని వుంది ఇంతకుముందు పిలిచింది అమే నని తెలుసుకోడానికి ఎంతోసేపు పట్టలేదు కాని ఎవర్ని పిలిచింది వూహించ లేక పోయాను అమ్మాయివైపు ఒకక్షణం చూచాను అంతకన్న ఎక్కువగా ఓ అందమైన అమ్మాయివైపు చూడటం భావ్యం కాదని సర్వరును రిమైండుచేశాను

"మేష్టరుగారూ" అంది మళ్ళీ నేను మేష్టర్ని గాను మరి ఎవర్ని పిలుస్తూంది? ఆఅమ్మాయి నావైపే చూస్తూంది

"మిమ్మల్నేనండీ" అంది యీమారు నాకేం పాలుపోవటం లేదు

"నేను మేష్టర్ని కాదండి పొరబడ్డారు" అన్నా "మీపేరు '___' కదూ" అంది "అవును" అన్నా నాపేరుగల అతను ఆమె మేష్టరు అయుండవచ్చు కాని నాపోలికెంగు వుండాలి "నేను మేష్టర్ని కాదండీ" అన్నాను

"అందరికీ కాకపోవచ్చు కాని నాకు మాత్రము మేష్టరే" అంది ఇంతలో సర్వరు కూల్ డ్రింకు తెచ్చిపెటి ఆఅమ్మాయివద్దకు వెళ్ళాడు నాకేమిలోచటంలేదు ఆఅమ్మాయికి మతిచెడి ఉండాలి, లేదా నాకైనా చెడిఉండాలి కూల్ డ్రింకు త్రాగాను అన్నిరుచులు తెలుస్తున్నాయి కాబట్టె నాకు మతివుందని నిర్ధారణచేసుకున్నాను ఇంతకూ నేను టెంపరరీ మేష్టరీకూడ చేయలేదు ఆ అమ్మాయి "మేష్టారూ" అంటుంది

"ఇప్పటికన్నా తెలుసుకొన్నారా"అంది మళ్ళీ ఇకవూరుకొని లాభంలేదనుకొన్నా "చూడండీ మీరు నావద్దచదువుకొన్నారా?" అడిగాను "అవును" అంది ధీమాగా "మీ పేరు?"

"సుశీలారణి" అంది పేరుకేం ఎక్కడెక్కడో వినిఉండొచ్చు పేరుచెప్పినా మనిషి గుర్తుకురావడంలేదు

"నావద్ద ఎప్పుడు చదువుకొన్నారు?" అన్నా "మీచేతే చెప్పిస్తా వినండి మరి మీ నుదుట మీద ఆ గాయం ఏమిటి?" అంది డిటెక్టివ్‌లాగ

"ఇదా నాచిన్నప్పుడు చదువుకొనే రోజుల్లో తగిలింది" అన్నా ఆయోమయంగా

"ఎలా తగిలింది?" ప్రశ్నించింది సుశీలారాణి

"సోడాబాటిల్ పగిలి పెంకు గ్రుచ్చుకుంది" చెప్పాను "సోడాబాటిలు ఎవరు బ్రద్దలు చేశారు?" అంది నా ప్రక్కనున్న కుర్చీలోకి వస్తూ

గతమంతా గిర్రున మెదడులోకి వచ్చింది నేను చదువుకొనే రోజుల్లో ఒకసారి వేసవి సెలవుల్లో మాయింటికి వచ్చాను మాయింటి ప్రక్కన ఎవరో ఆఫీసరుంటే వారు మధ్యాహ్నమయేసరికి మా అమ్మగారు ఆఫీసరు భార్య కబుర్లకు కూర్చునే వారు నేనేమో అన్ని రోజులూ రాత్రుల్లో మేలుకుని (తేనీరు సేవించి) చదివి పరీక్షలు వ్రాసి వచ్చాను ఇక్కడైనా పగలు కాస్త నిద్రపోదామంటే మా అమ్మగారికి పగటె నిద్ర అంటే చుర్రుమంటుంది తనపాటికి తాను ఆ వచ్చినావిడతో మాట్లాడుకోక నన్ను కేక లేసేది

ఈ సమయంలో ఆఫీసరుగారి భార్య ఓ చిన్న సలహా పారేసింది అదేమిటంటె నేను వెళ్ళి వారు పెంచుకొంటున్న ఆవిడ అన్న

★ శిష్యురాలు ★

నాతురు సుశీలారాణికి పగటిపూట కొంత ట్యూషన్ చెప్పాలట. అమ్మాయికి చెప్పడానికి తమ యింటికి ఏ మేష్టరు రావడం లేనందునా, అమ్మాయిని మేష్టరింటికి పంపడానికి యిష్టం లేనందునా, అంతకుమించి అమ్మాయి వచ్చేయేడు సెకండుఫారములో ప్రవేశించబోతూ లెక్కలలో చాల వెనుకగా వున్నందునా, ఆ పదకొండేళ్ళ పిల్లకు నేను ట్యూషన్ చెప్పాలట

"నే నేం వీరి నౌఖరనుకొన్నదేమో వారింటికి వెళ్ళడానికి నాన్సెన్స్ అనుకొన్నా గాని వారింటినుండి వీనుల విందుగా వింటున్న రేడియోగ్రాం జ్ఞప్తికొచ్చేసరికి సరేనని ఒప్పుకున్నా అలాగైనా ప్రొద్దు గడపవచ్చని మరునాడే డ్యూటీకి అటెండయ్యాను

ఆ అమ్మాయికి చెప్పడం అనుకొన్నంత సులభంగా లేదు అమ్మాయిని మురిపంగా పెంచి పెంకిఘటంగా తయారుచేశారు కాబట్టి రాణికి చెప్పాలంటే మా తాతలు దిగి వచ్చేవారు

"చూడండి మేష్టరూ ఎప్పుడూ చదువుతూంటే పిచ్చిపడుతుందటగా" అంటుంది పుస్తకం తీయకముందే

"ఫరవాలేదులే మరి అనేది ఒకటుంటేగా చెప్పడానికి" అంటూనే

"ఎవరికండి" అనేసేది రాణి

"చూడండి మేష్టరు యిప్పుడేమో మంచి ప్రోగ్రాముంది మరి రేడియో పెట్టుకొందామండి అనేది "మరి లెక్కలమాటో?" "ఓస్ అవి మీరు చెయ్యలేరేంటి, నేనుచేసి పెట్టడానికి మీరుచెయ్యండి అత్తయ్యతో నేనే చేశానంటాగా" అనేది తన బుద్ధిబలాన్ని ప్రదర్శిస్తూ

"అలా వీలుపడదు ముందు లెక్కలు పూర్తికానీ! అని కోపపడేవాడ్ని కాని ఫలితం నయాపైసంతయినా లేదు

ఒకరోజు మామూలుగా లెక్క చెప్పిస్తున్నా రాణి మాత్రం వినటంలేదని తెలుస్తోంది "వింటున్నావా?" అన్నా

"ఏమిటండి మేష్టరూ ఎప్పుడూ మీది ఒకేసొద అసలు మాకిప్పుడు సెలవు లిచ్చారుగా అంది

"ఇవను లేకుంటే వెళ్ళు" అన్నా అంతే పుస్తకాలుపారేసి రెండడుగులు త్వరగా వేసి "ధాం" అన్న శబ్దంతో ఆగిపోయింది

తొందరగా వెళ్ళబోతూ తన అత్తయ్యకు తెచ్చివుంచిన సోడాబాటిల్ తోసేసింది రాణి స్పెషల్‌గా గ్యాస్ పట్టి పంపారేమో "ధాం" అని పగిలింది ప్రక్కనే కూర్చున్న నా నుదుటిమీద ఒకముక్క గుచ్చుకొంది గదంతా ముక్కలుపడ్డాయి రాణికిమాత్రం దైవవశాత్తు తగలలేదు

నానుదుటిమీద తగిలిన వెంటనే రక్తము చిమ్మి కుడికంటి పైనుండి కారడం మొదలు పెట్టింది కంటికే తగిలిందో మరి ఎక్కడ తగిలిందో అని సందేహం వచ్చేలాగుంది చూచేవారికి రక్తంచూస్తూనే రాణిగట్టిగా కెవ్వుమంది

ఆ అరుపుతో రాణి అత్తయ్య వచ్చి తడి గుడ్డతో రక్తంతుడిచి మందు వేసింది రాణి తన అత్తయ్యవెనుక దీనంగా చూస్తూంది

తనమీద చెపుతానేమో నని భయపడిపోయింది వాళ్ళత్తయ్య అడగనే అడిగింది, "ఎలాపగిలింది?" అని

"గ్యాస్ ఎక్కువైనట్లుంది అదే పగిలింది" అని బొంకాను ఎవరెతేనేం పొరపాటుకు

"ఇంతకూ ఆ దాసీది నా చేతికి వ్యక యిక్కడుంచింది" అని దాసీదాన్ని కేకలేస్తూ వెళ్ళింది

"మేష్టరుగారూ, ఇక మీరుచెప్పినట్లు వింటానండి" అంది రాణి తరువాత భయంగా చెప్పిన లెక్కలు శ్రద్ధగాచేసేది తరువాత మేము ఆవూరినుండి బదిలీ అయిపోయాము రాణిని పూర్తిగామరిచి పోయాను ఈరోజుకు మరలజ్ఞప్తికి వచ్చింది!

"ఏమిటండి మేష్టారూ! తెలుసుకొన్నారా శిష్యురాలిని" అంది రాణి

"బాగాజ్ఞప్తి ఉంచుకున్నారే మాష్టర్ని మరి నేనేమోమరిచి మిమ్మల్ని గుర్తుపట్టలేకపోయాను"

తర్వాత యిద్దరం బయటకు వచ్చాము మీరు వూరునుండి వెళ్ళేలోపల మాయింటికి రండి మా అమ్మా నాన్నను పరిచయంచేస్తా" అని అడ్రసిచ్చి వెళ్ళిపోయింది ఒకనాటి శిష్యురాలు

"నీపెళ్ళి ప్రయత్నాలు చేస్తోంది అమ్మ" అంది కుసుమ నాతో కుసుమ మాపెద్దమ్మ కొమార్తె

"ఆవిడ కెందుకమ్మా అంత తొందర?"

"అదేమో? పిన్నిగారు అమ్మకు వ్రాశారట ఏదైనా మంచిపిల్లని చూడమని మరేమిటన్నయ్యా, ఎన్నాళ్ళింకా యిలా వుంటావు?" అంది కుసుమ

పెద్దమ్మకూడ చెప్పింది పెళ్ళి త్వరగా ఆమెచేతులమీదుగానే జరిపించాలని నేను సరే అలాగే అన్నాను అంతకన్నా ఆమెకు ఎదురుచెప్పలేక మరునాడు మధ్యాహ్నం నిద్రలేచేసరికి కుసుమ చెప్పింది పెద్దమ్మ ఎక్కడికో అమ్మాయిని చూడటానికి వెళ్ళిందని ఏం చేసుకోస్తుందో, ఎలాంటి అమ్మాయిని చూస్తుందో అన్నదిగులు పట్టుకొంది కాసేపు తిరిగి వద్దామని లేచి బయటికి నడిచాను

వెళ్ళేలోగా రాణిని చూడాలనిపించి

అద్రసుతీసుకొని వారింటికి బయలుదేరాను. క్రింద హాలులో ఎవరూ లేనట్లుంది పైన మేడ గదిలో మాట్లాడుతున్నట్లున్నారు హాలునుండి పైకిపోయే మెట్లవద్ద రాణి నిలుచుని పైవారి మాటలు వింటున్నట్లుంది "రాణీ!" అని పిలిచాను

"ఓ! మేష్టరుగారూ! కూర్చోండి" అని హాలులో కుర్చీ చూపింది ఇద్దరం కూర్చున్నాక రాణి వాళ్ళనాన్న వచ్చాడు ఇద్దరికీ పరిచయంచేసింది రాణి

"పైకి కాఫీలు తీసి కెళ్ళమ్మా" అని పంపాడు రాణిని

"మా రాణికి పెళ్ళి చెయ్యాలనుకున్నాము. ఆవిషయమే మాట్లాడుతున్నాము మీరు మా రాణికి మేష్టరటగా" అన్నాడు అవునన్నాను ఇంతలో రాణి కాఫీలతో తిరిగి వచ్చింది

"క్షమించండి మీరు రాణితో మాట్లాడుతుండండి వెంటనేవస్తా" అని రాణిని పైకి తీసికెళ్ళాడు వాళ్ళ నాన్న

కొంతసేపటికి రాణి వచ్చి కూర్చుంది "అందుకేనేమిటి అంతశ్రద్ధగా వింటున్నావు క్రిందనుండి" అన్నా

"లేదండి మరి పంతులుగారు పంతులమ్మను ఎప్పుడు చూపుతారు" అంది నవ్వుతూనే

"త్వరలోనే నీ మాదిరి చెప్పకుండానే పెళ్ళిచేసికోనులే" అన్నా

"ఇప్పుడేం నేను చేసుకోలేదుగా ఇంకా నయం మిమ్మల్ని మఱచిపోలేదుగా, మీరు మఱచినట్లు" అంది రాణి లేచి వెళ్లుతూ

పైన మాట్లాడుతున్న వారు కాఫీలు ముగించుకొని దిగి వస్తున్నట్లుంది ముందు రాణి వాళ్ళ నాన్న దిగుతూ "మీకు నచ్చితే సరి ఇంతకీ అబ్బాయిని చూడటం మంచిది'' అంటున్నాడు

"తప్పక చూడండి ఎప్పుడు వీలుంటే అప్పుడే చూడొచ్చు అదిగో మాయింటికే వచ్చాడే" అంటూ వచ్చింది మా పెద్దమ్మ నాకు అయోమయంగా వుంది


"ఇతనే మా అబ్బాయి" అంది పెద్దమ్మ "ఇక్కడికెలా వచ్చావురా?" నన్ను చూచి అడిగింది

"అమ్మాయి రమ్మంటే వచ్చాడు" అన్నాడు రాణి తండ్రి మిగతా వివరాలన్నీ చెబుతూ

కాఫీ టిఫిన్లతో వచ్చిన రాణి అలాగే నిలుచుండిపోయింది

"అలా సిగ్గుపడట మెందుకు యియ్యవే" అంది రాణి తల్లి.

తరువాత మాసంలో మా పెళ్లి అయింది.



స్తన్యామృతము

—చిత్రకారుడు: రావాడ కృష్ణ, పుల్లేటికుర్రు.

"కా స్తత్వరగారండి మేష్టారూ, సినిమాకి వెళ్ళాలి" అంది ఒకరోజు రాణి

"ఇంకా మేష్టరేమిటి? మా అమ్మ ఆ మాట వింటే మండిపడుతుంటేను" అన్నా

"ఇక మీదట అనములే మే ."

"అదిగో మళ్ళీ మాష్టారంటే సరిపోతుం దేమిటి? గురు దక్షిణ యిచ్చుకోవాలి మరి"

"ఇచ్చానుగా చిన్నప్పుడే" అంది కిలకిల నవ్వుతూ నుదుటిమీది గాయం చూపుతూ

"ఇప్పుడు యివ్వవలసింది వేరు" అని చేతుల్లోకి తీసుకొన్నాను

ఇంకా తాను 'మేష్టార'నే పిలుస్తుంది. మా మిత్రులు ఇప్పుడు కూడా వేళాకోళా లాడడానికి "మీ శిష్యురాలేమంటోం" టంటారు. ★

ఆంధ్ర వారపత్రిక

[1908

[సెప్టెంబరు నెలలో 50 సంవత్సర

ఈ జన్మదినోత్సవ శుభసమ

ఉత్తమ రచనలతో, విభిన్న శీర్షికలతో, ఆకర్షవంతమైన
వివిధ రంగాలలో ఆంధ్ర సంస్కృతి సాహిత్య వికాస
సుందరంగా ప్రకటి

రచనల పోటీ:

(1) ఉత్తమ సాంఘిక నవల: ఆంధ్రదేశంలో గత యాభై సంవత్సరాలలో మత, రాజకీయ, ప్రకృతీ సౌందర్య సుప్రసన్నతనూ, ఆంధ్రప్రజల విశిష్ట గుణగ
ఉత్తమ సాంఘిక నవలకు రు **501** లు బహుమానం ఇవ్వదలిచాము. వారపత్రిక సైజులో నవల 150 పే
వరుసగా ప్రకటించుతాము.

(2) ఉత్తమ ఏకాంక నాటిక: ఆధునిక రంగస్థలంపై ప్రదర్శనకు యోగ్యమైన ఉత్తమ ఏకాంక
మించకుండావుండాలి. [అనువాదాలు, అన

(3) ద్విపదలో ఆంధ్రమహావిష్ణువు గాథ: ఆంధ్రజాతికి మూలపురుషుడగు ఆంధ్రమహావిష్ణువ
బహుమానం. ఇది వారపత్రికలో 8 పేజీలువుండా

కవులు, కథకులు, వ్యాసకర్తలు, కళాకారులు యథాశక్తి స్వర్ణోత్సవ సంచికకు తమతమ రచనాభరణాలను
రచన లేవీ మూడు, నాలుగు పేజీలకు మించరాదని విజ్ఞప్తి.

గమనిక: రచనలు, చిత్రాలు, ఫోటోలు జులై 1 లోపుగా మాకు అందాలి. ప్రతి రచనకు, చిత్రానికీ, ఫ
అని వ్రాయాలి. వాటిని పంపే కవరుమీద కూడా ఈ మాటలు వ్రాయాలి.

ర్ణోత్సవ సంచిక!

1958]

ాలునిండి 51 ప్రారంభ మవుతుంది]

యంలో వెలువడుతుంది.

రకరకాల చిత్రాలతో ఆంధ్రదేశ స్వరూప స్వభావాలను,
ను ప్రతిబింబింపజేసేట్లు ఈ ప్రత్యేకసంచికను సర్వాంగ
చాలని సంకల్పం

బహుమతులు

సాంఘిక, సాంస్కృతిక రంగాలలో వచ్చిన వివిధ పరిణామాలనూ దృష్టిలో పెట్టుకొని ఆంధ్రదేశ
ాలనూ పరిగణిస్తూ తదనుగుణమైన ఇతివృత్తాన్ని తీసుకొని కథాసంవిధానానికి ప్రాధాన్యం ఇచ్చి రచించే
ీలకు తగ్గకూడదు; 200 పేజీలకు మించకూడదు. బహుమానం పొందిన నవలనుస్వర్ణోత్సవ సంచికనుండి

నాటికకు రు **116** లు బహుమానం. ఇది సచిత్ర వారపత్రికలో 8 పేజీలకు తగ్గకుండా 10 పేజీలకు
కరతులు పనికిరావు.]

ను ద్విపదరూపంలో(పాల్కురికి, శ్రీనాథునిబాణీలలో)వ్రాసిపంపే ఉత్తమ చారిత్రకరచనకు రు **116/-**ల
ఈ పోటీ రచనలన్నీ మా కార్యాలయానికి 1958 జూన్ నెలాఖరులోగా చేరాలి.

అందజేసి సంచిక సర్వాంగసుందరంగా వెలువడంలో సహకరించవలసిందని విజ్ఞప్తి చేస్తున్నాము. మామూలు

ు వెనుకవైపు రచయిత చిరునామాతోపాటు, ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక స్వర్ణోత్సవ ప్రత్యేకసంచికకు



"ఏడుకొండలవాడ!....వెంకటరమణా!....గోవింద!"

చిత్రకారుడు : ఆర్. యస్. శర్మ. (పెదబల్లె)

నక్షత్ర ఫలితాలు

(12-2-58 మొదలు 18-2-58 వరకు)

బి. నరసింగరావు

గ్రహస్థితి

	శ		
	12 తేదీని కుంభములో రవి ప్రవేశము. 18 న శుక్ర వక్ర త్యాగం. వృశ్చిక, ధనుర్మకర కుంభములలో చంద్రుడు.		
ర బు శు			
కు కే		గు రా	

అశ్విని [చూ, చే, చో, లా]

ఈ వారము మీకు చాలా యోగకాలము. గత రెండు వారములలోనూ మీకు కార్య రంగములో కలిగిన ఆటంకములు తీరి మీ ప్రయత్నములు ఫలిస్తాయి. ఆర్థిక స్థితి బాగు పడుతుంది. అధికారములోనున్న వారి సహాయముతో కార్యసిద్ధి పొందుతారు. దూర మందున్న ఆత్మబంధువుల క్షేమవార్త తెలియుటవల్ల ఇదివరకు మిమ్ములను బాధించు తున్న దుఃఖము పోతుంది. విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకుంటారు. వైద్యులకు మేలు కాలము. గణిత శాస్త్రజ్ఞులకు, కవులకు, కళాకారులకు యోగము. ఈ వారము ప్రయాణము, మిత్రదర్శనము, కార్యలాభము మొదలగు శుభయోగములు వున్నను, ఆందోళనగా యుంటుంది. 17, 18 తేదీలలో నిరుత్సాహముగా వుంటుంది.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈ వారము మీకు ధనలాభము ఎక్కువగావుంటుంది. సంఘ గౌరవము లభిస్తుంది. పండిత గోష్ఠివల్ల, ఉత్తమ గ్రంథ పఠనము వల్ల నూతనాంశాలు ఎన్నో తెలుసుకుంటారు. పిల్ల అభివృద్ధివల్ల ఆనందము పొందుతారు. విద్యార్థులు శ్రద్ధగా విషయాలు నేర్చుకుంటారు. ఈ వార మంతా ఆందోళనతో కూడి యున్నను, ఉపాధ్యాయులకు, పండితులకూ, కళాకారులకు, ప్రయాణము ధన లాభము, బంధుసమాగమము, కార్యసిద్ధి మొదలగు శుభ యోగములతో వుంటుంది.

కృత్తిక [ఆ, ఈ, ఊ, ఏ]

గత వారము కలిగిన మంచియోగము యీ వారముకూడా కొనసాగుతుంది. ఆటంకములు తీరుతవి. ఆదాయము వృద్ధి పొందుతుంది. సంగీత సభలు, కవితాగోష్ఠి మొదలగు వినోదములలో బంధువులతో కలసి పాల్గొని మృష్టాన్న భోజనము ఆరగిస్తారు. విద్యార్థులకు చదువు శ్రద్ధగా సాగుతుంది. నూలు, బట్టల వర్తకులకు వెండి సరకుల వ్యాపారస్తులకు లాభము. కవులకు, గాయకులకు, నటీ నటకులకు యోగకాలము. ధన లాభము, బంధుసమాగమము, కార్యసిద్ధి మొదలగు శుభ యోగము లున్ననూ కార్య సాధనలో వార మంతయు త్రిప్పట, శ్రమ అశాంతి వుంటుంది.

రోహిణి [ఓ, వా, వీ, వూ]

గత వారము అసంపూర్తిగానిలిచిపోయిన పనులు ఈ వారము లాభకరముగాముగుస్తాయి. ధనాదాయము ఎక్కువగా వృద్ధి అవుతుంది. మీకు వాహనయోగము, గృహమందుండు వారికి అలంకార ప్రాప్తి. విద్యార్థులు వినోదముతో కాలము గడిపిననూ చదువు మీద మట్టుకు శ్రద్ధవుంచుతారు. ఖరీదైన వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు లాభం. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీ నటులకూ యోగకాలము. వారమంతయూ త్రిప్పట, శ్రమ, అశాంతియున్ననూ, కార్యసిద్ధి, ఆప్తులతో విందు, వినోదము, శుభవార్త మొదలగు మంచియోగములు కలవు.

* మృగశిర [వే, వో, కా, కీ] *

ఏ వ్యవహారముతోనైనా ఎంత కష్టపడిననూ కార్యములు నెరవేరవు. త్రిప్పటవల్లను అకాల భోజనమువల్లను అనారోగ్యచిహ్నలు కనబడినవెంటనే శ్రద్ధవహించడము మంచిది. ఉద్యోగస్తులకూ బాధ్యతలు ఎక్కువవుతాయి. ఆదాయము అభివృద్ధి అవుతుంది. విద్యార్థులకు చదువు సాగదు. రాజకీయ వాదులకూ కార్యలాభము. వారమంతయూ త్రిప్పట, కార్యభంగము, అధికఖర్చులు మనోవ్యథ కలుగుతాయి. 17, 18 తేదీలలో అనారోగ్యము.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

ఈ వారము మీకు అంత యోగదాయకముగా వుండదు. యత్న కార్యములకు ఆటంకాలు కలుగుతాయి. ఉద్యోగస్తులు ఆర్థికచిక్కులను ఎదుర్కోవలసి వుంటుంది. కాని నిజమైన మిత్రుల సహాయమువల్ల కార్యసిద్ధి పొందుతారు. విద్యార్థులకు చదువుపై వుత్సాహము తక్కువ. వ్యాపారస్తులకు మొదట్లో మాంద్యముగా యున్ననూ వారాంతమునకు కొంత లాభిస్తుంది. ఈ వారములో ప్రయాణము మిత్రదర్శనము, కార్యలాభము వున్ననూ శ్రమ, కార్యభంగము, అస్తిమితము కలుగుతాయి. 17, 18 తేదీలలో ఆరోగ్యచింత.

* పునర్వసు [కే, కో, హా, హి] *

ఈ వారము మీకు మిశ్రమయోగము. తలపెటిన కార్యములకు ఆటంకాలు కలుగుతాయి. మీ చాతుర్యమునంతనూ వుపయోగించి కార్యసాధనకు ప్రయత్నిస్తారు. ఈశ్వరానుగ్రహము కలిగిన అన్నీ సాధ్యపడతాయనే నమ్మకముతో వ్యవహరించి తుదకు జయము పొందుతారు. ఉద్యోగస్తులకూ కొత్త బాధ్యతలు. వ్యాపారస్తులకు ఆందోళన. విద్యార్థులకు చదువుమీద శ్రద్ధ లేకపోయినా కొత్తవిషయాలు నేర్చుకుంటారు. వార మంతయూ నిలకడలేని స్థితి యున్నా ప్రయాణము, ఆత్మవికాసము, కార్యలాభము మొదలగు యోగములు కలుగుతాయి. 17, 18 తేదీలలో ఇంటియందుండు వారి ఆరోగ్యము సరిగా వుండనందున చింత.

పుష్యమి [హూ, హే, హో, డా]

గత వారములోవలెనే ఈ వారము కూడా ఆదాయాభివృద్ధికి భరించలేని కార్యభారము పైన వేసుకుంటారు. ఆటంకాలు కలుగుతాయి. మీ పనులేకాకుండా పరోపకారమునకు తలపెటి వివాదములలో చిక్కుపడతారు. కోర్టు వ్యవహారములలో కొంత మేలు కలిగిననూ ఖర్చులు ఎక్కువగుటచేతను ఆ సంతోషము తక్కువ. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడి. వ్యాపారస్తులకు లాభము తక్కువ. కొంత అనుకూలతయున్ననూ వారమంతయు కార్యభారము, శ్రమ, వివాదము, మనోవ్యథా వుంటాయి. 17, 18 తేదీలలో ఇంట్లో యున్న స్త్రీలలో ఒకరికి ఆరోగ్య భంగము వల్ల చింత కలుగుతుంది.

ఆశ్రేష [డి, డూ, డే, డో]

ఈ వారము మీరు చాలాపనులు చేయవలసియున్నా, ఏది చేసేందుకూ పాలుపోదు

★ నక్షత్రఫలితాలు ★

ప్రతి ప్రయత్నమునకు ఆటంకము కలగడమువల డబ్బు దండుగ కూడా అవుతుంది. అయినా సాహసము కలవారగుటచేతను పట్టు విడువకుండా పనిచేసి చివరకు కార్యసిద్ధి పొందుతారు. అవసరములకొరకు అప్పు చెయ్యవలసి వస్తుంది. అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదమువుంది. జాగ్రత్త పడండి. ఇంజనీరింగు శాఖ ఉద్యోగులకూ, యంత్రములు నడిపే నిపుణులకూ మేలు కాలము. వారమంతా త్రిప్పట, శ్రమ అశాంతి, వుంటాయి. 17 18 తేదీలలో ఆరోగ్యచింత, ప్రమాద సూచన.

మఖ [మా, మీ, మూ, మే]

ఈ వారము మీ ప్రజ్ఞను పలుకుబడి ఉపయోగించి కార్యానుకూలత పొంద

ధరలు:

నూలు, వస్త్రములు :మార్పు లేదు.

నూనెదినుసులు : మందముగా యుండును.

బెల్లము, పంచదార: స్వల్ప తేడాలో యుండును.

చింతపండు: మందముగా యుండును.

ఆహారధాన్యములు : తగుదలలో యుండును.

పప్పు దినుసులు : మందముగా యుండును.

వెండి : మార్పు లేదు.

బంగారము: స్వల్పముగా పెరగవచ్చును.

* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము నెరుగనివారు నామనక్షత్రము (వారి వారి పేర్ల ననుసరించి పేరు మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, హృషీకేశుడను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకొనునది.

తారు. ధనలోపము తీరుతుంది. తలపెట్టిన పనులు నెరవేరుతాయి: దూరముందున్న ఆప్తుల కుశలము తెలియుటవల్ల మనశ్శాంతి కలుగుతుంది. ఉద్యోగస్తులకు తొందరలు తీరుతాయి. వైద్యులకు లాభము, కవులు కొత్తరచనలు మొదలు పెడతారు. శిల్పులకు, చిత్రకారులకు నటీనటులకూ మంచికాలము. ఈవారము శుభయోగము ఉన్నప్పటికి శ్రమ ఆందోళనలతో కూడి వుంటుంది.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *

[మో, టా, టీ, టూ]

ఈ వారము మీకు యోగకాలము. ధనలాభముకలుగుతుంది. పిల్లలయోగక్షేమములను అభివృద్ధిపరచే కొన్ని ఏర్పాట్లను చేస్తారు. విజ్ఞాన చర్చలలో పాల్గొంటారు. కోరు వ్యవహారములలో మీకు లాభకరముగా రాజీపడతారు. విద్యార్థులకు ఉత్సాహముగా చదువు సాగుతుంది. ఉద్యోగస్తులకు అనుకూలముగా యుంటుంది. ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయవాదులకు మేలు కాలము. ఈ వారమంతయు ధనయోగము, పండితగోష్ఠి కార్యసిద్ధి మొదలగు శుభయోగములున్నా శ్రమతోనూ ఆందోళనతోనూ కూడియుంటాయి.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పీ]

ఈ వారము మీ ఆర్థికస్థితి బాగుంటుంది. ప్రయత్నించిన పనులు నెరవేరుతాయి. కవులు గాయకులు మొదలగు కళాకారులతో వినోదముగ గడుపుతారు. వెండి సరుకుల వర్తకులకు ప్రయాణమువల్ల లాభము. శుభవార్తలను వింటారు. బంధువులకూడా మృష్టాన్న భోజనముతో విందు ఆరగిస్తారు. కవులకూ, గాయకులకు, నటీనటులకు యోగకాలము. విద్యార్థులు క్రొత్త విషయాలు నేర్చుకుంటారు. ఈ వారములో శుభయోగములు ఉన్ననూ వారమంతయును అస్థిమితముగా యుంటుంది. ఉత్సాహము తక్కువ.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

గత రెండు వారాలలోనూ కలిగిన శుభయోగములు ఈ వారముకూడా మీకు కలుగుతవి. మొదట పెట్టుబడి పెటె దాని మీద లాభము సంపాదించే పనులకు పూనుకుంటారు. పరోపకారముకొరకు కొన్ని బాధ్యతలు పైని వేసుకుంటారు. మీ అధికారము హోదా ఎక్కువయే సూచనలు వున్నవి. వాహనయోగము మీకు, అలంకారప్రాప్తి మీ భార్యకు కలుగుతవి. ఖరీదైన వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులు లాభము పొందుతారు. కోర్టు వ్యవహారములు మీకు అనుకూలముగా పరిణమించుతాయి. విద్యార్థులకు వినోదములమీద ఎక్కువ మోజువున్నను చదువుమట్టుకు శ్రద్ధగా సాగుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము. శుభయోగములు ఎక్కువగా యున్ననూ వారమంతయూ అస్థిరముగా వుంటుంది.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము మీరు చేయదలచుకున్న పెద్ద ప్రయత్నాలు యేమీ ఫలించవు. ఖర్చులకు అవసరమైన సొమ్ము చేతికి సమయానికి అందనందున అనేక ఇబ్బందులకు గురిఅవుతారు. కార్యభారముచేతను వేళతప్పిన భోజనమువల కళ్ళుమంట, తలనొప్పి మొదలగు అనారోగ్య సూచనలు కలుగుతాయి. జాగ్రత్త వహించండి ఉద్యోగస్తులకు శ్రమతో కూడిన కార్యలాభము. వర్తకులకు ఆందోళన. విద్యార్థులకు చదువు సాగదు. రాజకీయవాదులకు మేలుకాలము 16 వ తేదీని ధనలాభము. వారమంతయూ అస్థిమితముగా వుంటుంది.

* స్వాతి [రూ, రే, రో, తా] *

మీరు ఈ వారము తలపెట్టిన పనులు నెరవేరినప్పటికి, ఫలసిద్ధి కలిగేవరకూ, ఆటంకాలు వస్తూయుండడమువల్ల ఆందోళనగానే వుంటుంది. మీరు ధనవంతులైయుండి కూడా సమయమునకు మీ డబ్బు మీకు ఉపయోగములోకి రాక ఇబ్బందిపడి, అప్పు చేయవలసి వస్తుంది. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వ్యాపారస్తులకు మాంద్యము. విద్యార్థులకు చదువు చురుకుగా సాగదు. ఇంట్లోవున్న వృద్ధులకు అనారోగ్యము. వారమంతయూ ఇబ్బందులతోనూ, ఆందోళనతోనూ కూడివుంటుంది. 16 వ తేదీని కార్య సిద్ధి.

విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారము యత్న కార్యములు ఫలించవు. ఖర్చులు ఎక్కువ. సంసారముపట్ల అనాదరణ కలదనే భ్రాంతిచేత గృహకలతలు. మతగురువుల బోధనలను మననము చేసుకొని దివ్యజ్ఞానము పొందుతారు. వారాంతమునకు మేలు కలుగుతుంది. విద్యార్థులు క్రొత్త విషయాలు నేర్చుకుంటారు. వర్తకులకు లాభము తక్కువ. ఇంటియందుండువారి ఆరోగ్యము సరిగా లేనందున కించ. వారమంతయు అశాంతిగానే యుంటుంది. 16 తేదీన కార్యలాభము.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము తలపెట్టిన పనులకు ఆటంకములు వస్తాయి. ధనలోపము తీర్చుకుందికి చాలా కష్టపడతారు. బంధువుల రాకవల్ల ఖర్చులు ఎక్కువ. కోర్టు వ్యవహారములు మీకు అనుకూలముగా తీర్పు అవుతాయి. భార్య ఆరోగ్యము చెడుటచేతను ఆందోళన. ఇతరులకు సహాయము చేయబోయి వివాదములకు లోనౌతారు. విద్యార్థులకు శ్రద్ధ తక్కువ. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వ్యాపారస్తులకు ఆశాభంగము. 16 వ తేదిని కార్యానుకూలత ధనలాభం. వారమంతా వ్యాకులముగా వుంటుంది.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము రాబడి తక్కువ. డబ్బుకు ఇబ్బంది ఎక్కువ. ఖర్చులు తగ్గవు అయినా సాహసము కలవారగుటవల్ల పట్టువిడవకుండా ధైర్యముతో పనిచేసి చివరకు

★ నక్షత్రఫలితాలు ★

కార్యసాధన పొందుతారు. ప్రమాదముల వల్లగాయములు కలిగే సూచనలున్నవి. జాగ్రత్తవల్ల తప్పవచ్చును ఉద్యోగస్తులకు వ్యాపారస్తులకు అభివృద్ధి కలిగే సూచనలు కనబడుతవి. గనుల యజమానులకు లాభము. ఇంజనీరింగు, పోలీసు శాఖలలో వారికి యోగము. 16 వ తేదిని కార్యసాధన. వారమంతయు కష్టములతోనూ చికాకులతోనూ కూడి వుంటుంది.

మూల [యే, యో, బా, బీ]

గత రెండువారములు కన్నా ఈ వారము అనుకూలముగా యుంటుంది. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను మీ బుద్ధిబలము నుపయోగించి ఒకదారికి తీసుకువస్తారు ఆశించిన డబ్బు చేతికివస్తుంది. ఇదివరకు సహాయపడని అధికారులు ఇప్పుడు మీకు తగిన సహాయము చేస్తారు. ఇదివరకు మిమ్మలను కలవర పెడుతూవున్న ఆత్మీయుల కుశల వార్తవల్ల సంతోషపడతారు. విద్యార్థులు క్రమముగా చదువుకుంటారు. కవులకు, గాయకులకు కళాకారులకు యోగం. వారమంతయు మంచి యోగములున్నను అశాంతిగాయుంటుంది.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢ]

ఈవారము మీ ఉద్దేశము ప్రకారము కార్య నిర్ణయము జరిగి ఫలసిద్ధి పొందుతారు. లాభకరమైన ప్రయాణములవల్ల వర్తకులు మేలు పొందుతారు. పిల్లల శుభకార్యముల గురించి ఆలోచనలు జరుగుతాయి. విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకుంటారు. ఉపాధ్యాయులకు, న్యాయవాదులకు, పండితులకు అనుకూలము. వారమంతా శుభ యోగములు వున్నను, అసంతుష్టిగాను, చికాకుగాను వుంటుంది.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈవారము తలపెట్టిన పనులు నెరవేరుతవి. ఆర్థిక స్థితి ప్రోత్సాహకరముగా వుంటుంది. ఆగ్నేయ దిక్కునుండి శుభవార్త వింటారు. కవులతోనూ గాయకులు మొదలగు కళాకారులతో వినోదిస్తారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి ఎక్కువ. వెండినగల నమ్మ వర్తకులకు ప్రయాణమువల్ల లాభము. బట్టల వ్యాపారస్తులకు మంచి కాలము. కవులనూ, గాయకులకు, నటీనటులకు యోగకాలము. వారమంతయు అశాంతిగా వుంటుంది. 16 వ వినోదము, మృష్టాన్న భోజనము.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈ వారము ఇతరులకొరకు పూనుకున్న కార్యములు సఫలమవుతాయి. మీ పలుకుబడివల్ల మీరుసాధించలేని కార్యమువుండదు. సంఘములో గౌరవము ఎక్కువవుతుంది. తగినంతగా ధనలాభము కలుగుతుంది. శుభకార్యములను గురించి ప్రయత్నములు, బంధువులతో విందు, వినోదములు. ఇంటి యందుండు వారికి అలంకార ప్రాప్తి. విద్యార్థులకు వినోదములపై ఆసక్తి వున్నా చదువు జరుగుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు, యోగకాలము. బంగారము వ్యాపారస్తులకు లాభం. శుభ యోగములున్ననూ వారమంతయు అశాంతిగా యుంటుంది.

*** ధనిష్ఠ [గా, గీ, గూ, గే] ***

ఏ రంగములోనూ ఎంత కష్టపడిననూ కార్యములు నెరవేరక ఆటంకములు కలుగుతాయి. త్రిప్పటవల్ల అకాల భోజనము వల్ల మానసిక, శరీరస్థితులు చికాకూ వుంటాయి. అనారోగ్య సూచనలు కనబడగానే రవికి శాంతి చేయించండి. ఉద్యోగస్తులకు శ్రమ. వర్తకులకు ఆందోళన. రాజకీయవాదులకు కార్యానుకూలముగా వుంటుంది. వారమంతయు హెచ్చరిక లేకుండావుంటుంది

*** శతభిషం [గో, సా, సీ, సూ] ***

ఈ వారము ఏ పనిచేసేందుకు సమాధానం కుదరక, ఆలోచనలతో మొదట్లో కాలము గడిపి తుదకు ఒక నిర్ణయానికి వచ్చి అన్య దేశస్తులైన మిత్రుల సహాయమువల్ల కార్య లాభము పొందుతారు. విచిత్ర వస్తువలను సంపాదిస్తారు. ఉద్యోగస్తులు శ్రమపడుతూ కూడా మాటపడతారు. వర్తకులకు ప్రయాణమువల్ల శ్రమకలిగిననూ లాభమువుంటుంది. వారమంతయు నిరుత్సాహముగా గడుస్తుంది.

*** పూర్వాభాద్ర [సే, సో, దా, దీ] ***

ఈ వారము మీకు యోగదాయకము కాకపోయిననూ ముందుర మంచి రోజులు రాబోతున్నాయి. ఎవరి సహాయమువల్ల కార్యాచరణ చేయదలచుకున్నారో వారే ఆటంకములుకలిగించి నిరుత్సాహపరుస్తారు. దైవాన్ని నమ్ముకొన్న వారగుటవల్ల నిశ్చింతగా వ్యవహరిస్తారు. వర్తకులకు లాభము లేని ప్రయాణము. ఉద్యోగస్తులకు తొట్రుపాటు. ఇంట్లో కొందరికి అనారోగ్యమువల్ల ఆందోళన. ఈ వారమంతయూ పైవిధముగానే గడుస్తుంది.

***ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా] ***

ఈవారము బంధువులు రావడమువల్ల అనుకోని ఖర్చులు మీద పడుటవల్ల, డబ్బుకు ఒత్తిడి ఎక్కువగాయుంటుంది. ఇతరుల పనులు తలపెట్టి అవి అసంతృప్తిగా వుండడమువల్ల వివాదములు కూడా వస్తాయి. కోర్టు వ్యవహారములలో లాభించిననూ ఖర్చులు ఎక్కువగుటచే ఆ సంతోషము తక్కువ. వర్తకులకు ప్రయాణమువల్ల శ్రమకలిగిననూ లాభము స్వల్పముగావుంటుంది. వారమంతయూ మనస్సు నిరుత్సాహముగా వెళుతుంది.

*** రేవతి [దే, దో, చా, చీ] ***

ఈవారము మీ ఆర్థిక స్థితి సరిగా యుండదు. మీకు రావలసినది రాకపోగా మీరు ఇవ్వవలసిన వాటికి ఒత్తిడి ఎక్కువవుతుంది. అందుకొరకు అప్పు చేయవలసి వస్తుంది. ఎదురైన ఆటంకములను ధైర్యముతో కార్యసాధనకు ప్రయత్నించి ఫలము పొందుతారు. అవయవములకు దెబ్బలు తగులవచ్చును. జాగ్రత్తవల్ల తప్పవచ్చును. ఇనపసామానులు, రంగులు, వర్తకులకు యోగము. రసాయనిక శాస్త్రజ్ఞులకు మేలుకాలము. వారమంతయూ కష్టనిష్ఠురములతో కూడియుంటుంది. ★

వనితా లోకం

ఆధునిక ఇల్లాళ్లు; అనాచారాలు!

అత్తగారూ-ఆచారాలూ అనే వ్యాసం చూడగానే నాకు కొందరు ఆధునిక ఇల్లాళ్ళ అనాచారాల గురించి వ్రాయాలనిపించింది. ఆచారం పేరిట అనారోగ్యాన్ని కొనితెచ్చుకొనేవాళ్ళు ఉన్నట్లే "మడీ ఆచారంవంటి మూఢనమ్మకాలు మాకులే" అనిపించుకోవడం ఒక గొప్పకింద పరిగణిస్తూ ఆ 'లేకపోవడాన్ని' పనికట్టుకొని ప్రాక్టీసు చేసే ఆధునిక ఇల్లాళ్ళు కూడా ఉన్నారు. అయితే వీరు మడీ ఆచారంలో మూర్ఖంగా తర్కానికి అందని అలవాట్లను విస్మరిస్తే బాగానే ఉండును. కాని వచ్చిన చిక్కు ఎక్కడంటే ఇటువంటివారు ఆ'ఆచారం మడీ'లో ఉన్న కాస్త 'మంచి'నీ పూర్తిగా మరచిపోయి అశుభ్రంగా ఉండడమే, పాతనమ్మకాన్ని రూపుమాపి నవీన పద్ధతిని అమలుజరపడమనుకొంటున్నారు.

అసలు ఆచారం అనేది మొట్టమొదట శుభ్రత కోసమే వచ్చింది. ఐతే కాలక్రమేణ ఈ పద్ధతిలో దాని ప్రధానోద్దేశమైన శుభ్రత లోపించి ఇది కేవలం ఒక మూఢనమ్మకంగా నిలచిపోయింది. ఉదాహరణకు మడికట్టుకొని వంట చెయ్యడమే తీసికోండి. కుటుంబంలో వ్యక్తులందరి ఆరోగ్యాలూ సక్రమంగా ఉంచే భోజనాన్ని తయారుచేసే గృహిణి శుభ్రంగా స్నానంచేసి శుచిగా వండిపెట్టడమనేది అభినందించదగిన పద్ధతి. కాని క్రమంగా ఈమడి అనేది వెర్రితలలు వేసింది. మనలో కొందరు గృహిణులు ముఖ్యంగా పూర్వసువాసినులు మడికోసం ప్రత్యేకంగా ఒక పట్టుపంచ లేక పొత్తుపంచని కేటాయించి పెట్టుకొంటారు. దాన్ని నెలకొకసారైనా చాకలికి వెయ్యడం మాట్లటుంచి నీళ్ళలో పిండి ఆరవేసే పాపానికి కూడా పోరు. వంటచేసే ఖంగారులో ఆ బట్టకు నూనె మరకలూ, బొగ్గుమసీ, బూడిద వగైరాలు అంటుకొని శాశ్వతంగా ప్రింటు ఏర్పడిపోతుంది. దీనికితోడు చల్లచిలికితే ఆమజ్జిగ చిలుకులు కూడా పడి అబట కంపు కొడుతూ అసహ్యంగా ఉంటుంది. గదుల్ని ఆవుల నీకడిగే మురికి గుంటలో మునిగి తాము వచ్చే దారిలో కూడా నీళ్ళు చిలకరించుకొంటూ తడిబట్టతో వచ్చి కుదకటువంటి పొత్తుపంచని కట్టుకోవడంలోని అంతరార్థం ఏమిటో వాళ్ళకే బోధపడాలి! ఆచారం శ్రుతిమించినప్పుడు ఇటువంటి ఒకటిరెండు చోట్లలో అశుభ్రత కనబడుతూఉంటే కొందరు మోడరన్ ఇల్లాళ్ళ 'ఆచారం లేకపోవడం'లో లేక, అనాచారంలో అంతా అశుభ్రతే ఉంటోంది.

చుట్టాలింట్లో...

ఆమధ్య నాకో అనుభవం జరిగింది. మా చుట్టాల్లో ఒకావిడ మమ్మల్ని భోజనానికి పిలిచింది. దర్జాగా భోజనం వేళకి వెళ్లడమేమిటి, పిల్లలతల్లికదా కాస్త సహాయం చెయ్యవచ్చునని కొంచెంముందుగా వెళ్ళేము. ఆవిడ మధ్యవయస్కురాలనవచ్చును. నేను వెళ్ళేసరికి పప్పూఅన్నమూ పొయ్యి ఎక్కించేసి అప్పుడే పాకీదొడ్లోనుండి వస్తోంది. తర్వాత నీళ్లు పోసుకోవడమో ఆబట్ట విడిచి మరొకటి కట్టుకోవడమో చేస్తుందనుకొన్నాను (పెద్దావిడ కనుక). ఊహుఁ నేను వచ్చేనన్న సంబరంలో కుదకు కాళ్ళూ చేతులూ కడుక్కోవడం కూడా మరచిపోయినది! పైగా సగం సగం వంటచేస్తూ పిల్లలకి ఒళ్లునలిచి తలరుద్ది వసం. నిజమే ఒక్కమనిషి ఉన్నప్పుడు అవీ ఇవీ చక్కబెట్టుకోక తప్పదు. కాని నలుచుకొన్నప్పుడు అన్నం మెతుకుల్లాగ వస్తాయే అవి ఆవిడ చీరకుచ్చెళ్లు పైకిఎత్తి దోపుకోవడం వల్ల దాని నిండాపడి అలాగే ఉండిపోయాయి. వీటితో ఆమె వంగి కూరా అవీ కలియబెడుతూవుంటే అవెక్కడపడతాయోనా అని నా భయం. 'పోనీ నేను చూస్తానండీ' అంటే ఇంకానయం చిన్నపిల్లవి నీచేత కూడా చేయించుకొని తినాలా అమ్మా అంటూ నన్ను ముట్టుకోనిస్తేనా! నేనేదో ఏలకులు వలిచి కూర తరిగిపెట్టడం వంటివి చేశాననుకోండి, అంతలో పిల్లవాడు ఏడుస్తూ వస్తే ఆవిడ తనకొంగుతో వాడిముక్కు తుడిచి, ఆ చెయ్యేనా కడుక్కోకుండా, నేను తరిగిపెట్టిన కూరముక్కలు పోపులో వేసింది. పాకం పట్టేటప్పుడు గిన్నె తడిగా ఉందని ఆ కొంగుతోనే లోపల తుడిచి పొయ్యిమీద పెట్టింది. ఇదంతా నేను కల్పించి చెప్తున్నాననుకొంటున్నారేమో! కళ్ళారా చూసిన విషయమే చెప్తున్నాను. ఇక పొయ్యి పొగకి ఆవిడ కళ్ళ వెంటనూ, ముక్కు వెంటనూ నీళ్ళు కారుతూ వుంటే తుడుచుకునేందుకు కూడా ఆవిడ ఈ కొంగునే ఉపయోగించింది.

ఎంగిలి చేతులతోనే...

ఇక ఆవిడ పిల్లలు కూడా అలాగే వున్నారు. బొబ్బట్లకు పూర్ణం తయారుచేసి పళ్లెంలో ఆరబెట్టినది మొదలు ఆ పళ్లెం చుట్టూవాళ్లే. నయాన భయాన చెప్పిచూసినా కదిలేగా. ఆ పళ్లెంలో వేళ్లుపెట్టి కొద్దిగా తీసి నాకడం, మళ్ళీ అందులో పెట్టడం... అబ్బ!! పాపం ఆవిడ ఈబాధపడలేక 'ఇందా' అని ఇంతంత ముద్దలు వాళ్లచేతుల్లో పడేసినా ఒక్కక్షణం బయటికిపోయి అదితినేసి మళ్ళీ తయారవడం. అలాగ ఆ పిండివంట అయ్యేవరకూ తింటూనే వున్నారు వాళ్లు. ఇంక అన్నం ఏం తింటారూ! వంట అంతా అయిపోయాక వడ్డించే ముందయినా ఆవిడ నీళ్లు పోసుకోవడమో, ఆఖరికి ఆబట్ట విడవడమో చేస్తుందనుకున్నాను. ఊహుఁ... భోజనాలూ అవీ అయ్యాక ఇళ్ళు అలికడుక్కొని

“సుగాత్రి”

ఆ తర్వాత ఆ బట్టకి మోక్షం ఇచ్చింది. పాపం ఆవిడ చేసిన పదార్థాలన్నీ రుచిగానే ఉన్నా, నాకు నోట్లో పెట్టుకొనేసరికి పిల్లలు పూర్తంలో వేలుపెట్టి నాకడమూ, ఆవిడ చీమిడి తుడిచిన కొంగుతోనే పాత్ర తుడిచి పొయ్యిమీద పెట్టడమూ కళ్ళకు కట్టినట్లుండి వాంతొచ్చినట్లయింది. మళ్ళీ ఆమె అన్నంగిన్నె తాకినప్పుడల్లా చెయ్యి కడుక్కొంటుంది. అంటుకదూ మరి!! పండగ రేపు అనగా ఆమె మర్నాడు మైలుండదని ఆ సాయంత్రం తలంటి పోసుకొంటుందట. ఏం లాభం!

అప్పుడనిపించింది నాకు—మడీ ఆచారం ఒకందుకు మంచికేనని. పిల్లలు ఆ చేతుల లోనూ, ఈ చేతులతోనూ వంటకాలను తాకరు. ఇల్లాళ్ళు కూడా పెంటకుప్పల్లోకి వెళ్ళివచ్చి అలాగే వంటింటిలోకి వచ్చేసి వంటచేసి పెట్టేయరు. దేవుడికి నైవేద్యమూ అవీ అంటే చేస్తూచేస్తూ వున్న వంటకాలను పిల్లలు యిష్టం వచ్చినట్లు స్వాహా చేసేస్తూ ఉండరు. ఇందువల్ల ఇల్లాళ్ళకు పని తెమలక పోవడమూ, పిల్లలకు అజీర్తిరోగాలు కూడా ఉండవనుకొంటాను.


అసలు వంట చేస్తూఉంటే ఆవంట తిన దలుచుకొన్నవాళ్ళు చూడకూడదనుకొంటాను. ఆమధ్య మాఅక్క తన ఫ్రెండు ఇంటికి తీసికెళ్ళిందిలెండి! ఆవిడ మాతో మాట్లాడుతూ యాపిల్ పండ్లతొక్కలు తీసి, చేతిలోనే పండును ఉంచుకొని చాకుతో ముక్కలుకోస్తూ ఆ చాకుతోనే నోట్లో పెట్టుకొని తింటోంది. సరే తింటోందికదా బాగానే ఉందనుకొన్నాను. కాని చటుక్కున ఆ ముక్కలు లోపలికి తీసికెళ్ళి ప్లేట్లలో పెట్టి తీసికొచ్చి మాముందు పెట్టింది తినమని. చచ్చేను నేను. తినకపోతే బాగుండదు. చూడకపోతే ఫరవాలేదు కాని కళ్ళారా చూసేక ఎలాగ?... ఈవిడకి ఇంకో దురలవాటుకూడా ఉంది. కూరా పచ్చడీ అవీ చేస్తూచేస్తూ అక్కడే నోరు తెరచి ఎత్తి నోట్లో వేసికొని రుచిచూడడం. కర్మంచాలక ఆవిడ ఎత్తివేసికొనే సొంపులో అది ఆమె నోట్లోపడి మళ్ళీ ఆ గిన్నెలోనో రోట్లోనో పడితే...ఏంకొస్త అవతలగా నోరుపెట్టి రుచి చూడరాదూ. ఆమె మా అక్క ఫ్రెండు అయిపోయింది కాని నా ఫ్రెండే కనుక అయితే ఏమిటీ అసహ్యపు అలవాట్లని తిట్టి మానిపించిఉందును. మళ్ళీ ఆమె డాక్టరు గారి భార్య. చదువుకొన్న మనిషి!

చదువుకొన్నా, చదువుకోకపోయినా తిండివస్తువులు తయారుచేసేటప్పుడు – అదీ తమకుటుంబంలో తమతమ ఎంగిళ్ళూ అవీ కలిసినా ఫరవాలేదేమోకానీ – ముఖ్యంగా అతిథులకు పెట్టేటప్పుడు అందులో వాళ్లు చూస్తున్నప్పుడు కొస్త శుభ్రంగా చెయ్యాలంటాను నేను...మడీ ఆచారం మనకివద్దు. కాని గృహిణి అన్నాక శుచిగానూ శుభ్రంగానూ వంటకాలను తయారుచేసి పెట్టకపోతే ఎందుకా గృహిణీత్వం?

సరిగా చూడకపోతే,—

మాకు తెలిసిన మరొకఆవిడ ఏదో కొత్త రకం 'పూరీ-కూరా' అంటూ చేసిపంపింది.

(48-వ పేజీ చూడండి)



సోఫాలకు, రేడియోలకు కవరుమీది డిజైను

శ్రీమతి కృష్ణ, చల్లపల్లి.

క్షణంలో మామిడిమొక్క! దానికి కాయలు!!

నేను మామిడిటెంకనుండి వెంటనే మొక్కను మొలిపించి, అది కాయను కాచునట్లు చేయువిధమును తెల్పుచున్నాను. వేసవికాలములో బాగుగ ముగ్గినమామిడిపండ్ల (నోటితో తాకకుండా రసముపిండి) టెంకలనుపీచుతోసహా తీసి బాగుగా యెండబెట్టవలెను. కొన్ని రోజులు బాగుగా ఎండినపిమ్మట కొత్తకుండ నొకదానిని తీసుకొనివచ్చి దానిలో టెంకలువేసి సున్నపుతేటను పోయవలెను. ఆ కుండకు వాసిన (గుడ్డతో గట్టిగా బిగించి) కట్టి దానిపైనొక కర్రచెక్కను వేసి మూత బెట్టవలెను. దానిని భూమిలో పాతిపెట్టి ఆరు నెలలకు తీయవలెను. టెంకలు భూమిలోని ఖనిజ లవణమువగైరాల సారమును బాగుగా పీల్చుకొనును. అప్పుడు బయటకుతీసి కొద్దిగ మటివేసి నీళ్ళుచల్లిన మొక్క మొలచును; మరికొన్ని నీళ్ళు చల్లిన కాయకాయును. ఈవిధముగ నెన్నికాయలైననూ కాపింపవచ్చును. పైవిధముగ చేయవలెనను ఉత్సాహము కలవారు చేసెదరని ఆశించుచున్నాను.

—కామర్సు శ్రీరామారావు.]

ఆడవాళ్లు; ఆత్మహత్యలు

స్త్రీ సహనశీల! దివ్యమూర్తి!

★

మేరీ వ్యాసానికి మరో సోదరి జవాబు

★ ఎంతటి కఠిన హృదయాన్నైనా మార్చగలదు

తంగిరాల శాంత

సచిత్రవారపత్రిక జనవరి 29వ తేదీ సంచికలో సి. హెచ్. మేరీగారు 'కుళ్ళున్నచోటే ఈగలు' అనే శీర్షికక్రింద "నేటి స్త్రీల ఆత్మహత్యలకు మూలకారణం ఏమిటా అని తరచిచూడా"లని ప్రయత్నించి "వాల్మీకి వ్యాసాదికవులచేతిఘంటాల"నుంచి "శారదాచట్టం"దాకా ప్రసక్తులు తెచ్చారు. "ఆటంబాంబులతో (పొరపాటు హైడ్రోజన్‌బాంబులు!) ఆనందించే దేశాల పగిది ఆనందించమని" స్త్రీకొక ఆయుధం సృష్టించి యిచ్చారట! అదే "పాతివ్రత్య"మట! ఈ ధోరణిలో ఆమె అనసూయ, దమయంతి, సుమతి, రుక్మిణి, సావిత్రి, సీత, ద్రౌపది, గాంధారి అందరినీ ఒకసారి గుర్తుకు తెచ్చారు. "పాతివ్రత్యాన్ని" అనేక భంగిమలలో వీరంతా "ప్రేల్చి చూపించారట"! కొంతదూరం వెళ్ళేసరికి అయోమయంలో పడిపోయాను నేను. దేన్ని గురించి చదువుతున్నానా అని చూశాను. ఎందుకంటే ఈ రకం ధోరణిలో భారత నారీమణుల ఆదర్శాన్ని తూలనాడే ఉపన్యాసం నేను చదువుకునే రోజులలో క్రైస్తవ మత ప్రచారకులదగ్గర విన్నాను. అలాంటిబాపతేమో అని చూశాను. కాని వ్యాసం శీర్షిక చూచిన తరువాత "ఆడవాళ్లు: ఆత్మహత్యలు" అనేది చర్చనీయాంశమని మరోసారి గుర్తుకు తెచ్చుకున్నాను.) "ఓహో" అనుకొని వ్యాసాన్ని పూర్తిచేశాను.) చివరకు మిగిలిన జవాబిది: "కుళ్లున్నచోటే ఈగలు" ఉంటాయనే విధాయకం ఏమీలేదు. బెల్లమున్నచోట కూడా ఈగలు ముసురుతాయ్! ఈగలు ముసిరినంత మాత్రాన బెల్లం కుళ్ళిపోదు!

ఆ సోదరి వ్రాసిన వ్యాసంలో కొన్ని చక్కని పాయింట్లున్నాయి. కాని వాటిని చుట్టి చాలా 'కుళ్ళు' ఉన్నందువల్ల ముందు దాన్ని తొలగించి, తరువాత వాటినిగురించి ప్రస్తావిస్తాను.

"ఆటంబాంబులతో ఆనందించే దేశాలకు" ఆ బాంబుల మహిమ ప్రత్యక్షంగా చూచి తెలుసుకొనే భాగ్యంవచ్చింది. ఆ బాంబులు ఇంకా ప్రేల్చిచూస్తునే ఉన్నారు. అంత గొప్ప ఆయుధమే స్త్రీలకు మన పూర్వులు సృష్టించి యిచ్చివుంటే ఆటంబాంబులను హైడ్రోజను బాంబులను ఈనాడు ప్రేల్చి మనలనంతా జడిపించే రష్యా, అమెరికా, బ్రిటన్‌లలాగే స్త్రీలుకూడా అనేక భంగిమలలో పురుషజాతిమీద ప్రేల్చి చూపించి ఉందురు. అంత శక్తివంతమైన ఆయుధమే పాతివ్రత్యమయి ఉంటే దాన్ని చూసి జడుసుకొని పురుషులు ఆత్మహత్యలు చేసికొని ఉండాల్సి ఉంటుంది. అప్పుడు ఈ వ్యాసం శీర్షిక వేరువిధంగా ఉండాల్సి ఉండేది.

అసలు ఇంకో విచిత్రమేమంటే మేరీగారు పేర్కొన్న మహాపతివ్రతలలో ఒక్కరూకూడా ఆత్మహత్యలు చేసుకోలేదు! వారంతా శుభం[illegible]కష్టంవచ్చిన మరునాడే యేనుయ్యో, గొ[illegible]య్యో చూసుకొని ఉంటే, ఇంత గొడవ వుండేది కాదు. అసలు మన భారత నారీమణుల ఆదర్శాన్ని అర్థంచేసుకోడానికి వివేకానందస్వామిలాంటి మహాపురుషుల రచనలని చదవాలి! అసలు ఈ మాదిరి మన పాతివ్రత్యాన్ని దుయ్యబట్టే వాదం 19వ శతాబ్దం నాటిఫాషన్. అది కూడ అజ్ఞానులైన వారిని మతం మార్చడానికి ఈ దేశంలోకి మత ప్రచారకులు దిగుమతి చేశారు. నేను 20వ శతాబ్దంలో ప్రొఫెసర్ హాల్డేన్‌లాంటి గొప్ప శాస్త్రజ్ఞులుకూడా



చీరెల అంచులకు డిజైను

—విజయలక్ష్మి (కోనూరు)


ఎంతటి కఠినహృదయాన్నైనా మార్చగలదు


మన సంస్కృతిని గురించే మనకు పాఠాలు చెప్పే స్థితిలో ఉన్నారు. పాతివ్రత్యాన్ని గురించి అంత చులకనగా పాశ్చాత్య విజ్ఞులే మాట్లాడంలేదు. సతీత్వాన్ని కొనియాడిన మహర్షులు ఏకపత్నీ వ్రతులను కూర్చికూడా ప్రస్తుతించారు. సీతను స్తుతించిన వాల్మీకి శ్రీ రామచంద్రుని ఏకపత్నీ వ్రతాన్ని కొనియాడినాడు. ఆత్మహత్య మహా పాపమని, పరమ నీచమని అదే మహర్షులు ఘోషించారు. ఆత్మహత్యఅనేది స్త్రీకాని, పురుషుడుగాని ఎవరైనాసరే చేసుకోడం మహాపాపం, పరమనీచం, పిరికితనం అని సర్వ ఉద్గ్రంథాలుఘోషించాయి. మరి, ఎందుకు స్త్రీలుగాని, పురుషులుగాని ఆత్మహత్య చేసుకుంటున్నారు? పిరికితనం వల్ల, అజ్ఞానంవల్ల — చేతగానితనంవల్ల — వేరేమీ లేదు. ఈవిషయంలో స్త్రీకొకధర్మం పురుషునకొక ధర్మంలేదు. ఆత్మహత్యలు చేసుకొనే పిరికిపందలు అన్ని దేశాలలోనూ ఉన్నారు, అన్ని మతాలలోనూ ఉన్నారు. వారంతా పతివ్రతలుకారు. ఈ విషయం గుర్తుంచుకోడం మరి, మరీ అవసరం. మన మత సంస్కృతులే ఆత్మహత్యకు కారణమైతే ఇతర దేశాలలో స్త్రీలు ఆత్మహత్యలు చేసుకోడం లేదా?

పతివ్రతలు పరమ కఠోర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఎందువల్ల? విశ్వాసంచేత, ఎవరిమీద? మానవత్వం మీద. మానవ హృదయం మీద, ప్రేమ, త్యాగములకున్న ప్రభావం వేటికీలేదు. నేడు కఠోరత్వం చూపించే భర్తకూడ మనిషే అని మరువరాదు. మనిషిని మంచి త్రోవకు త్రిప్పాలంటే అతనిలోని మానవత్వాన్ని, దివ్యత్వాన్ని ప్రజల్వింపచేయాలి. అపుడు మానవు-అతడు దానవుడు కాడుగనక — పశ్చాత్తాపంతో పునీతుడై ఆ త్యాగశక్తికి, ఆ ప్రేమమూర్తికి జోహారులర్పిస్తాడు. స్త్రీ తల్లిగా, భార్యగా, సోదరిగా ప్రేమాభిమానాలను చూరగొనే శక్తిగల దివ్యమూర్తి. సహనశీల. అటి స్త్రీలు అన్ని జాతులలోను ఉన్నారు. వాళ్లే మానవత్వాన్ని తాత్కాలికంగా కోల్పోయిన భర్తలను తిరిగి మానవులుగా చేస్తారు. విడాకుల కోరులకు, బావులకు పరుగెత్తేవాళ్ళు కాదు. కాబట్టి భారత స్త్రీల ప్రధానలక్షణం సహనశక్తి, త్యాగశక్తి. అది మనజాతిలోనే, మన నెత్తురులోనే ఉంది. ఈ 20వ శతాబ్దంలో మన కళ్ళముందు ఆ "మానవత్వంమీద నమ్మకం" అనే ఆయుధాన్ని ఉపయోగించి మహాత్మ గాంధీ, ఒక మహాసామ్రాజ్యపు పునాదుల్నే కదిలించివేసి, బ్రిటిష్‌వారిని మనకు మిత్రులను చేశారు. ఇంతకన్న సుమతి తన భర్త హృదయాన్ని కరిగించడం గొప్ప విశేషం కాదు. ఒక వ్యక్తిహృదయాన్ని మార్చడం, ఒక జాతిహృదయాన్నే మార్చగలిన ఈ మహాసన్నివేశం ముందు గొప్పది కాదు. మన సంస్కృతీ ఆదర్శాలను అర్థం చేసుకొని విమర్శించాలి.

సోదరి మేరీగారి వ్యాసంలో చివరి పేరాలో ముగించిన విధానం చాలాచక్కగా ఉంది. "కాలుజారిన ప్రతిస్త్రీ ఆత్మహత్యకు వడిగట్టుటలేదు" అని ప్రారంభించిన తరువాత వ్యాసం చాలా చక్కగా సాగింది. ఆత్మహత్య అనేది పాపమని అంగీకరించకపోవచ్చు కొందరు. కాని పరమ నీచమని అంగీకరించక తప్పదు. అది ఎవరైనాసరే. మరణానంతరం మనుషులేమౌతారన్న విషయాన్ని గురించి మనం తర్కించలేకపోయినా ఆత్మహత్యద్వారా బ్రతికినవాళ్ల బ్రతుకులు బండలుచేసిన స్త్రీలు చాలామంది ఉన్నారు.


పాతివ్రత్యమున్నంత మాత్రాన సహగమనం చేయాల్సిన అవసరంలేదు. కుంతి సహగమనం చెయ్యలేదు. దశరథుని రాణులు సహగమనం చేయలేదు. చేయాలని శాస్త్రం విధించలేదు. బహుభార్యాత్వం అన్ని దేశాలలో అన్ని జాతులలోనూ ఉంది. స్త్రీల దౌర్భాగ్యం వాళ్ల మతంలోలేదు. వాళ్ళ అజ్ఞానం, వాళ్ల పిరికితనం, వాళ్ళ ఆర్థిక నిస్సహాయత్వం మీద ఆధారపడి ఉంది. ఎడికెడు మెతుకులకు భర్తమీద ఆధారపడిన స్త్రీలు దరిద్రుల కడుపునపుట్టి కట్నాలివ్వలేనందువల్ల పెళ్ళికాని ఆడపిల్లలు, గయ్యాళి అత్తలు (వాళ్ళూ స్త్రీలే!) అంటూ ఇంకా ఉంటే వారి అజ్ఞానం క్రౌర్యం ద్వారా జీవితాన్ని దుఃఖమయం చేసికొన్న స్త్రీలు, వ్యాపార సూత్రాల మీద మంగళసూత్రాలు కట్టించుకొని భర్తల నిర్లక్ష్యంద్వారా బాధపడే స్త్రీలు,— ఇలాంటివాళ్ళెవరైనా తమ జీవితాలు గాడితప్పినపుడు ఆత్మహత్య అనే ఘోరనిర్ణయం చేసుకొంటారేమో గాని, ఆత్మహత్యలకు స్త్రీలకు లంకెపెట్టే సామాన్యసూత్రంసూత్రం 2+2=4 అన్న పద్ధతిలో కనిపెట్టాలంటే అసాధ్యం. ★





రేడియో కవర్ కు డిజైన్లు

డి. జయలక్ష్మి, గుడివాడ.



చర్మవ్యాధులు

ఒకవ్యక్తిని చూసీ చూడటంతోనే మనం గమనించేది వాళ్ళ చర్మకాంతినీ, ముఖ సౌందర్యాన్నీ. ఈ రెండింటిమీదనే మనిషి వర్చస్సు, కళా చాలావరకు ఆధారపడి వుంటాయి. కాబట్టే ఆయుర్వేదవైద్య మూల పురుషులు అంగవిభాగంలో చర్మానికీ, ముఖ సౌందర్యానికీ ప్రథమస్థానం ఇచ్చారు.

చర్మరోగాలలో తరుచూ వచ్చేవి గజ్జి, తామర, శోభి, రొండిగజ్జి మొదలైనవి. వీటిలో, తామర, శోభి, ఈ రెండింటికీ వున్నంత అసహ్యం ఇంతా అంతా కాదు.

గజ్జి

ఈచర్మవ్యాధి ఈరోజులలో సులభంగా వచ్చే అంటువ్యాధి. ఇది వచ్చేముందు వేళ్ళ సందుసా, నరాలమీద చిన్న నీటిపొక్కుల్లా లేస్తాయి. ఇవి పెద్దవయి చితికేదాకా మహా సలపరిస్తాయి. నరంమీదలేస్తేమరీను. అందుకే మనవాళ్ళు "వడమంత్రపు సిరీ, నరంమీద పుండూ" అన్నారు. దీనికి చాలామంది కంగారుపడి, గోళ్ళతో పోయేదాన్ని గొడ్డళ్ళదాకా తెచ్చుకుంటూరు. పుండు ఎంతకీ చితకపోతే, మహాబాధ. అల్లాంటప్పుడు పొయిలో మెత్తటిబూడిదను ఆముదము నులివెచ్చగాచేసి, ఈరెండింటినీ కలిపి పట్టిస్తే త్వరగా చితికి, దబ్బున మానిపోతుంది. పుండు మానేవరకూ, పప్పు వస్తువులు తినకూడదు. కందిపప్పు తినవచ్చు. ఈగజ్జి అసలు దురదలతో ప్రారంభమవుతుంది.

రోజూ శుభ్రంగా వళ్ళురుద్దుకునే బ్రష్‌లు బజార్లలో అమ్ముతాయి. అవి తెచ్చుకు రుద్దుకుంటే ఒకదురదలేకాక చమటవాసన అదీకూడా పోయి వళ్ళు శుభ్రపడుతుంది.

శోభి

ఇది ముఖముమీదా, వళ్ళంతా, ఇక్కడా అక్కడా అని లేకుండా వచ్చేస్తుంది. ఇది తెల్లతెల్లటి మచ్చలుగా వుంటుంది. కొంచెం నల్లవాళ్ళకయితే మరీ కనుపిస్తుంది. ఇది కూడా అంటువ్యాధే. ఒకళ్ళు వాడిన బట్టలు ఇంకొకరు వాడినట్లయితే, వస్తుంది. దీనికి తులసిఆకురసం, [illegible]యరసం సమభాగాలుగా కలిపిరాస్తే 3 రోజులలో తగ్గుతుంది.

రొండిగజ్జి

ఇదివస్తే రొండిఅంతా దురదగా వుంటుంది. మనం మామూలుగా చాకలికి బట్టలు వేసినప్పుడు, వాళ్ళు ఇంకొకరికి అద్దెలకు ఇస్తుంటారు. మొలగజ్జి వున్నవాళ్ళు ఆ బట్టలు కట్టుకుంటే అది ఎన్ని వుతుకులు వేసినాపోదు. రొండిచుట్టూ నల్లగా మసి పూసినట్లు వుంటుంది. అశ్రద్ధచేస్తే ఎన్నేళ్ళయినా అలాగే వుండి బాధిస్తుంది. శ్రద్ధతీసుకుంటే, దాన్ని మొదట్లోనే పోగొట్టుకోవచ్చు. రోజూ స్నానంచేసేటప్పుడు మంచినూనె, పసుపు మొలకు రాసుకుని, సున్నిపిండితో రుద్దితే కొంత వరకు దురద, మంటపోతుంది. తొందరగా స్నానంచేసి పొడిబట్టతో తుడుచుకుని, వుతికినబట్టలు వదులుగా కట్టుకోవాలి. ఈవిధంగా చేస్తే మొలగజ్జిని కొంతవరకు అరికట్టవచ్చు. ముఖ్యంగా గమనించవలసిన దేమంటే: ఈ రోగి బట్టలు ఇంకొకరు వాడరాదు. అసలు మొలగజిని వున్నవాళ్ళ దగ్గరకు వెళ్ళనివ్వరు సామాన్యంగా!

మొటిమలు

ఇవి వచ్చినా మొహామంతా అసహ్యముగాను, వికారంగాను కనిపిస్తుంది. అసలు మొటిమలు వయస్సులో వున్నవాళ్ళకి వస్తాయి అంటారు. కాని ఇది నిజమనిపించదు. అసలు మొటిమలు వంట్లో కొవ్వు పెరిగితే వస్తాయని కూడా అంటారు. సౌందర్యదృష్టితో చూసేవాళ్ళకి మొటిమలు ముఖచర్మ వ్యాధుల్లో ముఖ్యమైనవిగా వుంటాయి. మొటిమలను సాధారణంగా నొక్కి చిదుపుతారు. లోపలనుంచి తెల్లటి, లేక పచ్చటి దుష్టపదార్థం బయటకువస్తుంది. ఆ భాగం ఎర్రగా కందుతుంది. ఈ ఎరుపు క్రమంగా తగ్గుతుంది. అక్కడ పడ్డ గుంట మాత్రం అట్లాగే వుంటుంది. దీనికి "సో" రాస్తే తగ్గుతుందని చాలమంది అభిప్రాయం. ఈ మొటిమలు స్నో, పౌడర్ల అలవాట్లవల్ల ఇంకా ఎక్కువవుతాయేమో ననిపిస్తుంది.

"స్నో" రాస్తే మొటిమలు పోవు. పచ్చి పసుపు కొమ్ము సానమీద అరగదీసి రాస్తే మొటిమలు చాల భాగం తగ్గిపోతాయి. అప్పటికి తగ్గకపోతే డాక్టరే శరణ్యం.


పుట్టుమచ్చలు

వీనిని ఒక జబ్బుగా భావించకూడదు. ముఖంమీద వుంటే అందవికారంగావుంటే మాట నిజమే. కాని, వీనివల్ల ఆరోగ్యం ఏమాత్రం పాడవదు. వీని చికిత్స, విద్యుచ్ఛక్తి ద్వారానే బాగా సాధ్యమవుతుంది. అసలు పుట్టుమచ్చలు బుగ్గమీద వుంటేనే వాటి అందం. ఇవి వున్నందువల్ల ఏమీ నష్టం లేదు.

ముఖంమీది మచ్చలకు అనేక రకాలైన చికిత్సలు వున్నాయి. వాటి అన్నిటిలోకీ అతి ముఖ్యమైనది ఒకటి వున్నది. అది మనం వాడుకునే నిమ్మకాయ డిప్పతో రోజూకి ఒకసారి ముఖం రుద్దుకోవటమే.

నిమ్మకాయ రోజు కొకటి చొప్పున ఉదయం ఒక డిప్ప, సాయంత్రం ఒకడిప్పా నీళ్ళల్లో పిండుకుని స్నానంచేస్తే ఎంతనల్లటివారయినా నెలా రెండు నెల్లలో కొంత రంగుకి వస్తారు. నిమ్మకాయ పైత్యానికి కూడా చాలా మంచిది. ★

—కె. రాధారాణి



సంగీతపు విలువలు

సం|క్రాంతి సంచికలో భానుమతిగారు వ్రాసిన "ఈనాటి సంగీతం" వ్యాసం బాగుంది. త్యాగరాజు అరవవాళ్ళ సొమ్మని వాళ్ళనుకుంటున్నారు. త్యాగయ్య కీర్తనలన్నీ తెలుగులోనే ఉన్నాయి. త్యాగయ్య కీర్తనలలో ఎలాటిభావమున్నది! విన్నా, పాడినా-త్యాగయ్యకీర్తనలలో ఉన్న మాధుర్యం ఏకీర్తనలలోనూ కనుపించదు. కొందరు అరవసోదర-సోదరీమణులు త్యాగయ్యకీర్తనలలో ఉన్న భావాన్ని చంపేసి, చాల కఠోరంగా పాడతారు. అటువంటప్పుడుఏమాత్రం సంగీతజ్ఞాన మున్నవాళ్ళయినా బాధపడక తప్పదు. పవిత్రమయిన త్యాగరాజకీర్తనలకి వారు అన్యాయం చేస్తున్నారు. రేడియో ద్వారా శాస్త్రీయసంగీతం విందామంటే కరువైపోయింది. సిలోన్ రేడియోలో మాత్రం సాయంత్రం ఒక్క అరగంట సినిమా తెలుగు రికార్డులు వస్తున్నాయి. మన తెలుగుసినిమాలో నాగయ్య, భానుమతి మొదలైన కొద్దిమంది కర్ణాటక సంగీతం వినిపిస్తున్నారు. ఇంతిమంది ప్రజలని వారు ఆనందింపచేస్తున్నారంటే వారెంతో ధన్యులు. ముఖ్యంగా మన తెలుగు సినిమాలలో హిందీ-పాశ్చాత్య అనుకరణలు హెచ్చయిపోతున్నాయి. ఉదాహరణకి ఒక సినిమాలో ఆడ-మొగ అందరూకలిసి గంతులు వేస్తూ చేస్తూ-"అయ్యొ రామా!" అని ఒక పాట పాడారు. ఆపాట వింటూంటే మన తెలుగు సంస్కృతికి ఎంత అపచారం జరిగిందో ననిపిస్తుంది.

ఆంధ్రపత్రికలో వనితాలోకం శీర్షికమాదిరిగా త్యాగరాజ కీర్తనలు వరుసగా అచ్చువేస్తే బాగుంటుంది. దీనికి తోటి సోదరీమణులందరూ అంగీకరిస్తారని ఆశిస్తున్నాను.

—మండపాక పద్మావతీదేవి, జయపురం.]

* * *

'కడుపుబ్బ నవ్వించింది!'

శ్రీమతి పి. భానుమతీ రామకృష్ణగారు రాసిన "ఈ నాటిసంగీతం" చాలా బాగుంది. ఈవిడ సినిమా నటే కాకుండ రచయిత్రి కూడాను. "రామ నన్ను బ్రోవరా!" అన్న త్యాగరాజ కృతిని "హేయ్, హేయ్ రామ్ — నాన్ బ్రోవ్ రోయ్-"అని రాక్ అండ్ రోల్ సంగీతం చదువుతూ ఉంటే అందరము కడుపుబ్బ నవ్వేము. "ప్రక్కల నిలబడి", అన్న త్యాగరాజు కృతిని, "పాకాలా-నిలూ-బాడీ"...అన్న కొన్ని కొన్ని త్యాగరాజు కృతులు చాలా బాగా విడమర్చి వ్రాశారు. పి. భానుమతిగారు "ఈనాటి సంగీతం"లో వెలిబుచ్చిన భావాలతో నేను ఏకీభవిస్తున్నాను. వారికి నా హృదయపూర్వక అభివందనములు.

—కుమారి వారణాశి లక్ష్మి, రాజమండ్రి.]

* *

అమ్మలక్కలు

శ్రీమతి కె. యస్. ఆర్. రాణిగారు రాసిన 'అమ్మలక్కలు' అన్న వ్యాసం చదివాను. చాల బాగుంది. ఆమె వ్రాసినది అక్షరాలా నిజం. కొందరు ఏదో నెపంమీద అప్పుకని వచ్చి అప్పువిషయం మరిచిపోయి, లేనిపోనివి కల్పించిచెప్పి అత్తాకోడళ్ల మధ్య కజ్జాలు పెట్టి చల్లగా జారుకుంటుంటారు. ఇలాంటివారు పట్టణాలలోకంటే పల్లెటూళ్ళలోనే ఎక్కువగా ఉంటారనడానికి సందేహములేదు. అమ్మలక్కలమాటలు వినకుండా అత్త కోడలును కూతురులాగ, కోడలు అత్తగారిని తల్లిలాగ ఎప్పుడుచూసుకొంటారో అప్పుడే వారి సంసారము ఏ కలతలూ లేకుండా చక్కగా సాగుతుంది.

—ఉంతకల్ పరిమళ, హాస్పేట్.]

* * *

కోప్పడకుండా....

పిలలూ-పిల్లలతల్లులనుగురించి పవని నిర్మల ప్రభావతిగారు వ్రాసిన వ్యాసం చాలా బావుంది. వారికి నా అభినందనలు. మా అమ్మకు మేము నలుగురము ఆడపిల్లలము, తరువాత ఒక మగపిల్లవాడు కలిగాడు. ఇంట్లో అందరూ వాడిని అతిగారాబం చేశారు. దాని ఫలితం వాడుచేసే పనులన్నీ కోతిపనులే! ఒక్కటిమాత్రం తక్కువలెండి (తోక). వాడి పోకిరిపనులకు ఏమన్నా అన్నామంటే అమ్మకు కోపంవస్తుంది. నేను చూసినంతవరకు ఇలాంటి పిల్లలే ఎక్కువగాని బుద్ధిగా వుండేవాళ్ళు చాలతక్కువ. ప్రభావతిగారు వ్రాసినటు పిల్లల తల్లులు ఈవ్యాసం చదివి కోప్పడకుండా ఆచరణలో పెట్టే బావుంటుంది.

—ఓగిరాల ప్రభులాదేవి, ఒంగోలు.]

* * *

పిల్లలూ, గారాబము

శ్రీమతి పవని నిర్మల ప్రభావతి ఆంధ్రపత్రిక-వనితాలోకంలో (22-1-58) వ్రాసిన "పిల్లలూ-పిల్లల తల్లులూ" అను వ్యాసం చాలా బాగుగ నాకు వచ్చినదండీ! అందులో ఆవిడ "తమ పిల్లలను గారాబముగ పెంచే తల్లులకు ఇచ్చిన 'సలహాలు' బాగుగనున్నవి. లోకంలో అటువంటి తల్లులు వుండబట్టే (గోముగ పెంచు తల్లులు) దేశం కూడా ఇతర దేశములవలె ముందుకు పోవడములేదు. వారు చిన్నప్పుడే, శివాజీకి జీజీబాయి ధైర్యముగరపినట్లు ధైర్యము గరపుచు వీరమాత లనుపించుకొనినచో దేశము ఇతరదేశములకంటే ముందంజ వేయగలదని నా అభిప్రాయము. కాబట్టి ఆవిడ వ్రాసిన వ్యాసమునయినను ఈ ఆంధ్రలోని మహాతల్లులు చదువుకొని తమ పిల్లలకు ధైర్యసాహసములను గరపి వారిని మంచి మార్గంలో ప్రవేశపెట్టెదరని ఆశించుచున్నాను.

—జె. అపర్ణాదేవి, కర్నూలు.]

* * *

దగాపడిన తమ్ముడు

(19-వ పేజీ తరువాయి)

చేతులు కడుక్కొని పడమటి వైపు తిరిగి ఒక క్షణం కళ్ళు మూసింది. మళ్ళీ మొగుడి వెంటపడ్తూ, "పెద్దబాబు...ఆమాట యెందు కొచ్చిందో-మన చేతిలో ఏం వున్నాది! అన్నిటికీ ఆ దేముడున్నాడు!" అనుకుంది.

పుల్లయ్య వోరచూపు చూశాడు.

10

పండిన వరిచేలు కొయ్యకుండానే పెసర విత్తనాలు చల్లారు. చలికాలం ప్రతిభ చూపిస్తోంది. ఆడ, మొగా, పిల్లా పిచ్చికా, దుప్పట్లూ, కోకలూ గొంట్లు వేసుకోవటం మొదలుపెట్టారు. ముసలమ్మలు, కుంపట్లు ముందుంచుకొని అడ్డపొగచుటలు కాలుస్తూ వెచ్చగా ప్రొద్దున్న సాయంత్రం మూల కూర్చునేవారు. చుట్టూ చేరిన పిల్లలకు ముచ్చట్లూ, పేదరాశి పెద్దమ్మ కథలూ, చెప్పేవారు- ఎండప్పుడు వాళ్ళూ పొలాలకు కొడవలి పట్టుకొని వెళ్లేవారు.

కోతలు సాగుతున్నాయ్. అందరికీ తీరుబడి లేని పని. లేనివాళ్ళూ, పిల్లలూ, కలవారి పొలాలవెంబడి అక్కడక్కడ పడిన ధాన్యపు వెన్నులు యేరుకొని బుట్ట నిండాక ఇంటి కొస్తున్నారు. లేచిన పెసర మొక్కలు ఇస్తున్న లేతపచ్చదనంతో పొలాలన్నీ మనోహరంగా కన్పిస్తున్నాయి. ఓమూలనుంచి జంటజంటలు పదాలుపాడుకుంటూ చేస్తున్న పనివల్ల కొద్దిగానైనా అలసట లేకుండా ముందుకి సాగిపోతున్నారు. ఓ మూల కోసిన పొలాల్లో కుప్పలు పెట్టిస్తున్నారు. ఇంకో ప్రక్కబళ్ళతో కుప్పలను దగ్గరగా వున్న కళ్లాల్లో వేస్తున్నారు.

ఎక్కడ చూసినా ఉత్సాహమే. నీలి కూడా పొలాలలో పదాలు పాడింది; పుల్లయ్య అప్పుడప్పుడు వంతపదం పాడేవాడు. ఇలా సరదాగా పొలంలో పంట కళ్లానికి వచ్చింది. కళ్లంలోనించి ఇంటికి, ఇంటినుంచి బుగతగారింటికెళ్లాలి.

కొడవలి చేనులో దోపిన దగ్గరనుంచి కొత్త ధాన్యం వుడకబోసి, యెండాక దంచి, ఆ బియ్యం అన్నం తినటం చాలామందికి పరిపాటి. నీలికి ఇంటిపెద్దరికం వచ్చింది. మొగుడికి ఇష్టం లేకపోయినా చెయ్యికి తిరుగు లేదు. చాకలికి, మంగలికి పంట మోపులు ఇచ్చింది. ఊరి బడిపంతులుకు-ఇచ్చేటప్పుడు పుల్లయ్య కలుగచేసుకున్నాడు.

"మనకేం పిల్లలున్నారు చదువుకి? పందుం దాన్నం అంటే యేంటనుకున్నావ్ ?" అన్నాడు.

"పాపం, పిల్లలుకలోడు ఆ బాబు! వలుగురూ నాలుగు పందుం లిస్తే బతుకుతాడు," అంది.

మూతి బిగించి పక్కకు తప్పుకున్నాడు మొగుడు. నూర్పులు అయ్యాయి. పాలి బెంటు మండీమీద పెట్టాడు. ఎగరబోత అయ్యాక రాసిపోశాడు. ధాన్యం పాలి బెంటు చేటలో వేసి పొలం వెళ్లాడు. కొంటికర్రతో, పొలంలో వెద్దతీశాడు. గొయ్యలో ధాన్యం పోశాడు; దండం పెట్టాడు. ఆ బెడ్డ వినాయకుడికి కళ్ళంలోని రాసి మీద పెట్టాడు. కయిలునాడు రాసట్లు చేసింది నీలమ్మ. ఉప్పూ, బెల్లంవెయ్యని ఆ అట్లు వినాయకుడు ఆరగించాడు. కొబ్బరినీటితో అభిషేకం చేయించుకొని, ఇంట్లో ధాన్యపు గాదిలో మొదట కూర్చున్నాడు. — ఇక ధాన్యపురాసి కళ్ళంనుంచి వచ్చిపడింది. గాదిలో — గాదిలోంచి పట్నం బుగత గారింటికి కదలాలి!

గంగిరెద్దువాళ్ళకిదే సమయం! ఊళ్లో కోమటి పేరయ్య గడించటానికి ఇదే కాలం—మందలి సోదమ్మకూ యిదే టైము.

'ఓయమ్మ—వాతనొప్పులకి మధువాయు నొప్పులకి మందు,—మంచి మంచి ఔడధాలున్నాయ్—'.

ఒళ్ళంతా ఇత్తడి సరుకులు, మెడనిండా పగడాల పూసలు—చంకన పిల్లడు-చేతిలో తుంబుర — నెత్తిన బుట్ట!—నోటినిండా మాట—మందలి సోదమ్మ!

'సంతానం లేదు'...పొరుగమ్మ అందుకుంది...నీలివైపు చూసి సోదమ్మ "లేకపోవడమేంటి తల్లీ—పద్దెనిమిది గాడిదలమీద వచ్చిన పురండాలు (పురాణాలు)—కన్నుబోయినా, కాలుపోయినా, పిల్లలు లేకపోయినా, అన్నిటికీ మా దగ్గర లేనిది లేదు—కొలిసి ముప్పయి కుంచాలు, కొలక ముప్పయి కుంచాలు — ఇది గురువాగ్య, తల్లి గురువాగ్య — గురువాగ్య తప్పినోడు గుర్రవై పుట్టాడు — గవమెరిగి బతికనోడు గాడిదై పుట్టాడు!"...

"ఒక్కదానికింత కర్చా—" పొరుగమ్మ ముక్కుమీద వేలు వేసుకుంది. లోనుంచి ముసలమ్మ అందుకుంది. "నీలమ్మా! నువ్వు ముసలిదానవా, ముతకదానివా? మందులోని మరలో పడక!"

సోదమ్మకు కోపంవచ్చింది. ముఖం ముందుకుతోస్తూ అభినయంతో,

"ఓ యీగ రెప్పలదాన—సీపి కల్ల దాన
పెటిన కూటిలో బుగ్గి పోస్తావా?
ఏకానికి యెత్తే వానలుండవు—
దిగానికి వస్తే పంట ఉండవు—"

ఈ సాప్యంపెట్టి మందివ్వకుండానే వెళిపోతూంది—సోద చెప్పకుండానే పారిపోతోంది. నీలి పిలిచింది-రాలేదు. మళ్ళీ పిలిచింది...

"నాడి తెలిసినోడే మందులోడు—కీలకం తెలుసుకోవాలి...గురువాగ్య!"అంటూ తిరిగి వచ్చింది.

"నూడు సోదమ్మా! నాకెందుకు మందు- ఇద-తీసుకువెళ్ళు"...అంటూ అడ్డెడు ధాన్యం పోస్తూంటే పొరుగావిడ ముక్కుమీద వేలు వేసుకుంది. సోదమ్మ "మళ్ళా యీరోజులనాడు రానా...పండులాంటి కొడుకు నెత్తుకోవా తల్లీ!" అని దీవించింది.

పుల్లయ్య బుగతకు అంబారం కొలవగా మిగిలినదానిలో వూరిలో రివాజు ప్రకారం ఆడెమ్మప్పదగ్గర పెళ్ళికి తీసుకున్న డబ్బుకి వడ్డీ ధాన్యం కొలిచాడు. ఆడెమ్మ అల్లుడు, డబ్బుకి పద్దు రాయించుకొన్నాడు. ఆ డబ్బు యెలాగ తీర్చటం? మిగిలిన ధాన్యంలో యెలాగో సంవత్సరం అంతా గడుపుకోవాలి. ...ఇన్నాళ్లూ ఒకే ప్రాణం, యిప్పుడు మూడు ప్రాణాలు! అందులో పెళ్ళానిది చిక్కని చెయ్యి కాదు! నీలి కాళ్లూ చేతులు, లేవా అన్నది.

పుష్యమాసం సాతానివాళ్ళ పదాలతో బంతీచేమంతుల వాసనలతో, వుషారెక్కువూగుతూ వెళ్ళిపోయింది. వచ్చింది మాఘం. శుద్ధ యేకాదశినాడు కొండమీద యాత్ర! నవిరికి దక్షిణాన-క్రోసున్నర దూరాన వున్న దాకొండ-సాలెహుండం-చరిత్ర ప్రసిద్ధికెక్కిన దది-ఆ కొండమీద విష్ణ్వాలయం-ఆ చుట్టుపట్ల వూళ్లనించి ఆడా మొగా, పిల్లా జెల్లా—బయలుదేరారు—తెల్లవారి ప్రొద్దు లేచింది — చలిగాలి వీస్తోంది — కొండకు ప్రక్కగా పారుతున్న వంశధార నదిలో వేలకొలది, జనం స్నానాలు చేస్తున్నారు—స్నానఘట్టంనుంచి కొండకు వెళేవరకూ, యిరువైపులా, గుడ్డలుపరచి, భిక్షుకులు బారులు తీర్చి కూర్చున్నారు. స్నానాల స్థలంలోనే భజనలు చేసేవారు—తప్పిడిగుళ్ళు వాయిస్తూ ఆ యిసుకలో పరవశమై నాట్యం చేసే గుంపులు! ఆ పాటలు ఆమడదూరం వినిపిస్తున్నయ్! జన

దగాపడిన తమ్ముడు

సమూహం దూరాన్నుంచి చూస్తూంటే, బారులు తీరిపోతున్న చీమల సమూహంలా వుంది. సాధువులు సమూహంలో చేరి, విభూది బొట్లు ప్రజలకు పెట్టి సత్కారం పొందుతున్నారు.

నీలి పుల్లయ్య కలిసి జాతరకు వెళ్ళారు. తలకు స్నానంచేసి కాంతి నిచ్చే తండ్రికి ఒక మ్రొక్కు మొక్కి కొండవైపు బయలు దేరారు. కొంగులో పోసిన బియ్యం, దారికి రెండు వైపులా పరిచిన గుడ్డలమీద వేసు కొంటూ నీలి ముందూ, వెనుక పుల్లయ్యా నడుస్తున్నారు. పట్నం నుంచి కళాకారులు, కిళ్లీ దుకాణం మనిషికూడా వచ్చారు. పట్నంలో కనబడని అందం ఇక్కడే వుంది. ఈ పల్లెయువతుల కూటమిలో స్వాభావికమైన వంపులతో కూడుకున్న సొంపును తిలకించడానికి ... వచ్చారు! ఓ మూల కూర్చుని, అమాయికంగా ముందుకి నడుచుకు పోయే—అతివల శరీరపు బిగువుల లోనికి తీక్ష్ణంగా చూస్తున్నారు కొందరు. యౌవనం తొణికిసలాడుతున్న కాలింగ వనితలు—బంగారు ఛాయతో శృంగారంగా అందాన్నంతా జీర్ణించుకొని, ముందుకు సాగి పోతున్నారు—చూచేవాళ్ళకి కళ్ళు పండువుగా వుంది.

పసుపురాసుకొన్న ముఖాన పెద్దకుంకుమ బొట్టుపెట్టుకుంది నీలి—పళ్ళూ, కాయలూ కొని కొండమీదకు ఎక్కుతున్నారు—అక్కడక్కడ పందిళ్ళు వేసివున్నాయ్—ఆ కొబ్బరి పందిళ్ళమీదకు పళ్ళు విసురుతున్నారు — అక్కడక్కడ నిల్చుని పదాలు పాడే భిక్షుకులు—వెనకనే ఫకాలున నవ్వుతూ, వెంటపడే, పట్నపు కుర్రాళ్ళు—ఆ నవ్వును వినకండా పల్లె ప్రజ—ఒకటే దృష్టి—కొండమీది దేముడు-ఆ తండ్రిదర్శనం దొరకాలి—జన్మ తరించాలి! రాతి విగ్రహంలో రమణీయత చూస్తారు.అందులో జీవి కళకళ్లాడినట్లుంటుంది. వాళ్ల ప్రార్థనలు విని మనో ఈప్సితాలు అర్థంచేసుకుంటుందా విగ్రహం! తాము తమ భక్తిని అర్పించామనే తృప్తికి నివాళిగా ఈ పళ్ళూ కాయలూను! విశ్వాసంతో బ్రతుకుతారు—విశ్వాసమే వాళ్ళ పరమావధి—ఆ విశ్వాసంలోనే ఆనందంపొంది తరిస్తారు.

ప్రజ మీదికి కదలిపోతున్నారు. ఈ దంపతులు భక్తితో తన్మయులై ముందుకు సాగి పోతున్నారు—ఒక సాధు—దగ్గరగా ఎత్తున గౌరీపార్వతులు నంది వాహనం మీద కూర్చున్న బొమ్మ వుంది—శంకరుడు నవ్వుతున్నాడు—అదిగో హాలాహలం మింగిన నీలకంఠుడు—చిరునగవు ఒలకబోస్తున్నాడు—నంది వాహనారూఢుడై, ముందుకు వస్తున్నాడు. భక్తితో ఇద్దరూ తలలు వంచారు. సాధువు ఇద్దరి తలలపై చేతులు ఆన్చి, "పండ్లు దానం చేశారు—! పండులాంటి కొడుకు పుట్టాడు!" అని దీవించాడు.

పుల్లయ్య ఒళ్లు జలదరించింది! కొడుకు—ఈ మధ్య పెళ్ళాం వలపు తలుకుల్లో, లీనమై కొడుకు విషయమై మరచిపోయాడు—కొడుకు కోసమే కదా తను పెళ్లాడింది!—న్యాయంకీ నీతికీ కట్టుబడేవాడు—దొంగలను పట్టే దొర—తనకంటే గరిడీలో ఘటికుడు తన కొడుకు—కనిపిస్తున్న పిల్లలందరిలోని, తన కొడుకు అగుపిస్తున్నట్లుంది—"నా కొడుకు యింత తెల్లగా వుంటాడేమో—! యింతకంటే మొఖం బాగుంటుంది - యీ కొండ యిలా యిట్టే యెగప్రాకేస్తాడు!...

కొడుకు తలపుతో కొండ యెక్కిపోయాడు. కోవెల దగ్గర జనం త్రోసుకొంటున్నారు. ఆ సమూహంలోనికి చొచ్చుకపోవటం బ్రహ్మాండమైన పని. తనైతే వెళ్ళగలడు. నీలీ, తనూ ఇద్దరూ వెళ్ళాలి. మనసు తీరా మ్రొక్కాలి. ఎంతో మందిలా వీళ్ళూ కోవెలమీదకు అరటిపళ్లు విసిరేశారు. దేమునిదర్శనం అయిందికాదు మొదట. కానీ అలా వోర్చి వుండేసరికి, ప్రొద్దు తిరిగిపోయింది. చలికాలపు ప్రొద్దు గబగబ దిగి, పోతూంది. జనం రద్దడితగ్గాక స్వామిదర్శనం చేసుకొని, రెండో వైపు నించి కొండ దిగారు. పట్నంనుంచి రకరకాల వస్తువులు, దుకాణాలు, కాఫీహోటళ్లు, పల్లెలనుంచి చెఱకుబళ్ళు—పండరి భజనదళాలు వచ్చాయి—ఒకమూలగారడీ జరుగుతోంది.—ఇంకో ప్రక్క రంగుల రాట్నం! సంబరం అంతా చూశారు—అప్పుడేజనం పల్చబడుతున్నారు—సెనగలు, ఖర్జూరం, చెఱకులు. కొన్నారు. ఎంతబలవంతం చేసినా నీలి అట్టే యేమీ తినలేదు. ఒళ్ళంతా త్రిప్పుతున్నట్లుంది. అయినా మొగుడితో చెప్పక వెంటనడిచింది. అటు వైపునుంచి నవిరి రావటానికి రోడ్డువుంది. ఆరోడ్డుమీద కొంత దూరంవచ్చాక అడ్డత్రోవలో పొలాల గట్లపైనుంచి నడుస్తున్నారు. నీలి కుంటుపడుతోంది. వాళ్లను దాటుకొని వెనక బయలుదేరినవాళ్లు ముందుకు వెళ్ళిపోతున్నారు.

సాయం సమయం! పడమటి ఆకాశం తెలుపు యెరుపుల కలయికతో మనోహరంగా వుంది. అక్కడక్కడా చెదిరిన మేఘాలు, కుంకుమలో తడిచిపోయినట్లున్నయ్. ఒకేఒక తాటిచెట్టు ఆకాశంలోకి చొచ్చుకుపోయింది. పక్షులు యెర్రటి పళ్ళతోనిండిన వటవృక్షమని కామోసు, అటువైపు యెగిరిపోతున్నయ్! దిగువ పెసర చేలు ఇంపుగా ఆకుపచ్చని రంగు పూశాయి. ఒంటిగా ఒకగుట్ట భల్లూకంలా భానుడ్ని మ్రింగేస్తోంది.

ముందుకుచూస్తే యేరు! మెల్లగా యీ అందమైన అందిన ప్రకృతిని నములుతూ దిగువకు కదిలిపోతోంది. అవతలి ఒడ్డున గుబురుగా యెత్తుగా లేచిన సరుగుడుచెట్లు సరాగాలాడుకుంటున్నాయ్. ఒంటరి జాలరి వలను చేపలమీదికి విసురుతున్నాడు!

ఆ దృశ్యాలన్నీ మధురాతి మధురంగా వుంటే పుల్లయ్య కాళ్లు గబగబ పడుతున్నాయ్! నీలికి యేదో ఒళ్ళంతా వెర్రి అయిపోయినట్లుంది. ఇంక నడవలేక కూర్చుని పోయింది—ఆ దగ్గరగానే పాముల పుట్ట!

"ఓపిక చేసుకో—అదిగో కన్పిస్తోంది మనవూరు!"

నీలి మాటాడలేదు. వెనక వచ్చేజనం అట్టే లేరు. చీకటి పడటానికి ఇంకెన్నో సమయం లేదు. చలిగాలి అప్పుడే వీస్తోంది. చంద్రుడు మెరుగులు దిద్దుకోడానికి సన్నాహం చేస్తున్నాడు.

నీలికి కడుపు తెమిలేసి పెద్దవాంతి అయ్యింది. పుల్లయ్య గాబరాపడ్డాడు. నీలి ఫరవాలే దంటున్నా, ప్రక్కన నిల్చొని పెళ్ళాం చెంపలు గట్టిగా నొక్కి పట్టుకున్నాడు. అపుట ప్రక్కనుంచి పాము వాళ్ళని చూడనట్టే వెళ్ళిపోతూంటే నీలి గతుక్కుమని లేచింది. ఇద్దరూ నమస్కారం చేశారు. ఆసర్పరాజం వీళ్ళవేపు చూడకండానే అలా పొలంగుండా పెసరచేలను చీల్చుకుంటూ వెళ్ళిపోయింది.


ఇద్దరూ ముఖాలు చూసుకున్నారు. మెల్లగా భర్తభుజం పట్టుకొని నడుస్తూంటే మళ్ళీ కడుపు తెమిలేసింది. అప్పుడే ఒక ముసలమ్మ మనవడూ, యాత్రనుంచి ఆగి ఆగి వస్తున్నారు. గాబరాపడ్తూన్న పుల్లయ్య వైపు నవ్వుతూ చూసి బోసినోటితో.

"ఎన్నాళ్ళయింది నాయనా పెళ్లయి?" అని అడిగింది.

సమాధానం చెప్పటానికి ఆమాటలు వినిపించుకుంటేగా? మెల్లగా ముందడుగు వేస్తూ వేస్తూ నీలి ముఖంలోకి చూస్తూ చూస్తూ చిన్న నవ్వుతో "పండులాంటి పిల్లాడిని యెత్తుకుంటావులే!" అంది.

పుల్లయ్య ఆ మాటలు వినగానే ఒక్క ఎగురు ఎగిరాడు. నీలి చిరునగవు మెఱుపు తీగలా ఒక్కసారి మెరిసింది!

(ఇంకావుంది)



బలే బంట్రోతు

పింఛనుదొర కలడొక్కడు
పిల్లజెల్ల లేనివాడు
ధనమంతయు సారాయికి
ధారపోయు త్రాగుబోతు.

అంతకంటె త్రాగుబోతు
ఆతగాని బంట్రోతు!
దొరగారు షికారుకేగు
తరియుండా సేవకుండు
బుడ్లలోని సారాయిని
పుచ్చుకొనియు నీళ్లుకలిపి
ఎప్పటివలె అట్టెపెట్టి
ఏమి ఎఱుగ నట్టులుండు.

ఎంత త్రాగుచున్నగాని
ఇంత నిషా కలుగకునికి
యజమానుడు బంట్రోతును
అనుమానముతోడ చూచె.
తర్వాతను తెచ్చుకున్న
తన సారాబుడ్లమీద
'ఇది విషమ్ము తాగరాదు
పదిల'మ్మని వ్రాసిపెట్టె.
సేవకుడా రహస్యమును
చిటికెలోన గుర్తెఱింగి
ఎప్పటివలె త్రాగుటకై
ఏతెంచెను గదిలోనికి.

అత్తరి దొర ఎటనుండియొ
హఠాత్తుగా నటకువచ్చి
'ఆగు మాగు, అది విషమ్ము,
త్రాగినచో చత్తు'వంచు
అరచె-నంత సేవకుండు
వెఱపన్నది వెలిపుచ్చక
నిబ్బరమును తెచ్చుకొనుచు
నిజముదోప నిట్లు పలికె:

"అయ్యా! మీ సారాయిని
ఆరగించు వారెవ్వరో
కనిపెట్టక నన్ను మీరు
అనుమానించితి రెంతయు
ఇంత మంచి దొరచేతను
అంత నింద పడినందున
చింతనొంది చావుటకై
చేయదగిన పని ఇది యని
ఈ విషమ్ము త్రాగదలచి
ఇచటి కేగుదెంచినాడ!"
అని గడగడ సారాయము
నమాంతముగ త్రాగివైచె.

ఉత్పల

హాల్ దొర

మ్రావీధిచివరన వరహాలు అని ఒకాయన ఉన్నాడు. కాని అందఱూ అతనిని 'హాల్ దొర' అని పిలుస్తారు. అతనికి ఆపేరు రావడానికికారణం వరహాలుచేసిన ఒక తమాషా అట.

అవి దేశాన్ని ఆంగ్లేయులు పాలించే రోజులు. ఒక ప్రముఖవార్తా పత్రికలో ఒకసారి ఒక ప్రకటనపడింది. అది బొంబాయిలోని ఒక పెద్ద ఆంగ్ల వ్యాపార సంస్థకు అనుభవజ్ఞుడైన మేనేజరు వెంటనే కావాలని. ఆకాలంలో అలాంటిపనులు ఆంగ్లేయులకే యిచ్చేవారు. అసలు వారికోసమే ఉండేవి కూడా. భారతీయులకు అటువంటి పనులిచ్చేవారు కాదు. కనుక ఎవ్వరూ అటువంటి పదవులను కలలోకూడా తలచేవారు కాదు.

వరహాలు ఆ ప్రకటన చూచాడు. ఒక చిన్నతమాషా చేసి ఆ కంపెనీ వాళ్లను ఏడిపించాలనుకున్నాడు. కలిసివస్తేఫరవాలేదు. కలిసిరాకపోతే పోయేది ఏమీలేదు. కనుక వెంటనే అర్జీపెట్టాడు ఆపనిని తన కిమ్మని. తనపేరులోని మొదటి రెండు అక్షరాలు కొట్టివేసి 'హాల్' అని సంతకము పెట్టాడు.

వరహాలు అదృష్టమో, మరేమో గాని ఆఉద్యోగానికి అప్లికేషన్లు ఎక్కువగా రాలేదు. వరహాలు వేసిన అప్లికేషన్ ఆకంపెనీ వాళ్లను ఎక్కువగా ఆకర్షించింది. వరహాలు అప్లికేషన్‌ను మద్రాసు నుండి వేయటంవల్ల, క్రింద మిస్టర్ హాల్ అని ఉండుటవల్ల వాళ్లు, వరహాలు మద్రాసులోని అనుభవజ్ఞుడైన ఆంగ్లేయుడై ఉంటాడను కొన్నారు. వాళ్లు తమకు మిస్టర్ హాల్ అప్లికేషన్ నచ్చిందని, వెంటనే బయలుచేరి వచ్చి పనిలో చేరమని ఆర్డర్ పంపారు. కొంత డబ్బు అడ్వాన్సుగా కూడ పంపారు.

సరే జరిగే దేదో జరగనీయమని ఏమీ భయపడకుండా పలానారోజు వస్తున్నానని టెలిగ్రామ్ కొట్టాడు వరహాలు. దర్జాగా ఫస్టుక్లాసులో ప్రయాణంచేసి బొంబాయి చేరాడు. హాల్ దొరకు స్వాగతం చెప్పటానికి స్టేషన్‌కు, కంపెనీవాళ్లు తమ కంపెనీలోని ఒక ఆంగ్ల ఉద్యోగిని పంపారు. అతడు తమ క్రొత్త మేనేజరుకు స్వాగతం చెప్పడానికి పరివారాన్ని వెంటబెట్టుకొని పూలమాలలతో అట్టహాసంగా హాజరైనాడు. కొంచెంసేపు వరహాలు రైలుపెట్టిలోనే కూర్చున్నాడు పైపు కాలుస్తూ, తనని ఎవ్వరైనా ఆహ్వానిస్తారేమో నని. కాని అటువంటిదేమో జరుగకపోయే టప్పటికి వరహాలు పెట్టిదిగి ప్లాటుఫారం మీది కొచ్చి నిల్చున్నాడు. మఱి యిక్కడ స్వాగతం చెప్పటానికి వచ్చినవాళ్లే హాల్ దొర కనబడలేదని తికమకపడుతున్నారు. అవచ్చిన సిబ్బంది తన కోసమే వచ్చారని వరహాలు చూచాయగా తెలిసుకొన్నాడు. ఒక జవానును పిలిచి ఎవరికోసం వెదుకుతున్నారని అడిగాడు. మా క్రొత్త మేనేజరు హాల్ దొరగారు ఈ బండికి రావాలి, వారికోసం అని జవాబిచ్చాడు ఆనౌకరు. వాడికి తానే హాల్ దొరనని చెప్పాడు వరహాలు. జవాను నిర్ఘాంత పోయాడు. ఆదరాబాదరాగా పరిగెత్తికెళ్లి, తమతో వచ్చిన ఆఆంగ్ల ఉద్యోగికి చెప్పాడు, ఆసంగతి. అతను ఈ హాల్ దొరని చూచి ఖంగారు పడ్డాడు. వాళ్లలోవాళ్లు ఒకళ్ల ముఖాలు ఒకరు చూసుకొని బేలపోయారు. ఆఉద్యోగి హడావిడిగా వరహాలు దగ్గరికి వచ్చాడు. "క్షమించండి. మీరేనా మిస్టర్ హాల్?" అని సందేహిస్తూ ప్రశ్నించాడు. వరహాలు అతనిపై ఎగిరిపడ్డాడు. కోటు జేబులోంచి కంపెనీవాళ్లు పనిలో చేరమనిపంపిన ఆర్డర్ చూపించాడు. ఆఉద్యోగి అతివినయంగా క్షమాపణవేడి వేరేగతిలేక తాను తెచ్చిన పూలదండలను వరహాలు మెడలో వేసి కరచాలనంచేశాడు. తరువాత వరహాలును, హాలు దొరకోసం సిద్ధం చేసిఉంచిన బంగళాకు తీసికొని పోయారు.

హాల్ దొరకు స్వాగతం యిచ్చిన ఉద్యోగి జరిగిన దంతా కంపెనీ యజమానులకు చెప్పాడు. వాళ్లు జరిగిన పొరపాటు తెలుసుకొన్నారు. మేనేజరు పదవి ఆంగ్లేయునికై నిర్దేశించబడింది కాబట్టి ఈనల్లదొరను ఎట్లాగన్నా సాగనంపా లనుకొన్నారు. కొంత డబ్బును ఖర్చు పెట్టటానికి కూడ సిద్ధపడ్డారు. వరహాలు దగ్గరికి అనుభవజ్ఞుడైన మరొక ఉద్యోగిని రాయబారిగా పంపించారు. ఆ ఉద్యోగి వరహాలుతో, కంపెనీ మేనేజరువంటి ఉన్నతమైన పని ఆంగ్లేయునికై నిర్దేశించబడిందని, అప్లికేషన్‌లో 'హాల్' అని ఉండుట వల్ల ఆంగ్లేయుడై ఉంటా డనుకొన్నామని, తప్పు జరిగిందని చెప్పాడు. నష్టపరిహారంగా తాము కొంత డబ్బు యివ్వగలమని కూడా చెప్పాడు. వరహాలు తీవ్రంగా ముఖంపెట్టి, తాను మద్రాసులో వెయ్యి రూపాయల పనికి రాజీనామా యిచ్చి వచ్చానని, తనను ఆహ్వానించి వద్దనటం సబబు గాదని, న్యాయంకోసం తాను కోర్టుకు పోగలనని బెదిరించాడు.

ఆ ఉద్యోగి జరిగి నదంతా పోయి యజమానులకు చెప్పాడు. కంపెనీ యజమానులు కొంచెం చలించారు. వరహాలును కోర్టుకు పోకుండా చేయడానికి ఎంతడబ్బైనా ఖర్చు పెట్టటానికి సిద్ధమయ్యారు. వారు హాల్ దొరను స్వయాన కలిసికొని, తమ క్షమాపణలను చెప్పి అతి కష్టం మీద వరహాలును ఒప్పించి ఒక సంవత్సరం జీతం నష్టపరిహారంగా యిచ్చారు. వరహాలు వేరేగతిలేనట్లుగా నటించి, ఇష్టం లేనట్లుగా ఆడబ్బు స్వీకరించి మద్రాసువచ్చాడు. అప్పటినుంచి వరహాలు 'హాల్ దొర' అయ్యాడు. ★

దిక్కులేనివాడికి దేముడే దిక్కు

శ్రీ రంగం సుందరమ్మ

పర్షియా దేశం పరిపాలించే పా బహు మంచివాడు. కరుణామయుడు. ఆ దేశంలో న్యాయం నృత్యం చేస్తూవుండేది. ప్రజలంతా సుఖంగా కాలం గడిపేవారు.

ఆ దేశంలో వర్తకం బాగా సాగుతూంది. వర్తకం అంటే ముత్యాలు ఎక్కువగా చలామణి అయేవి. సామాన్య కుటుంబాలు మాత్రం ఏవో కొద్దిగా వర్తకం చేస్తూ కాలక్షేపం చేసేవారు. ఆలాంటి సామాన్య ప్రజలలో అహమ్మదు అనే కుర్రవాడు, వాని తల్లి నివసిస్తున్నారు. ఈ కుర్రవానికి చిన్నతనంలోనే తండ్రి దివంగతుడైనాడు. పాపం తండ్రి లేని బిడ్డగదా యని తల్లి అతి గారాబంగా పెంచడం మొదలుపెట్టింది. ఆ గారాబం కొంప తీసింది. పిల్లవాడు పెరిగి పెద్దవాడయాడు. ఏదైనా చిన్న ఉద్యోగం చేసి. ఏమైనా తెస్తే పొట్ట పోషించుకోవచ్చునని తల్లి ప్రతిదినమూ అహమ్మద్‌కు బోధ చేసేది. కాని అబ్బాయికి పలుకులు రుచింపలేదు. అప్పటికే చెడుసహవాసం అబ్బింది. పాపం ఈ నడవడి తల్లికి మాత్రం తెలీదు. ఆమె చాలా అమాయకురాలు. అల్లా కాపాడుతాడనే అమె దృఢ నమ్మకం.

ప్రతిరోజూ ఉదయం లేచి అన్ని పనులు చక్కపెట్టుకొని ఉద్యోగం నిమిత్తం వెడుతున్నానని తల్లితో చెప్పి వెళ్లిపోయేవాడు అహమ్మదు. అలాగే పాపం ఏదో ఉద్యోగం దొరికితే కాలంగడుస్తుందనే ఆశతో దీవించి పంపేది ఆ అమాయకపు తల్లి.

అహమ్మదు స్నేహితులతో కూడి జూదం ఆడి, వారితో దోపిడీ చేయడానికి వెళ్లేవాడు. కాని తాను ఏమీ చేసి ఎరుగడు. వారితో నామమాత్రం వెళ్ళి, వాళ్లు యేది ఇస్తే అది తెచ్చి యింట్లో యిచ్చేవాడు. కొడుకు ఏదో తెస్తున్నాడని సంతోషించేది తల్లి. ఉద్యోగం ఏమైనా దొరికిందా అని అడిగితే,

లేదు, రేపో, ఎల్లుండో దొరుకుతుందని అసత్య మాడేవాడు. పోనీ! అల్లా ఉన్నాడులే, మనకు ఆయనే దారి చూపిస్తాడని ఓదార్చేదా తల్లి. తాను ఎలాగ సంపాదిస్తున్నది తల్లికి, అహమ్మదు ఎప్పుడూ చెప్పలేదు.

ఇలా ఉండగా "షా" చక్రవర్తి మారువేషంలో ప్రజల కష్టసుఖాలు కనులారా చూసేందుకని, మంత్రిని తీసుకొని బయలుదేరేడు. తానొక వర్తకుని మాదిరిగాను, మంత్రి ఒక గుమస్తాగాను వేషం వేసుకొని ఒక పల్లకీలో కొంతధనం వేసుకొని, వెనుక కొంత సిబ్బందిని వెంటపెట్టుకొని బయలుదేరి, దొంగ లుండే ప్రాంతంలో వస్తున్నాడు. అహమ్మదు తాలూకు గుంపు అక్కడే దోపిడి నిమిత్తం వేచియుండుటచేత వారందరూ ఒకేమారు వర్తకుని మీదపడి ధనం దోచుకున్నారు. అహమ్మదుమాత్రం దూరంగా నిలబడి ఇదంతా చూస్తున్నాడు. కాని వర్తకుని సిబ్బందిలో ఒకనికి పెద్ద గాయం తగిలి చనిపోయేడు. ధనంతోసహా దొంగ లంతా పరారి అయేరు. ఇంకక్కడ ఉన్నది, దూరంగావుండి చూస్తున్న అహమ్మదొక్కడే. ఇదంతా చక్రవర్తి చూస్తూనే ఉన్నాడు.

అహమ్మదు వెంటనే చేతులు జోడించి ప్రార్థిస్తూ ఇలా అన్నాడు: "అల్లా, ఆఖరికి ఆ గ్లాసుడు నీరు కూడా నాకు దక్కకుండా చేసేవు. నేనేమి పాపంచేసేను. నన్నురక్షించి మా తల్లికి పుత్రభిక్ష పెట్టవూ?" అని భోరున ఏడ్చి క్రిందపడిపోయేడు. తెలివిలేనపుడు ఉరి తీయుట శాస్త్ర సమ్మతం కాదని, ఉరి కొంతసేపు ఆపమని ఆజ్ఞాపించేడు చక్రవర్తి.

మరల కొంతసేపటికి తెలివి వచ్చింది అహమ్మదుకు. ఈ సారి అతని ముఖంలో తేజస్సు కనిపిస్తూంది. భయం, బెంగ ఏ మాత్రం లేవు. చిరునవ్వు నవ్వి "రాజా! నీవిధి నీవు నిర్వర్తించవచ్చు"నని చక్రవర్తితో అన్నాడు. ఈ మార్పుకు చక్రవర్తి ఆశ్చర్యపోతూ," అబ్బాయీ, నీకోరిక ఏమీ చెప్పేవు కావు. నీకేమి కావాలో కోరుకో, ఆ కోరిక, తీరేవరకూ నీకు ఉరి తీయము" అని అన్నాడు.

అహమ్మదు తల గిర్రుమంది. ఒక ఉపాయం మెరుపులా మెరిసింది. "అయితే, నాకిచ్చిన గ్లాసుడు నీరు నాకిప్పించండి, ఆనీరు త్రాగిన తక్షణం ఉరి తీయం"డని తలవని తలంపుగా నివేదించేడు చక్రవర్తికి. ఇది వినగానే చక్రవర్తికి మతిపోయినట్టయింది. పోయిన నీరు ఎలావస్తుంది? "ఆత్మరక్షణతప్ప ఇంకేదైనాఇస్తాను. అంతవరకు ఉరి తీయమని వాగ్దానం ఇచ్చేనే. ఈసమస్య చాలాచిత్రంగా ఉం"దని విస్తుపోయేడు చక్రవర్తి. కాని అల్లా ఉపదేశించిన ఆ ఉపా

దిక్కు లేని వాడికి దేవుడే దిక్కు

యమునకు చాలా సంతోషించి, ఆ బాలుని వదిలివేస్తున్నానని ప్రజలకు చెప్పేడు చక్రవర్తి. ప్రజలు కూడ తికమకపడ్డారు మొదట. ఆ తరువాత సమాధానపడ్డారు. కాబట్టి దిక్కులేనివారికి దేవుడే దిక్కు. ★

ఆధునిక ఇల్లాళ్లా, అనాచారాలా

(36-వ పేజీ తరువాయి)


తాలింపు వేసేటప్పుడు సరిగ్గా చూసుకోలేదో ఏమో కాని కూరలో చిన్న బొద్దింకపిల్ల! మావదిన వంకాయలు తరుగుతుందంటే నాకు భయం! ఏమంటే ఆవిడగారు తరిగిననాడు కూరలో రెండుసార్లు తెల్లని పురుగులు పొడ గట్టినవి నా కళ్ళకి.

సరే కొందరుఇల్లాళ్ళు పప్పులూ బియ్యీ మూ ముస్నగువానిలో బెడ్డలు సరిగ్గా ఏరించి అయినా పెట్టుకోరు. ఆఫీసుకు పోయే తొందరలో మగవాళ్ళు తినేదేకొంచెం. దానికి సాయం మన వంటకూడా సగంసగం గానే అవుతూ వుంటుంది. ఉడికీ ఉడకని వాటితో ముద్ద నోట్లో పెట్టుకొనే సరికి ఈ రాళ్లు 'కటక్'మని పంటిక్రింద పడడమూ, కూరలో పురుగులూ అవీ కనబడడమూ తటస్థిస్తే వాళ్లు ఆ కోపంలో అన్నం విసిరికొట్టి ఇల్లాళ్లని నాలుగుతిట్టి లేచి వెళ్లిపోతారంటే తప్పెవరిదీ? ముందే కాస్త జాగ్రత్తపడితే మనకి వాళ్ళు తిట్టేరన్న మనస్తాపానికి తోడు తినకుండా వెళ్లేరన్న బాధకూడా ఉండదుగా.

మా తోడికోడలూ నేనూ అన్నం తింటున్నాము ఒకసారి. గంటె దగ్గర లేకపోవడం వల్ల ఆవిడ తన ఎడంచేత్తో మజ్జిగ కలియబెట్టి నాకు కొస్తవంచి తనుకొస్త వంచుకుంది. ఆవిడ పెద్దది. నే నేమనగలనూ...

మరికొందరు చస్తే ఊరగాయల్లోనూ పచ్చళ్లలోనూ స్పూన్సు వాడరు. చేత్తో నే! అలాగకాక చెంచాలతో వేస్తే అతిథులకు వడ్డించేటప్పుడు మర్యాదగానూ ఉంటుందీ; తడి చేతులతో తాకకపోవడంవల్ల మన ఊరగాయలూ అవీ పాడైపోవు! అతిథులకు వెండి కంచాలలో పెట్టడం కొందరు గొప్ప అనుకొంటారు. పెట్లో ఉంచి ఎనాడూ తోమని వెండిచెంబు బయటికితీసి ఒకసారి నీళ్ళతో కడిగి అతిథులకు మంచినీళ్ళు పెడతారు మరికొందరు. ఆ నీళ్ళుకూడా ఏదో తుప్పువాసన కొడుతూ వుంటాయి. అంతకంటె శుభ్రంగా ఏ గాజు గాసులోనో మంచినీళ్ళు పెట్టి శుభ్రమైన అరటి ఆకులోనో వడ్డించే పదార్థాలు చేత్తో కాక గరిటలతోనో స్పూన్లతోనో వేస్తే మనకీ వాళ్లకీకూడా హాయి. ఆ అరటాకు తర్వాత అవతలపడేయవచ్చు. అసలు కొందరికి అతిథులకు ఉపయోగించని సబ్బూ, చాకింటి తువాలూ ఒకవేళ వాళ్ళు బట్టలు తెచ్చుకోకపోతే చాకింటి మడతా ఇవ్వాలని తెలియదు. గొప్పకోసం ఏ సిల్కు చీరో ఇస్తారు. అది ఉతకడానికి వీలుకాదు! కొందరు రెండు రోజులు ఉంటామని తెలిసి వచ్చే అతిథులు దువ్వెన్న, సబ్బూ వంటివి తెచ్చుకొంటారనుకోండి. ఒకవేళ తెచ్చుకోకపోతే సంగతే నేను చెప్తున్నాను.

వీటి విషయం ఎలాగ ఉన్నప్పటికీ తినే పదార్థాలు తయారుచేసేటప్పుడు మాత్రం కొంచెం శుభ్రంగా ఉండడం ఇల్లాలి ధర్మం. పెళ్ళి అయ్యేవరకూ విద్యాభ్యాసంలో మునిగితేలుతూఉంటే ఆధునిక యువతికి గృహిణిగా రూపొందేముందు కొంచెం కూడా పెద్దలచాటున వంటింటి ట్రైనింగు లభించే అవకాశం ఉండడంలేదు. డ్రాయింగురూమ్ బాగా అలంకరించి ఉంచుకొన్నంత మాత్రాన 'ఇల్లును చూసి ఇల్లాలిని చూడు' అనేమాట నిజమైపోదు. టేబులు మీలూ, ఫోర్కులూ, స్పూనూ ఉపయోగించే పాశ్చాత్యులను చూసి స్వామీ వివేకానంద 'మీరు సుచిగా తింటారు. మేము శుచిగా శుభ్రంగా తయారుచేసి కొంటాము' అన్నారట! దేశదేశాలూ మారు మ్రోగిన ఆమహాత్ముని మాట వమ్ముచెయ్యడం మన ధర్మంకాదు. మీదు మిక్కిలి శుచిగా తినడాన్ని కూడా మనం నేర్చుకోవలసి ఉంది! ★



న్యూఢిల్లీ లేఖ

(5 వ పేజీ తరువాయి)

లక్ష్మణన్, డా॥ బి. బి. దీక్షిత్.

ఆ తరువాత ఇప్పుడు మళ్లీ కొత్తగా సర్జరీకి ఒక ప్రొఫెసర్ని, మెడిసిన్‌కి ఒక ప్రొఫెసర్ని వేస్తున్నారు. సర్జరీకి లెఫ్టినెంట్ కర్నల్ సంగంలాల్‌ని, మెడిసిన్‌కి డా॥ విగ్‌ని నియామకసంఘం సిఫార్సుచేసింది. వీరి అర్హత లేమిటంటే, కర్నల్ సంగంలాల్‌కి గడచిన అయిదేళ్ళగా సర్జరీతోను, బోధనతోను సంబంధంలేదు. ఇక డా॥ విగ్ అమృత్ సర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాలుగా పదవి విరమించబోయే స్థితిలో ఉన్నారు.

ఆసియాదేశాలు వైద్యపరిశోధనలో సలహా కోరితే ఇవ్వగల వైద్యనిలయాన్ని స్థాపించాలని భోర్ కమిటీ ఆశించినదానికీ, ఇప్పుడిక్కడ జరిగేదానికి ఎంత అంతరం ఉందో గ్రహించవచ్చును.

ఈ నిలయం పోస్టుగ్రాడ్యుయేట్ విద్యాబోధనకు, పరిశోధనకు ఉద్దేశింపబడినది. గడచిన రెండేళ్ళనించీ ఏడాదికి 50 మంది విద్యార్థుల్ని చొప్పున ఎమ్. బి. బి. ఎస్. కోర్సుకు తీసుకుంటున్నారు. ఢిల్లీలో ఆడవారి కొక వైద్యకళాశాల ఉండనే ఉన్నది. మగవారి కొక వైద్యకళాశాలను స్థాపించాలని నిశ్చయించారు. ఇది హోంమంత్రి పండిట్ జి. బి. పంత్ పుణ్యమా అని 1961 నాటికి పని ప్రారంభించవచ్చును. అఖిల భారత వైద్యనిలయం కూడా మెడిసిన్, సర్జరీలలో విద్యార్థులను డిగ్రీకోర్సుకు తర్ఫీదుచేస్తోంది.

ఈ వైద్యనిలయానికి స్వంత ఆస్పత్రి లేదు. 'ఒంటె, అరబ్బీవాడు' కథలో మాదిరిగా ఇది సఫ్దర్ జంగ్ ఆస్పత్రిలోకి వ్యాపిస్తోంది. ఈ ఆస్పత్రి ఈనాడు రెండువిధాలుగా పనిచేస్తోంది. పరిసరాల్లోఉండే పట్టణ, గ్రామీణప్రజలకు ఆస్పత్రిగానూ, కేంద్ర ప్రభుత్వోద్యోగులకు కూడ ముఖ్యమైన ఆస్పత్రిగానూ ఉపయోగపడుతోంది.

ఇప్పటికి 100 మంది విద్యార్థులను చేర్చుకోవటంచేత సఫ్దర్ జంగ్ ఆస్పత్రిలో 60 మంచాలు కొత్తగా ఏర్పాటుచేసి విద్యార్థులకు శిక్షణసౌకర్యాలు కలిగించారు.

ఆస్పత్రిలోని సిబ్బందిని ఉపయోగించుకోవటానికి అవకాశమున్నా, అలా చెయ్యకుండా వైద్యనిలయపరిపాలకవర్గం కొత్తగా డాకర్లను, సర్జన్లను, వివిధచికిత్సలలో నిపుణులైనవారిని నియమించాలని ఆలోచిస్తున్నది. అసలే విదేశీద్రవ్యం కొరతగా ఉన్నదని తెలిసికూడా, ఆస్పత్రిలోని సామగ్రి, పరికరాలు, బాగులేవని కొత్త సామగ్రిని, పరికరాలను దిగుమతిచేసుకోవాలని నిశ్చయించింది.


ఈకారణాలచేత వైద్యనిలయం సిబ్బంది పద్దుకింద వ్యయం రూ. 72 లక్షల 66 వేల నుంచి 145 లక్షలకి, సామగ్రి పద్దుకింద వ్యయం 59 లక్షలనుంచి 251 లక్షలకి పెరిగింది. వైద్యనిలయం నిర్మాణం పూర్తయితే మొదట్లో అనుకున్నట్లు 2 కోట్ల 65 లక్షల రూ. కాక, 5 కోట్ల 56 లక్షల రూ. ఖర్చు అవుతుందని ఇప్పుడు అంచనా వేశారు. స్వతంత్ర భారతంలో ప్రజాధనానికి విలువ లేకుండా పోయింది. వైద్యనిలయం ఇప్పటి ప్రకారమేపనిసాగిస్తున్నట్లయితే సఫ్దర్ జంగ్ ఆస్పత్రిలో రోగులు క్రిక్కిరిసిపోవటమే కాదు, ఒకేరకమైన సిబ్బందిని, సామగ్రిని అక్కడా, ఇక్కడాకూడా సమకూర్చుకోవటం, ప్రస్తుతం అత్యవసరంగాఉన్న నిపుణులను వృథాగా చేర్చుకుని ఉంచివేయటంజరుగుతుంది. దీనిబదులు సఫ్దర్ జంగ్ ఆస్పత్రిలోఉన్న నిపుణులను, సామగ్రిని ఎందుకు ఉపయోగించుకోరాదో బోధ పడకుండా ఉంది.

రెండు ఉదాహరణలిస్తే సరిపోతుంది. సైన్యానికిచెందిన మత్తుమందు నిపుణునిఒకణ్ణి వైద్యనిలయంలో చేర్చుకున్నారు. వైద్యనిలయానికి ఆస్పత్రి లేకుండా ఈ నిపుణునితో ఏంచెయ్యదలిచారు? అసలు ఇతడికి బోధనానుభవం ఏమీ లేక పోయినా ఎందుకు చేర్చుకున్నారు? రేడియాలజిస్టుని ఇంకొకణ్ణి చేర్చుకున్నారు. ఇతడూ అంతే. జీతమిచ్చి పని చేయించుకోకుండా ఊరుకోటానికి ఇతడొక ఉదాహరణగా ఉపయోగపడుతున్నాడు. ఏడాది అయింది ఇతణ్ణి వైద్యనిలయంలో చేర్చుకుని. ఇప్పటిదాకా ఎంత రేడియోలజీ చేశావయ్యా అని ఇతణ్ణి ఎవరైనా అడిగితే బావుండును!

ఇక ఏడాదికి 50మంది చొప్పున చేర్చుకుంటున్న విద్యార్థుల సంగతేమిటి? అఖిల భారత వైద్య నిలయంపై అఖిలభారత వైద్యమండలికి పర్యవేక్షణ, అజమాయిషీ అధికారాలు లేవు. వైద్య నిలయం తనే స్వయంగా డిగ్రీలిస్తుంది.

బాగానే ఉంది. కాని వైద్యనిలయంలో డిగ్రీలు పుచ్చుకున్న వారికి ఇతర వైద్యకళాశాలల విద్యార్థులతో సమానమైన విలువ, ప్రతిపత్తి, ఉద్యోగావకాశాలు ఉంటాయా అని ప్రశ్న. సిద్ధాంతరీత్యా ఉండవచ్చుగాని, యథార్థంగా చూస్తే వీరికి అవకాశాలు సందేహాస్పదమే. వైద్యనిలయానికి స్వతంత్ర ప్రతిపత్తి అయితే ఇచ్చారుగాని, అక్కడి విద్యార్థులకి భవిష్యత్తు లేకుండా చేశారు.

నిష్పాక్షిక విచారణ జరిగితీరాలని ఒత్తిడి చేయటానికి ఇవన్నీ ప్రబల కారణాలు కాగలవు. రాబోయే బడ్జెట్ సమావేశంలో పార్లమెంటు సభ్యులు ప్రసక్తి తీసుకువస్తారని అభిజ్ఞులు అనుకుంటున్నారు. ★



చెంచులక్ష్మి

బి. ఏ. ఎస్. ప్రొడక్షన్స్‌వారి "చెంచులక్ష్మి" పూర్తికావచ్చింది. శ్రీ బి. ఏ. సుబ్బారావు డైరెక్టు చేస్తున్న ఈ చిత్రంలో చెంచులక్ష్మిగా అంజలీదేవి, నరసింహస్వామిగా నాగేశ్వరరావు, హిరణ్యకశిపుడుగా ఎస్. వి. రంగారావు నటిస్తున్నారు. తదితర నటీనటులు పుష్పవల్లి, రేలంగి, ఎ. వి. సుబ్బారావు మున్నగువారు. సంగీత దర్శకుడు ఎస్. రాజేశ్వరరావు. కళాదర్శకుడు వాలి.

సినిమా వార్తలు

ఈ చిత్రంలో అంజలీదేవి మహాలక్ష్మిగాను, ఆమె అంశతో భూలోకంలో జన్మించిన చెంచులక్ష్మిగాను ద్వంద్వ పాత్రాభినయం చేస్తుంది. మహాలక్ష్మికి, చెంచులక్ష్మికి మధ్య కలహం చెలరేగడం ఈ చిత్రంలో ముఖ్యాకర్షణ అట.

* * *

శోభ

పొన్నలూరి బ్రదర్స్‌వారి "శోభ" చిత్రం దాదాపు పూర్తికావచ్చింది. అంజలీదేవి, రామారావు, రేలంగి, రాజసులోచన మున్నగువారు నటిస్తున్న ఈ చిత్రం మార్చిలో విడుదల కాగలదని తెలుస్తున్నది. దర్శకుడు కె. కామేశ్వరరావు. సంగీతం ఎ. ఎమ్. రాజా. కెమెరా



దీప్ & ప్రదీప్ ప్రొడక్షన్స్‌వారి "ఏక్ షోలా" చిత్రంలో మాలాసిన్హా.



బ్లాక్ & వైట్ మువీస్‌వారి "షరాబీ" లో దేవానంద్, మధుబాల

అన్నయ్య. తరవాతచిత్రం "దైవబలం" త్వరలో సెట్సుకు పోతున్నది. ఇది జానపద చిత్రం. తెలుగు, తమిళభాషల్లో తీస్తారు. నిర్మాత వసంతకుమారరెడ్డి డైరెక్టు చేస్తారు. రచన పరశురామ్, సంగీతం అశ్వత్థామ.

*. * *

ఆడపెత్తనం

ప్రభా ప్రొడక్షన్స్‌వారి "ఆడపెత్తనం" కొద్ది కాల్‌షీట్లలో పూర్తి కానున్నది. అంజలి, నాగేశ్వరరావు, కన్నాంబ, రేలంగి, రాజసులోచన, గుమ్మడి, సూర్యకళ, పెరుమాళ్ళు, కుటుంబరావు, బాలకృష్ణ, ఛాయాదేవి, అమ్మాజీ, రావుకోటి, బొడ్డపాటి మున్నగువారు నటించుతున్న ఈ చిత్రాన్ని ఆదుర్తి సుబ్బారావు డైరెక్టు చేస్తున్నారు. సంగీతం రాజేశ్వరరావు, వేణు. రచన పినిశెట్టి. కామెరా అజిత్‌కుమార్. ఏప్రిల్‌లో విడుదల కాగలదని తెలుస్తున్నది.

* * *

అనుపమావారు ఒక హాస్యచిత్రాన్ని ప్రారంభిస్తున్నారు. దీన్ని తిలక్ డైరెక్టు చేస్తారు. పినిశెట్టి శ్రీరామమూర్తి సంభాషణలు వ్రాస్తున్నారు.

* * *

మాయాబజారు

ఆంధ్రలో బాగా విజయం పొందిన విజయవారి తెలుగు "మాయాబజారు" చిత్రాన్ని ఇటీవల మద్రాసులో సన్, సెలెక్టు థియేటర్లలో విడుదల చేశారు.

* * *

రష్యన్ "పరదేశి"

ఇటీవల భారత దేశంలో విడుదలయిన "పరదేశి"ని రష్యన్ భాషలో మాస్కోలో కూడా జనవరి 24 విడుదల చేశారు. నాలుగు థియేటర్లలో ఒకేసారి ఈ చిత్రం వేస్తున్నారు. నాలుగు థియేటర్లూ క్రిక్కిరిసి పోతున్నాయట. మార్చిదాకా అడ్వాన్సు బుకింగ్ అయిపోయిందట. దర్శకుడు, నిర్మాత, రచయిత అయిన కె. ఎ. అబ్బాస్ ఈ చిత్ర ప్రదర్శన ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. సోవియెట్ ప్రధాని బుల్గానిన్, కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి క్రుష్చేవ్ కూడా హాజరయ్యారట.

* * *

అశోక్‌కుమార్, వైజయంతీమాల, జగదీష్, మన్‌మోహన్‌కృష్ణ మున్నగువారు నటిస్తున్న నరసూ హిందీ చిత్రం "సితారోంసే ఆగే" మార్చిలో విడుదల అవుతుందట. నరసూవారు తీస్తున్న మరొక హిందీ చిత్రంలో నిమ్మి, ప్రదీప్ కుమార్, లీలా చిట్నీస్, మాస్టర్ రోమీ, రాధాకిషన్, మదన్‌పూరీ మున్నగువారు నటిస్తున్నారు. దీనికి దర్శకుడు మోహన్ సెగాల్.

* * *

పద్మశ్రీ "నర్గీస్"

రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో రాష్ట్రపతి తనకు "పద్మశ్రీ" బిరుదం ఇచ్చారని న్యూఢిల్లీనుంచి టెలిగ్రాం రాగానే నర్గీస్ తన కళ్ళను తనే నమ్మలేక పోయిందట. ఆమె ఏదో సినిమాకు వెళ్ళబోతున్న సమయంలో ఈవార్త అందినదట. సినిమా చూస్తున్నంతసేపూ ఆమె ధ్యాస అంతా తనకు జరిగిన అపూర్వ గౌరవం మీదనే ఉందట. "రాష్ట్రపతి రిపబ్లిక్ దినోత్సవ బిరుద ప్రదానం ద్వారా చలనచిత్ర కళాకారులను సన్మానించటం నాకు చాలా సంతోషంగా ఉంది. చిత్రాలలో పనిచేసే మేము కూడా ముఖ్యమైన వాళ్ళమేనన్న,



చేతనావారి "గుళ్లోపెళ్లి"లో రమణారెడ్డి, చదలవాడ, సూర్యకళ.

*   *   *   *   *   *

మద్రాసు లాకాలేజీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతికోత్సవంలో పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు పంచిపెడుతున్న సావిత్రి. ఉత్సవ సభకు జెమినీ గణేశన్ అధ్యక్షత వహించారు.



దేశాభివృద్ధికి మేము కూడా యథాశక్తిగా కృషిచేస్తున్నామని ఈ బిరుదుల ద్వారా గుర్తించినట్లయింది. ఇది మాకు చాలా ఉత్సాహం ఇస్తుంది; ఇంకా మహత్తర కృషిచేసేందుకు ప్రోద్బలం ఇస్తుంది" అని ఆమె ప్రకటన చేసింది.

*   *   *

[illegible]

జాతిరీత్యా అమెరికనకీ, యూరోపియన్లకీ తేడాఏమీ లేకపోయినా, ఆచారాలో, అలవాట్లలో తేడాలున్నాయి. యూరోపియన్లు కొన్ని శతాబ్దాలుగా వస్తున్న ఒకరకమైన జీవితవిధానానికి, అమెరికన్లు అప్పటికప్పుడు, అక్కడికక్కడ కొత్తగా సృష్టించుకున్న మరొకరకమైన జీవితవిధానానికి అలవాటుపడ్డవారు. 'మాది సరికొత్త నాగరికత' అని అమెరికను గొప్పగా చెప్పకుంటే, 'మాది ఎంత ప్రాచీన నాగరికతో!' అని యూరోపియనూ గొప్పగానే చెప్పకుంటారు. వాళ్లి అలవాట్లని వీళ్ళు వేళాకోళంచేస్తే, వీళ్ళ అలవాట్లని వాళ్ళు వేళాకోళంచేస్తారు.

'అమెరికన్ మార్కు జీవితవిధానము నేవాడుడు' అని బుజ్జగింపుగా ప్రచారంచేసే చిత్రాలు లోగడ చాలావచ్చాయి. అటువంటిదే ఒక చిత్రం (వార్నర్) "దిప్రిన్స్ ఎండ్ ది షోగర్ల్" ఇటీవల మద్రాసు వచ్చింది.

షేక్స్పీరియన్ నటుడు సర్ లారెన్స్ ఒలీవియర్, హాలీవుడ్ తార మేరిలిన్మన్రో కలిసి నటించిన ఈ చిత్రం మేరిలిన్మన్రో ప్రొడక్షన్స్ పేరిట తయారైంది. నిర్మాత, దర్శకుడు లారెన్స్ ఒలీవియర్.

కథాకాలం మొదటి ప్రపంచయుద్ధానికి ముందు. అయిదవజార్జి పట్టాభిషేక సమయం. పట్టాభిషేకం చూడటానికి లండన్వచ్చిన అతిథుల్లో కార్పెతియా అనే ఉత్తుత్తి బాల్కన్రాజ్యపు రాజప్రతినిధి (సర్ లారెన్స్) ఒకడు. ఇతగాడు వినోదార్థం ఒక నాటకం చూడబోయి, దాంట్లో వేషం వేసిన ఒకానొక అమెరికన్ జఘన సుందరిని (మేరిలిన్) చూసి ముచ్చటపడి, ఆరాత్రికి తనతో భోజనమారగించటానికి రమ్మని ఆహ్వానిస్తాడు. ఆమెతో ఆరాత్రి విలాసంగా గడుపుదామనుకున్న అతనికి అమెరికన్ సుందరి పద్ధతులేమీ నచ్చవు. ఆమె అమెరికన్ పద్ధతు లతనికి నచ్చనట్లే, అతని యూరపియన్ రాచరికపు పద్ధతులామెకీ కొత్తచేస్తాయి. అయినా వారిద్దరికీ మధ్య ఆత్మీయత ఏర్పడ్డానికి ఇవేమీ అడ్డంరావు. ఈ రాజప్రతినిధి కొడుకు కార్పెతియాకు అసలు రాజు. అతడింకా మైనరు. మరొక పద్దెనిమిది



అశోకావారి "భూలోకరంభ"లో మారువేషాలలో ఉన్న రాజసులోచన, చలం

నెలలకిగాని ఆ అబ్బాయిచేతికి రాజ్యంరాదు. ఆ అబ్బాయి ఆధునిక భావాలు కలవాడు. మోటారుసైకిలెక్కి ఇష్టం వచ్చినట్లు తిరగాలనీ, తన రాజ్యంలో ఎన్నికలుజరిపి ప్రజలకి హక్కులివ్వాలనీ అతని సరదా. అతని సరదా సరాసరి 'కైయిజర్' కౌగిలిలోకి లాక్కుడుతుందని అతని తండ్రియైన రాజప్రతినిధి భయం. ఎన్నికలు జరిపితే ఎవరు నెగ్గుతారో తెలియదుకదా అని అతని అనుమానం. "అదే ఎన్నికల్లో ఉన్న మజా" అని అమెరికన్ పిల్ల నచ్చ చెబుతుంది. చివరి కామె సలహా అతనికి నచ్చుతుంది. యుద్ధాలూ, విప్లవాలు తీర్చలేని ఒక జటిల రాజకీయ సమస్యని ఒక మేరిలిన్ మన్రో అనాయాసంగా తీర్చిపారేస్తుంది.

ఇప్పటిదాకా జఘనచాలనం మాత్రమే అవసరమైన పాత్రలే ఎక్కువగా ధరిస్తూ వచ్చిన మేరిలిన్ మన్రో తన ఈ సొంత చిత్రంలో అమెరికన్ జీవితవిధానపు ట్రేడ్ మార్కుగా చక్కని నటన కూడా కనబరిచింది. ఠీవి, హాస్యం, వ్యంగ్యం అన్నీ కలిసిన రాజప్రతినిధిగా ఒలీవియర్, కార్పేతియన్ రాజ్యపు వృద్ధరాణి పాత్ర ధరించిన డేమ్ సిబిల్ తార్న్డైక్ అత్యుత్తమంగా నటించారు. బ్రిటిష్‌రాజు పట్టాభిషేక దృశ్యాలు మేరిలిన్ మన్రో లాగానే నిండుగా, నేత్రపర్వంగా ఉన్నాయి. ☆



అంతర్జాతీయ ప్రేమలో పడ్డాడు గుర్నాథం (చలం) - బర్మా అమ్మాయి "పింగ్లా"ను ప్రేమించాడు - వేరే పెళ్లి సంబంధం చూడాల్సివస్తే తన బదులు వాసు (నాగేశ్వరరావు)ను వెళ్లి రమ్మంటున్నాడు. రిపబ్లిక్ వారి "పెళ్లి సందడి"లో ఒక హాస్య ఘట్టం

★ మహాభారత ప్రచురణ ★

పాఠకుల సలహాలు; మా విజ్ఞప్తి

ఆంధ్ర వారపత్రిక సంపాదకులకు :

ఆర్యా,

తాము మకర సంక్రాంతి పర్వదినము నుండి "ఆంధ్ర వారపత్రికలో ప్రచురణ ప్రారంభించిన ఆంధ్ర మహాభారతము బహుజనాదరణీయముగా నున్నదనుటలో సందియము లేదు. నాకు తోచినంతవరకు కొన్ని సూచనలు చేయుచున్నాను. తాము అన్యథా భావించక ఆచరణ యోగ్యములైనచో సమాదరింప ప్రార్థన.

భారతమును సంపూర్తిగా ఉపాఖ్యానములనుగూడా వదలక ప్రచురించవలెను.. ఎందుకనిన మాబోంట్లకు—ఉపాఖ్యానములతోగూడ మీరు ప్రకటించు భారతము క్రమశః కొంతకాలమునకు ఒక పుస్తకరూపము దాల్చి బైండుచేయించి ఉంచుకొనుటకు వీలుండును.

పత్రికలోని మధ్యనున్న నాల్గు పేజీలలో ప్రకటించినచో, ఆ పుటలను అట్లనే తీసి బయిండు చేయించుకొనుటకు సౌలభ్యమేర్పడును. కాన తామీ రెండు విషయముల నాలోచించి, ఆంధ్రప్రజలకు మేలు చేయ ప్రార్థన. తాము సాగించుచున్న ఈ బృహత్తరకృషి ప్రజలకు, దేశమునకు సుఖశాంతుల కలుగచేయగలదని ఆశించుచున్నాను.

—గ॥ దక్షిణామూర్తి, హైదరాబాదు]

* * *

ఆర్యా,

మీరువారపత్రికద్వారా ప్రతివారమందజేయుచున్న ఆంధ్ర మహాభారతము పాఠకులకు రసవంతముగనున్నది. కాని, ఒక్క విషయము. సామాన్య పాఠకులకు అర్థమగునట్లుపద్యములకు తాత్పర్యమును, విమర్శమునుకూడ అందజేసినచో మీరు మీ పత్రికద్వారా ఒనరించు సేవతప్పక అందరి ఆదరాభిమానములను అందుకొనగలదు.

—ఇందుర్తి వేంకటకృష్ణమూర్తి, మద్రాసు]

* * *

ఆర్యా,

మీరు సంక్రాంతి సంచికనుంచి ప్రచురిస్తున్న ఆంధ్ర మహాభారత రసవత్తర ఘట్టాలను చదివి ఆనందిస్తున్నాము. ప్రత్యేకంగా ఆ పేటలు తీసి పెట్టకోడానికి వీలుగా వుంచేట్లు ప్రచురిసే మరీమంచిది. పద్యాలలో అరసున్నలను తీసివేసి ఆధునిక పద్ధతిలో సుస్పష్టంగా ప్రచురిస్తారని ఆశిస్తున్నాను.

—ఎం. వెంకటేశ్వర్లు, లింగసముద్రం]

* * *

ఆర్యా,

లోగడ మీ దినపత్రిక ఆదివారం సంచికలో వాల్మీకి రామాయణం వచనకావ్యం ప్రచురించి ప్రజలకు వివేకమును, విజ్ఞానమును గల్గించుటేగాగ పాఠకులు భక్తితత్పరులగుటకు కారకులైరి.

మరల ఇప్పుడు మీ వారపత్రికలో ఆంధ్ర మహాభారతములోని ముఖ్య ఘట్టములను యథాతథముగ ప్రచురించుచూ పాఠకలోకమునకు అపారమైన సాహిత్య సేవ చేయుచున్నారు. ఇది ఎంతయు ప్రశంసనీయము.

—తంగెళ్ల రామారావు, పోతవరం]

* * *

ఆర్యా,

భారతీయ సంస్కృతి కిచిహ్నాము, ఆంధ్రుల అభిమాన గ్రంథము అయిన భారతమును వారపత్రికలో ప్రచురించుట విశ్వదాత నాగేశ్వరరావు పంతులుగారి ఆత్మకు శాంతి చేకూర్చునని తలచుచున్నాను. అందుకు పాఠకులమైన మేము జోహారులు అర్పించుచున్నాము. పాఠకుల పాలిటికి ఈ ప్రచురణ ఒక జ్ఞానజ్యోతి. కొందరు పాఠకులు భారతములోని భాష అర్థముగాక, దానివిలువను గ్రహించలే ఆ రెండు కాగితములను త్రిప్పివేయుట—గ్రంథాలయములలో నేను చూచుచున్నాను. కనుక, మీరు పద్యమునకు క్రింద చక్కటి భాషలో వచనముకూడా చేర్చి ఆంధ్ర పాఠకులకు అందచేయవలసినదిగా కోరుచున్నాను.

—పి. భద్రిరాజు, తిరుపతి]

* * *

ఆర్యా,

తమ వారపత్రికలో ఆంధ్రమహాభారతమును ప్రచురించుచున్నందులకు మీకు నా కృతజ్ఞతాభివందనములు. "తింటేగారెలు తినాలి...వింటే భారతము వినాలి...!" అని అన్నారు మనపెద్దలు. నిజంగా భారత కథలు వింటోంటే, ఉప్పొంగని ఆంధ్ర హృదయం వుండదు. అన్నిటికన్నా మహోత్కృష్టమైన ఈ పవిత్ర గ్రంథ ప్రచురణను మీరు సాహసించి ఆంధ్రపాఠకలోకమునకు అందజేయుచున్నందులకు నేను సర్వదా కృతజ్ఞుడను. చాలామంది దీనిని వచనరూపంలోనో, ఇంకొక విధంగానో ప్రచురించమని కోరుతున్నారు. అసలు యథాతథంగావున్న గ్రంథాన్ని చదివినప్పుడే, అందులోని యథార్థమాధుర్యాన్ని మనం గ్రహించ కల్గుతాం. అప్పుడే మనం ఆ కవి హృదయాన్ని అవగాహన చేసుకోగల్గుతాము. అంతేకాని, దానిని మరోవిధంగా మార్చి ప్రచురిస్తే, దానిస్వారస్యమునకే భంగం కలుగవచ్చు. కావున ఇలాగే యథాతథంగా ప్రచురిస్తారని ఆశిస్తున్నాను.

—తంగెళ్ళ పాండురంగశర్మ, విజయవాడ.]

★ మా విజ్ఞప్తి ★

గత రెండుమూడు వారాలలోనూ పాఠకులవద్దనుంచి మా కార్యాలయానికి కొన్ని వందల లేఖలు వచ్చినవి. వారు వాటిలో చేసిన సూచనలకు హృదయపూర్వక కృతజ్ఞత తెలియజేస్తున్నాము. యథాతథంగా ఆంధ్ర మహాభారత పఠనం కొంతవరకు కష్టసాధ్యము కావచ్చు గాని, అసాధ్యం మాత్రం కాదని మా అభిప్రాయం. పాఠకులలో భాషాజ్ఞానం లోపించిందనిగాని, దానికి నేటి విద్యావిధానమే కారణమనిగాని చెప్పడం సాహసమనిపించుకుంటుంది. భాషాజ్ఞానమన్నది ఒక్క పాఠశాలలో సాగించే విద్యాభ్యాసంద్వారా మాత్రమే చేకూరేదికాదు. దీనికి కొంతవరకు ప్రత్యేక పరిశ్రమ, స్వయం కృషీ అవసరం. కాగా, ఓర్పుతో, దీక్షతో పఠిస్తే భారతం అర్థంగాకపోదని మా విశ్వాసం. అట్టి ఓర్పును దీక్షను, శ్రద్ధాసక్తులను పాఠకులలో ప్రోత్సహించాలన్నదే మా ఉద్దేశం. అందుచేత టీకాతాత్పర్యాల ప్రచురణ అనవసరమని భావిస్తున్నాము.

వారపత్రిక సంచికఅంతా ఒకేసారి (ముఖచిత్రం పేజీలు మినహా) ఒకేరకం కాగితంమీద అచ్చవుతుంది కాబట్టి భారతానికి కేటాయించిన నాల్గు పేజీలకు ప్రత్యేకంగా మంచిరకం కాగితం వాడడం సాధ్యపడదని విన్నవిస్తున్నాము.

అతిప్రధానమైన ఘట్టాలు వచ్చినప్పుడు వాటిని మధ్య పేజీలలో ముద్రించే విషయం పరిశీలిస్తామనికూడా మనవిచేస్తున్నాము. ★

—సం.]

★ సాహిత్యగోష్ఠి ★

(8-వ పేజీ తరువాయి)

జంబుకశర్మ : చాలు చాలు నీ ప్రగల్భములు. మా కవితలో మంచిని గుర్తింపనేరక అందందేని తప్పులు గలవాయని వెదకులాడుచున్నావు. ఇంద్రనీలమణి సన్నిభమైన దేవరవారి యంగముల నెల్లవిడి దారుభిన్న కారణోద్భవములైన శ్రీవారి మెసమీది పుండ్లపైకే పోవుచున్న ఆ యీగ యొక్క-శియే నీకుసాటి.

(ప్రతీహారి ప్రవేశించి)

పికస్వామిగా రేగుదెంచి యేలినవారి యాజ్ఞకై హజారమున వేచియున్నారు.

సార్వభౌముడు : తత్ క్షణమే ప్రవేశ పెట్టుము.

పికస్వామి : (ప్రవేశించి.)

స్వస్తి! ఖరశునక జంబుక
శస్త్ర చరిత్రా! ప్రశస్త చరణ చతుష్కా!
నిస్తుల ముఖరుచిజిత వి
శ్వస్తా! స్థూలోగ్రదేహా! సైరిభరాజా!

ఆస్థాన విద్వాంసులు విలోలజిహ్వులై రోజుచున్నారు. కతమేమో! మరల బండిరాలు, అరసున్నలు వీనివిషయమై యేదేని యుపద్రవము సంఘటిల్లినదా!

రాసభ : ఓరీ! తుచ్ఛుడా! భాషాస్వరూప మేని ఎరుంగని యాధునిక కవులతో చేరి మహాకవి ప్రోక్తములైన అర్థానుస్వార శకట రేఫములను నిందింతువా! ఛీ!

కరటశాస్త్రి : వాని స్వరూపమే యెరిగి యుండిన అచ్చతెనుగు పద మొండైనలేని అట్టి నీరసకవిత్వము చెప్పియుండునా యీతడు.

జంబుక : విలక్షణ కవియైన యీ పిక స్వామిని సార్వభౌములు తగినరీతిని దండింతురు గాత.

శునక : మహారాజా! మూన మవలంబించుట కిది తరుణముగాదు. సారస్వతమునకు ముప్పువాటిల్లుచుండ సారసత్వులైన తమరే యుపేక్షించిన మాదృశులకు దిక్కెవ్వరు?

సార్వ : శునకరాజా! స్వానుభవమున నేను చెప్పబోవునది వినుడు, "బండి" యొక్కటియే మహాభారము — దానిలో "ఱా"ళ్లుగూడ చేర్చిన నిక చెప్పవలసినదే లేదు. ఆ కష్టమునకు నా కంఠముమీది వ్రణములే సాక్ష్యములు. కనుక బండి ఱాలను నేను భరింపను, పిక స్వామిగారేమందురు.

కరట : అరసున్నలు లేని కవిత్వము చెప్పకొనువారి యభిప్రాయ మెవరికి కావలయును.

పిక : ఆగుము— ఆగుము—
మతిమాలి వెఱ్ఱికూతలు
క్షితిపతి కట్టెదుటఁ బల్క సిగ్గేలేదా?
యతియుం బ్రాసముఁ గుదురక
వెతలందను నీది యొక కవిత్వంబేనా!

అరసున్నలు బండిరాలు భాషకు అజాగళ స్తనములు.

శునక : నీ పుణ్యమా యని యతిప్రాసములకు ముప్పు తేలేదు.

సార్వ : ఈ అర్థానుస్వారముల విషయము నా కర్థముగుటలేదు.

జంబు : తవుటి ముద్దవలె విశదీకరించెద- ఆస్వాదింపుడు- "కలుగు" అను పద మెత్తుకొనుడు- అర్థానుస్వార ముంచితిమా నామవాచకము: తీసివైచితిమా క్రియాజన్య విశేషణము.

సార్వ: ఈ ఉంచుట తీసివేయుట ఏల సంభవించును?

జంబు : దేవరవారు సావధానులై ఆలకింతురుగాత-తమ కంఠము నే వర్ణించెద మనుకొందు - అప్పుడు ఉపమానమైన 'కలుఁగు'లో అరసున్న తీసివైచిన నేమి కలుగును? అంతదూర మెందులకు? తమరు నిత్యము భుజించు గడ్డి 'పోఁచ'లలో గూడ నట్టిదే కలదు. రాజభోజనము కనుక ఏలినవారు అంతగా పరామర్శించి యుండరు.

సార్వ : ఏమీ! నాకంఠములో నొక అరసున్న కలదందువా? నమ్మజాలను (గుటకలు మ్రింగును).

పిక : మహాప్రభూ! భోజన కాలమున "పోఁచ"లలోని అరసున్న తమ కంఠములో మిగిలిపోయెనేమో! అంత తేలికగా మ్రింగుడు పడునా అది!

సార్వ : శునకరాజా! ఏమి ఈ విపరీతము దంభోళిధారా సన్నిభంబులైన నా దంతముల ఘట్టనమునకు మొక్కజొన్న చొప్పవంటివే తుత్తునియలై ఫేనరూపమున నా నోట వెలువడుచుండ, ఇక అరసున్నలా మ్రింగుడు పడక నా నోట నిల్చునవి?

రాసభ : స్వామీ! శాంతింపుడు — విద్వాంసులు అసత్యము లాడరు. ఒక్కమారు తమ "తోఁక"వంక పరికింపుడు — దానిలోని అరసున్నను తమరే చూడగలరు.

కరట : ఏలినవారి 'వీఁపు'పై మరొక్కటి కలదు!

జంబుక : శ్రీ వారి "మూఁపు"పై మరొక్కటి కలదు!

పిక : మహిష సార్వభౌముని దేహమెల్ల అర్థానుస్వారము చేయుచున్నారు ఆస్థాన విద్వాంసులు!

సార్వ : (లేచి, తోకజాడించి కొమ్ములుత్రిప్పుచు) తుచ్ఛులారా! నన్నే పరిహసింతురా! నా నోటిలో అరసున్న గలదని యొకడు — కాదు, తోక కొసన అని యింకొకడు— లేదు, వీపుపైన అని మరొకడు ప్రేలుదురా! పొండు — లేనిచో పొడిచివైచెదను — (కొమ్ములతో పొడువబోవును.)

[ఆస్థాన విద్వాంసులెల్లరు పారిపోవుదురు]

★

నే చదివిన పుస్తకం; నాకు నచ్చిన పాత్ర!

(7 వ పేజీ తరువాయి)

మను చెందడం అనే తీర్మానాన్ని ప్రత్యక్షర ప్రమాణముచేసిన పుణ్యశీల ఏకవీర. తన నేర్పుతో కూర్చిన పూదండ పట్టాన్ చేతిలో రెండు తునకలు అయిన క్షణములోనే ఆమె హృదయాంభోనిధి కోటిఘోర ఫణిరాజుల పూత్కారాలతో ముఖరితమయి పోయింది. ఇక ఆ జీవితాకాశంమీద వేయిచంద్రు లుదయించినా, ఆరు ఋతువులు ఒక దానివెంట ఒకటి జాగులేకుండా అవతరించినా, లక్షమంచిగంధపుకొండలు గాలి ఊదినా కాలకూటాన్ని ఊదరకొట్టడమే. ప్రళయాగ్నిని రాజపెట్టి భగ్గున మండపెట్టడమే... తన పాలమీగడవంటి మనసుమీద, పండువంటి వయసులో అంకితం అయిపోయిన వీర భూపతికోసం ఏకవీర ఇంకో యిల్లుమెట్టిన మరుక్షణంనుండీ ఎన్నడూ పైకి పొక్కలేదు. ఇంత ఉదాత్తతా, ఉదాసీనతా కరుడు కట్టిన స్త్రీపాత్ర ఏకవీర. హిమసన్నిభమైన



"తల్లి మురిపెం"

[బస్తర్‌లోని మురియాతెగ స్త్రీ]

ఫొటో : గాడె శేషగిరిరావు, రాజమండ్రి]